ప్రకటనల కోసం
సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

బుధవారం 03.09.2025 | సంపుటి : 12 సంచిక : 45 | పేజీలు : 12 వెల : రూ. 4/-

RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

# ప్రాణహిత - చేవెళ్ల పూర్తిచేస్తాం

## ఎస్ఎల్‌బీసీ పూర్తి చేస్తాం: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



- రైతులకు ఉచిత విద్యుత్‌తో వైఎస్ఆర్ చెరగని ముద్ర వేశారు
- యువ, కొత్త ఎమ్మెల్యేలను ప్రోత్సహించడంలో ఎప్పుడూ ముందుండేవారు.. ఆయన స్ఫూర్తిని కొనసాగిస్తాం
- వైఎస్ఆర్ మెమోరియల్ అవార్డ్స్ కార్యక్రమంలో సీఎం రేవంత్

హైదరాబాద్(జనంసాక్షి):వ్యవసాయం దండగ కాదు పండగ చేయాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం వైఎస్ఆర్ సంకల్పించారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని హోటల్ దసపల్లాలో వైఎస్ఆర్ మెమోరియల్ అవార్డ్స్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఎం హాజరైయ్యారు. డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి శ్రీధర్‌బాబు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, కేవీపీ రామచంద్రరావు, రఘువీరారెడ్డి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సుభాష్ పాలేకర్, డాక్టర్ సి.నాగేశ్వరరావు, సి.పద్మకు వైఎస్ఆర్ మెమోరియల్ అవార్డును అందించారు.కొంతమంది మీకు కేవీపీ రామచంద్రరావును అవుతానని తనతో అంటారని, కానీ ఈ తరానికి మిగతా 2లో..

> ఇవాళ ఉచిత విద్యుత్‌ను ఎవరు ఇచ్చినా వైఎస్ఆర్‌నే గుర్తుకు తెచ్చుకుంటారు. భవిష్యత్‌లోనూ ఎవరూ రద్దు చేయలేని పథకాలను ఆయన అమలు చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత- చేవెళ్ల నిర్మించి రంగారెడ్డి జిల్లాకు నీరు ఇవ్వాలని వైఎస్ఆర్ సంకల్పించారు. అయితే గత ప్రభుత్వం ఆ ప్రాజెక్టును పక్కకు పెట్టి రంగారెడ్డి జిల్లాలను నిర్వీర్యం చేసింది.నల్గొండ జిల్లాను ఫ్లోరైడ్ రహితంగా మార్చాలని వైఎస్ఆర్ భావించారు. తాగు, సాగునీరు ఇచ్చే లక్ష్యంతో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు చేపట్టారు. గత ప్రభుత్వం పదేళ్లపాటు ఆ పనలనూ పక్కకు పెట్టడంతో టన్నెల్‌లో ప్రమాదం జరిగింది. ఎన్ని ఆటంకాలు వచ్చినా ఎస్ఎల్‌బీసీని పూర్తి చేస్తాం రాహుల్‌గాంధీని ప్రధానిగా చేయడమే తనకు మిగిలి ఉన్న ఏకైక కోరిక అని వైఎస్ఆర్ అనేవారు. ఆయన అసంపూర్తిగా వదిలివేసిన స్ఫూర్తిని మేం కొనసాగిస్తాం
> – ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

## వీఆర్‌వోలకు నియామక పత్రాలు

5న అందించనున్న సీఎం రేవంత్ రెడ్డి 2లో..

## సీఎం రేవంత్‌కు హైకోర్టులో ఊరట

కేసులో వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు

# కవితపై సస్పెన్షన్ వేటు

## కేసీఆర్ ఆదేశాలతో బీఆర్ఎస్ ప్రకటన


2లో

- హరీశ్‌రావు, సంతోష్‌లపై విమర్శలతో సీరియస్
- ఇటీవల కాలంలో కవిత తీరు పార్టీకి నష్టం కలిగిస్తోందని వ్యాఖ్య
- పార్టీ వ్యతిరేక కార్యకలాపాలవల్లే ఈ నిర్ణయమని వెల్లడి

హైదరాబాద్(జనంసాక్షి):బిఆర్ఎస్ సంచలన నిర్ణయం తీసుకుంది. పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్సీ కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు- ప్రకటించింది. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలను తీవ్రంగా పరిగణిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు- తెలిపింది. ఈ మేరకు భారత రాష్ట్ర సమితి ప్రధాన కార్యదర్శులు సోమ భరత్‌కుమార్, టి.రవీందర్‌రావు పేరిట ఓ ప్రకటన విడుదల చేసింది. ఇటీవల కాలంలో కవిత ప్రవర్తిస్తున్న తీరు, కొనసాగిస్తున్న పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు భారత రాష్ట్ర సమితికి నష్టం కలిగించేలా ఉన్నాయి. అధిష్ఠానం ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తోంది. కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ అధినేత కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారని భారత రాష్ట్ర సమితి పేర్కొంది. కవిత ప్రస్తుతం నిజామాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీగా ఉన్నారు. కొంతకాలంగా మిగతా 2లో..

## నేడు ఎమ్మెల్సీ పదవికి కవిత రాజీనామా?

నేడు మీడియా ఎదుట ప్రకటించే అవకాశం

అనుచరులతో చర్చిస్తున్న జాగృతి అధ్యక్షురాలు

# రాష్ట్రంలోకి సీబీఐ రావొచ్చు

- దర్యాప్తు సంస్థకు తొలగిన అడ్డంకులు
- గతంలో ఉన్న ఆదేశాలను సడలిస్తూ జీవో విడుదల
- ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ఆధారంగా సీబీఐ విచారణ చేయించండి.. తెలంగాణ ప్రభుత్వం సిఫారసు
- ఈ మేరకు కేంద్ర హోంశాఖకు ప్రభుత్వం లేఖ

హైదరాబాద్(జనంసాక్షి): కాళేశ్వరంపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ఆధారంగా సీబీఐ విచారణకు తెలంగాణ ప్రభుత్వం సిఫారసు చేసింది. ఈ మేరకు కేంద్ర హోంశాఖకు రాష్ట్ర ప్రభుత్వం లేఖ రాసింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలు ఉన్నట్లు- ఎన్‌డీఎస్‌ఏ గుర్తించిందని.. ప్రణాళిక, డిజైన్, నాణ్యత, నిర్మాణంలో లోపాలు ఉన్నాయని ప్రభుత్వం పేర్కొంది. అందుకే ఈ అంశంపై సీబీఐతో విచారణ జరిపించాలని కోరింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిటీ- కూడా విచారణ జరిపి లోపాలను గుర్తించిందని మిగతా 2లో..



# ఘోష్ నివేదిక ఆధారంగా సీబీఐ విచారణ వద్దు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

కేసీఆర్, హరీశ్ దాఖలు చేసిన పిటిషన్‌లపై ధర్మాసనం విచారణ

హైదరాబాద్(జనంసాక్షి):కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంలో జస్టిస్ పీసీ ఘోష్ నివేదిక ఆధారంగా సీబీఐ విచారణ చేపట్టవద్దని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. కాళేశ్వరం కమిషన్ నివేదికను సవాల్ చేస్తూ మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై ఉన్నత న్యాయస్థానంలో విచారణ జరిగింది. కేసీఆర్, హరీశ్‌రావు దాఖలు చేసిన మధ్యంతర పిటిషన్లకు విచారణార్హత లేదని రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏజీ వాదించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణను సీబీఐకి ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించిందని మిగతా 2లో..

# రాష్ట్రానికి తరలివస్తున్న యూరియా



## వారం రోజుల్లో రాష్ట్రానికి చేరనున్న 27,470 మెట్రిక్ టన్నులు

- వెంటనే రైతులకు సాఫీగా సరఫరా చేయండి : మంత్రి తుమ్మల
- 5 రోజులలో పంట నష్టం సర్వే పూర్తి చేస్తామని వెల్లడి

హైదరాబాద్(జనంసాక్షి):రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని ఎరువుల సరఫరా విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటు-ందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గారు స్పష్టం చేశారు. రైతులకు అవసరమైన యూరియాను అందుబాటు-లో ఉంచడానికి, కేంద్రంతో ఎప్పటికప్పుడు సంప్రదింపులు జరుపుతున్నామని చెప్పారు. నిన్న ఒక్కరోజులోనే రాష్ట్రానికి 9,000 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా కాగా, ఈ రోజు మరో 5,000 మెట్రిక్ టన్నులు చేరనున్నాయని వెల్లడించారు. ఈ యూరియా రైల్వే రేక్ పాయింట్లయిన సనత్ నగర్, వరంగల్, జడ్చర్ల, నాగిరెడ్డిపల్లి, మిర్యాలగూడ, కరీంనగర్, నిజామాబాద్



ప్రాంతాలకు చేరుకుంటు-ందని తెలిపారు. ఇంకా, వచ్చే వారం రోజుల్లో కరాయికల్, గంగవరం, దామ్ర పోర్టుల ద్వారా మరో 27,470 మెట్రిక్ టన్నుల యూరియా రాష్ట్రానికి చేరనుందని తెలిపారు. ఈ ఎరువులను రైతులకు ఎటు-వంటి ఇబ్బందులు కలగకుండా డిమాండ్ కు అనుగుణంగా పంపిణీ చేయాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు- మంత్రిగారు పేర్కొన్నారు. రైతులకు ఎరువుల కొరత ఉండకుండా, అవసరమైన చోట తక్షణమే అందేలా సమన్వయం చేయాలని అధికారులు కృషి చేయాలని ఆదేశించారు.అదేవిధంగా ఇటీ-వల వర్షాల కారణంగా జరిగిన పంట నష్టానికి పరిహారం చెల్లించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మిగతా 2లో..

ఉద్యోగ సంఘాల జేఏసీతో భట్టి, శ్రీధర్‌బాబు చర్చలు..

# చలో హైదరాబాద్ వాయిదా

హైదరాబాద్(జనంసాక్షి): సచివాలయంలో ఉద్యోగ సంఘాల జేఏసీతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు చర్చించారు. ఈనెల 8న విధివిధానాలు ఖరారు చేసి, త్వరలో హెల్త్ కార్డులు మంజూరు చేస్తామని కేబినెట్ సబ్ కమిటీ హామీ ఇచ్చింది. టీచర్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామని మంత్రి వర్గ ఉప సంఘం తెలిపింది. పెండింగ్ బిల్లుల విడుదల, నర్సింగ్ డైరెక్టరేట్ ఏర్పాటుకు హామీ లభించింది. విజిలెన్స్, ఏసీబీ కేసులతో రెండేళ్లకు పైగా సస్పెన్షన్‌లో ఉన్న ఉద్యోగులకు పోస్టింగ్‌లు ఇచ్చేందుకు కేబినెట్ సబ్ కమిటీ అంగీకారం తెలిపింది. ఈ నేపథ్యంలో ఈనెల 8 నుంచి 19 వరకు మిగతా 2లో..



# సవాళ్లు ఎదురైనా అభివృద్ధి ఆగలేదు

## భారత్ 7.8% వృద్ధి రేటు సాధించింది

- దేశ ఆర్థిక వ్యవస్థ అంచనాలను మించి రాణిస్తోంది
- సెమీకాన్ ఇండియా సదస్సులో ప్రధాని మోడీ
- పరోక్షంగా అమెరికాసుంకాలపై ఘాటు వ్యాఖ్యలు

న్యూఢిల్లీ(జనంసాక్షి): ఎన్ని సవాళ్లు ఎదురైనప్పటికీ భారత్ 7.8 శాతం వృద్ధి రేటును సాధించిందని.. దేశ ఆర్థిక వ్యవస్థ అంచనాలను మించి రాణిస్తోందని ప్రధాని మోడీ అన్నారు. ఢిల్లీలోని యశోభూమిలో నిర్వహించిన సెమీకాన్ ఇండియా 2025 సదస్సులో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అమెరికా విధిస్తున్న సుంకాలను ఉద్దేశిస్తూ.. ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇతరుల ఆర్థికస్వార్థం వల్ల ప్రపంచ పరిస్థితుల్లో అనిశ్చితి నెలకొన్నప్పటికీ భారత్ మాత్రం స్థిరంగా అభివృద్ధి వైపు ముందడుగు వేస్తోందన్నారు. ప్రపంచంలోని వివిధ కంపెనీలు మేకిన్ ఇండియా కోసం భారత్‌కు రావాలని.. ప్రపంచం కోసం తయారీలు చేపట్టాలని పిలుపునిచ్చారు. సెమీకాన్ ఇండియా 2025 సదస్సులో 40 దేశాల ప్రతినిధులు పాల్గొనడంపై సంతోషం వ్యక్తంచేశారు. తమ ప్రభుత్వ పాలనలో భారత్‌లో రాజకీయ స్థిరత్వం, ఆర్థిక స్థిరత్వం, విధానాల్లో పారదర్శకత వంటి పలు మార్పులు చోటుచేసుకున్నాయని అన్నారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న మిగతా 2లో..



## మోదీ, పుతిన్, జిన్‌పింగ్‌లు భేటీ

ట్రంప్‌కు కౌంటర్ ఇచ్చిన కాలిఫోర్నియా గవర్నర్ 9

దేశ వ్యతిరేక చర్యలకు పాల్పడితే

# విదేశీయులకు నో ఎంట్రీ

ఆదేశాలు జారీ చేసిన కేంద్రం



న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశ వ్యతిరేక చర్యలకు పాల్పడిన విదేశీయులు భారత్‌లోకి రాకుండా అడ్డుకునేందుకు చర్యలు చేపట్టాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. గతంలో భారత్‌కు వచ్చి.. గూఢ చర్యం, అత్యాచారం, హత్య, ఉగ్రవాద చర్యలు, నిషేధిత సంస్థలలో సభ్యులుగా ఉండటం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా వంటి ఆరోపణలపై దోషులుగా తేలి.. వారి దేశాలకు వెళ్లిపోయిన విదేశీయులపై ఈ చర్యలు తీసుకోవాలని సూచించింది. అటువంటి వారు తిరిగి భారత్‌లోకి ప్రవేశించకుండా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు చర్యలు చేపట్టాలని కేంద్ర హోంశాఖ ఆదేశించింది. మిగతా 2లో..

# డెడ్‌లైన్స్ పనిచేయవు

పరస్పర ప్రయోజనకర ఒప్పందాలకు సిద్ధమే

కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి పీయూశ్ గోయల్



న్యూఢిల్లీ(జనంసాక్షి):పరస్పరం ప్రయోజనకరమైన ఒప్పందాలకు తాము సిద్ధమని భారత వాణిజ్యశాఖ మంత్రి పీయూశ్ గోయల్ అన్నారు. అమెరికాతో వాణిజ్య చర్చల విషయంలో ప్రతిష్టంభన నెలకొన్న తరుణంలో మంత్రి స్పందించారు. డెడ్‌లైన్స్ పనిచేయవని తేల్చిచెప్పారు. డెడ్‌లైన్స్ పెట్టుకొని మేం వాణిజ్య ఒప్పందాలపై ఎన్నడూ చర్చలు జరపబోం. ఇరువర్గాలకు ప్రయోజనం చేకూర్చే వాణిజ్య ఒప్పందం కోసం మేం ఎల్లప్పుడూ చర్చలకు సిద్ధమే అని పరిశ్రమ వర్గాలతో జరిగిన కార్యక్రమంలో గోయల్ వెల్లడించారు. మార్చిలో మొదలైన భారత్-అమెరికా వాణిజ్య చర్చలు.. ఇప్పటివరకు ఐదు దఫాలుగా జరిగాయి. ఇవి జరుగుతుండగానే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ మనపై సుంకాల మోత మోగించారు. దాంతో గతంలో విధించిన 25 శాతానికి అదనంగా మరో 25 శాతం కలిపి భారత్ ఎగుమతులపై 50శాతం భారం పడుతోంది. ఈ తరుణంలో ఆరవ రౌండ్ చర్చలు ప్రస్తుతానికి వాయిదా పడ్డాయి. మరోపక్క భారత్ యూరోపియన్ యూనియన్ మధ్య వాణిజ్య చర్చలు తుదిదశకు చేరుకున్నాయని, గణనీయమైన పురోగతి ఉందని మంత్రి చెప్పారు. వ్యవసాయ ఉత్పత్తుల పై సుంకాలు తగ్గించాలని అమెరికా చాలాకాలంగా మిగతా 2లో..

# యమునానది ఉగ్రరూపం

ఢిల్లీని ముంచెత్తిన వరద ప్రవాహం

సురక్షిత ప్రాంతాలకు తరలుతున్న లక్షలాది మంది ప్రజలు

ఉత్తరాదిలో వర్ష బీభత్సం..


పలు రాష్ట్రాల్లో వరదలతో అతలాకుతలం


9లో

# రష్యా బంపర్ ఆఫర్

## భారత్‌కు మరింత చౌకగా రష్యా చమురు

మాస్కో(జనంసాక్షి):భారతీయ కంపెనీల కోసం రష్యా చమురు మరింత చౌకగా లభిస్తోంది. తాజా గణంకాల ప్రకారం ఆ ధర బ్రెంట్ చమురుతో పోలిస్తే 3-4 డాలర్లు చౌకగా లభిస్తోంది.ఈ విషయాన్ని రష్యా గ్రిడ్ నుంచి చమురు ఆఫర్ అందుకున్న వ్యక్తులు ఓ ఆంగ్ల వార్తా సంస్థకు వెల్లడించారు. ఈ ధరలు సెప్టెంబర్ చివరి వారం, అక్టోబర్‌లో సరఫరా అయ్యే మొత్తానికి వర్తించనున్నాయి.అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నుంచి ఎన్ని బెదిరింపులు వచ్చినా.. భారత రిఫైనరీలు రష్యా నుంచి చమురు కొనుగోళ్లను ఏమాత్రం ఆపడం లేదు. గతవారం రష్యా నుంచి వచ్చే ఉరల్స్ గ్రేడ్ చమురులో బ్యారెల్‌కు 2.5 డాలర్ల డిస్కౌంట్ లభించింది. ఇక జులైలో ఈ రాయితీ మొత్తం 1 డాలర్‌కు మాత్రమే పరిమితమైంది. ఇక అమెరికా నుంచి చమురు సాధారణ ధర కన్నా ఎక్కువ ఉంది. ఇది బ్రెంట్‌తో పోలిస్తే 3 డాలర్లు అధికంగా ఉన్నట్లు నిపుణులు వెల్లడించారు. రష్యా ఎగుమతి చేసే వాటిల్లో ఉరల్స్



ముఖ్యమైన చమురు. దీనిని ఆ దేశ పశ్చిమపోర్టుల నుంచి ప్రపంచంలోని వివిధ దేశాలకు పంపుతారు. ఇటీవల కాలంలో సముద్ర మార్గం నుంచి ఈ చమురును దిగుమతి చేసుకొంటున్న వాటిల్లో భారత్ ముందంజలో ఉంది. అమెరికా ఒత్తిళ్ల మధ్య కూడా భారత్‌కు రష్యానే అతిపెద్ద చమురు సరఫరాదారుగా నిలిచింది. జులైలో 3.6 బిలియన్ డాలర్లు లేదా రూ.31,775 కోట్ల మేర విలువైన చమురు మనకు విక్రయించింది. మన మొత్తం దిగుమతుల్లో రష్యా వాటానే 31.4 శాతంగా ఉండగా.. ఆ తర్వాతి మిగతా 2లో..

జనంసాక్షి www.janamsakshi.org
బుధవారం 03.09.2025

## రాష్ట్రంలోకి సీబీఐ రావొచ్చు

తెలిపింది. ఎన్‌డీఎస్‌ఏ నివేదికపై అసెంబ్లీలో చర్చించామని లేఖలో ప్రభుత్వం ప్రస్తావించింది. మరోవైపు రాష్ట్రానికి సీబీఐ రాకుండా గతంలో ఉన్న ఆదేశాలను సడలిస్తూ జీవో విడుదల చేసింది. సీబీఐ విచారణకు అన్నివిధాలుగా సహకరిస్తామని ప్రభుత్వం పేర్కొంది.

## ఘోష్ నివేదిక ఆధారంగా సీబీఐ విచారణ వద్దు

తెలిపారు. ఎన్‌డీఎస్‌ఏ నివేదిక ఆధారంగా సీబీఐ దర్యాప్తు చేపడుతుందని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. తదుపరి విచారణను న్యాయస్థానం అక్టోబర్ 7కి వాయిదా వేసింది. కాళేశ్వరం కమిషన్ నివేదిక ఆధారంగా తమపై చర్యలు తీసుకోకుండా.. ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో కేసీఆర్, హరీశ్‌రావు పేర్కొన్నారు. న్యాయస్థానంలో వారు వేసిన పిటిషన్లకు అర్హత లేదని అడ్వకేట్ జనరల్ ధర్మాసనం దృష్టికి తెచ్చారు.కాళేశ్వరం ప్రాజెక్టు రిపోర్ట్‌పై అసెంబ్లీలో చర్చించినట్లు– కోర్టు దృష్టికి ఏజీ తీసుకెళ్లారు. ఈ కేసును తెలంగాణ ప్రభుత్వం సీబీఐకి అప్పగించనున్నట్లు– హైకోర్టుకు తెలిపారు. ఇప్పటివరకూ వారిపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని న్యాయస్థానానికి స్పష్టం చేశారు. సీబీఐ విచారణ తర్వాత కేసీఆర్, హరీశ్‌రావులపై చర్యలు ఉంటాయని హైకోర్టుకు అడ్వకేట్ జనరల్ వెల్లడించారు. కాగా, తదుపరి విచారణ వరకు వారిపై చర్యలు తీసుకోవద్దని రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు కేసీఆర్, హరీశ్‌రావు పిటిషన్ల విచారణను అక్టోబర్ 7వ తేదీకి వాయిదా వేసింది.

## రాష్ట్రానికి తరలివస్తున్న యూరియా

మంత్రి తెలిపారు. రైతులకు ఎటు–వంటి అన్యాయం జరగకుండా, సకాలంలో సహాయం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. అందుకోసం పంట నష్టం సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలని, 5 రోజుల్లోపు పంటనష్టంపై పూర్తి నివేదికను పూర్తి చేయాల్సిందిగా సంబంధిత అధికారులకు తక్షణ ఆదేశాలు జారీ చేసినట్లు– మంత్రిగారు వెల్లడించారు. రైతుల సంక్షేమం, వారి పంటల రక్షణ రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి పునరుద్ఘాటించారు.

## డెడ్‌లైన్స్ పనిచేయవు

డిమాండ్ చేస్తోంది. అందుకు ఆమోదిస్తే.. దేశంలోని రైతుల ప్రయోజనాలు దెబ్బతింటాయనే ఆందోళన ఉంది. ఇది రాజకీయంగా సున్నితమైన అంశం అయినందున.. వ్యవసాయ ఉత్పత్తులపై సుంకం మినహాయింపునకు భారత్ ససేమిరా అంది. గతంలోనూ ఈ విషయంపై ఇరు దేశాల మధ్య పలుమార్లు చర్చలు జరిగినా ఏకాభిప్రాయం కుదరలేదు. ఇదే అగ్రరాజ్యం ఆగ్రహానికి కారణమైంది. మరోవైపు, రష్యా నుంచి న్యూదిల్లీ చమురు కొనుగోలును కూడా అమెరికా తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. అమెరికా ఒత్తిళ్ల మధ్య కూడా భారత్‌కు రష్యానే అతిపెద్ద చమురు సరఫరాదారుగా నిలవడం గమనార్హం.

# కవిత సస్పెన్షన్‌పై స్పందించబోం

- అది వారి కుటుంబ సమస్య
- ఆస్తుల పంపకంలో వచ్చిన తగాదాలు
- కవితను కాంగ్రెస్‌లో చేర్చుకునేది లేదు
- పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్

**హైదరాబాద్(జనంసాక్షి):**భారత రాష్ట్ర సమితి నుంచి ఎమ్మెల్సీ కవిత సస్పెండ్ కావడంపై తాము స్పందించబోమని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. ఆమెపై సస్పెన్షన్ ఆ పార్టీ అంతర్గత వ్యవహారమని చెప్పారు. ఆస్తులు, వాటాల్లో వారి మధ్య తగాదాలున్నాయని గతంలోనే తాను చెప్పినట్లు– గుర్తు చేశారు. ఆ తగాదాలే సస్పెన్షన్‌కు దారి తీసి ఉండొచ్చన్నారు. కొందరు కవిత వెనుక ఉన్నామన్నారు. మరికొందరు హరీశ్‌రావు, సంతోష్ వెనుక ఉన్నామని చెబుతున్నారు. కానీ, మేం ప్రజల వెంట ఉన్నాం. మిగతా ఎవరి వెనకాల లేము. మేం ప్రభుత్వాన్ని నడుపుతున్నాం. ప్రజలు మా వెంట ఉన్నారు. ఎవరికో వత్తాసు పలకాల్సిన అవసరం మా పార్టీకి, సీఎంకు లేదని మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. అవినీతిపరులందరినీ దూరం పెడతాం. కేసీఆర్ కుటుంబం కూడా అవినీతిలో కూరుకుపోయింది. అవినీతి సంపదలో వాటాల విషయంలో తగాదా వచ్చినట్లుంది. వారి తగాదాలతో మాకు సంబంధం లేదని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు.అలాగే కవితను కాంగ్రెస్‌లో చేర్చుకునేది లేదని, అవినీతిపరులకు ఇందులో స్థానం లేదన్నారు. ఇదిలావుంటే కల్వకుంట్ల కవితను బీఆర్‌ఎస్ పార్టీ సస్పెండ్ చేయడంపై కాంగ్రెస్ పార్టీ ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ మంగళవారం హైదరాబాద్‌లో స్పందించారు. కల్వకుంట్ల కవితది కుటుంబ సమస్య, డబ్బులు సమస్య అని ఆయన అవర్ణించారు. కవిత సస్పెన్షన్ విషయం కాంగ్రెస్ పార్టీతో సంబంధం లేని అంశమని స్పష్టం చేశారు. పంపకాలలో తేడా వచ్చినందుకే కవిత మాట్లాడుతోందని విమర్శించారు. గత పదేళ్ల పాలనలో జరిగిన అవినీతిపై పూర్తి విషయాలు బయట పెట్టాలంటూ కవితను ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. హరీష్ రావు, సంతోష్ రావు వెనక రేవంత్ రెడ్డి ఎందుకు ఉంటారని ఆయన సందేహం వ్యక్తం చేశారు. హరీష్, సంతోష్ బాగోతాన్ని బయటపెట్టిందే సీఎం రేవంత్ రెడ్డి అని ఈ సందర్భంగా ఎంపీ అనిల్ గుర్తు చేశారు. ఇక ఇదే అంశంపై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కవిత చెప్పిన విషయాలను సాక్ష్యంగా తీసుకోవాలని ఆయన అభిప్రాయ పడ్డారు. 10 ఏళ్ల అవినీతి విషయాలను రాతపూర్వకంగా సీబీఐకి ఇవ్వాలని ఈ సందర్భంగా కవితకు ఆయన సూచించారు. తన కుటుంబంలో ఎవరెంత అవినీతి చేశారో కూడా బయట వచ్చి చెప్పాలంటూ కవితను ఆయన డిమాండ్ చేశారు. అయితే కాంగ్రెస్ పార్టీలోకి కవితను తీసుకునేదే లేదని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# ప్రాణహిత-చేవెళ్ల పూర్తి చేస్తాం



ఒకే వైఎస్ఆర్, ఒకే కేవీపీ ఉంటారని వాళ్లతో తాను చెప్తుంటానని సీఎం రేవంత్ తెలిపారు. జీవితాంతం ఒక మిత్రుడికి తోడుగా ఉండి అన్నీ చేసిపెట్టడం గొప్ప విష యమన్న సీఎం కేవీపీ కావడం అంత తేలికైన విషయం కాదన్నారు. ఎవరూ అలా ట్రై చేయొద్దని, కొంచెం పక్కకు జరిగితే ఆ సీట్లో కూర్చోవడానికే ప్రయ త్నించేవాళ్లు ఎక్కువ ఉన్నారని చమత్కరించారు. ఇవాళ ఉచిత విద్యుత్‌ను ఎవరు ఇచ్చినా వైఎస్ఆర్‌నే గుర్తుకు తెచ్చుకుంటారని, భవిష్యత్‌లోనూ ఎవరూ రద్దు చేయలేని పథకాలను వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అమలు చేశారని రేవంత్? రెడ్డి అన్నారు. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలను రద్దు చేసే ధైర్యం ఎవరికీ లేదని, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి స్ఫూర్తిని ఈ ప్రభుత్వం కొనసాగిస్తోందని తెలిపారు. రూపాయికి కిలో బియ్యం స్థానంలో ఉచితంగా సన్నబియ్యం ఇస్తున్నామని, ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు వెల్లడించారు.అధికారంలోకి వచ్చిన 3 నెలల్లోనే రైతులకు రుణమాఫీని అమలు చేశామని, రుణమాఫీ కింద 26 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.21 వేల కోట్లు జమ చేశామని సీఎం రేవంత్ తెలిపారు. రసాయన ఎరువుల కొనుగోలు రూపంలో మన లక్షల కోట్ల సంపద విదేశాలకు వెళ్తోందని, మన సంపద విదేశాలకు వెళ్లొద్దు అంటే రసాయన ఎరువుల వాడకం తగ్గించాలని సూచించారు. సుభాష్ పాలేకర్ స్ఫూర్తిగా తీసుకుని రైతులు సేంద్రీయ ఎరువును అనుసరించాలని అన్నారు. తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత– చేవెళ్ల నిర్మించి రంగారెడ్డి జిల్లాకు నీరు ఇవ్వాలని వైఎస్ఆర్ సంకల్పించారని, గత ప్రభుత్వం ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టును పక్కకు పెట్టి రంగారెడ్డి జిల్లాలను నిర్వీర్యం చేసిందని ఆక్షేపించారు.ఫ్లోరైడ్ వల్ల జీవించలేని పరిస్థితులు ఉన్న నల్గొండ జిల్లాను మార్చాలని వైఎస్ఆర్ భావించారని, తాగు, సాగునీరు ఇచ్చే లక్ష్యంతో ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులు చేపట్టారని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. గత ప్రభుత్వం పదేళ్లపాటు ఎస్ఎల్‌బీసీ టన్నెల్ పనులను పక్కకు పెట్టిందని, పదేళ్లు పనులు ఆగిపోవడంతో ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో ప్రమాదం జరిగిందని తెలిపారు. ఎన్ని ఆటంకాలు వచ్చినా ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను పూర్తి చేస్తామని సీఎం ప్రకటించారు. రాహుల్‌గాంధీని ప్రధానిగా చేయడమే తనకు మిగిలి ఉన్న ఏకైక కోరిక అని వైఎస్ఆర్ అనేవారని, యువ, కొత్త ఎమ్మెల్యేలను ప్రోత్సహించడంలో వైఎస్ఆర్ ఎప్పుడూ ముందుండేవారని తెలిపారు. వైఎస్ఆర్ అసంపూర్తిగా వదిలివేసిన స్ఫూర్తిని తాము కొనసాగిస్తామని రేవంత్ రెడ్డి అన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డికి హైకోర్టులో ఊరట

### కేసులో వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు

**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి హైకోర్టులో ఊరట లభించింది. 2021లో నమోదైన కేసులో వ్యక్తిగత హాజరు నుంచి తెలంగాణ హైకోర్టు మినహాయింపు ఇచ్చింది. కౌంటర్ దాఖలు చేయాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ పల్లె నాగేశ్వర్ రావును కోర్టు ఆదేశించింది. తదుపరి విచారణ అక్టోబర్ 7వ తేదీకి వాయిదా వేసింది. సైఫాబాద్ పోలీస్‌స్టేషన్‌లో తనపై నమోదైన కేసును కొట్టేయాలని సీఎం రేవంత్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.ఏఐసీసీ పిలుపు మేరకు 2021లో పీసీసీ ఆధ్వర్యంలో రేవంత్ రెడ్డి రాజ్ భవన్ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఆయనపై కేసు నమోదు అయింది. రేవంత్ రెడ్డిపై పలు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో ఈ కేసు పెండింగ్‌లో ఉంది. ఈ కేసును కొట్టివేయాలని హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్ట్.. రేవంత్ రెడ్డికి హాజరు మినహాయింపు ఇచ్చింది. తదుపరి విచారణ వచ్చే నెల 7వ తేదీకి వాయిదా వేసింది. మరోవైపు మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ–ఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో తనపై నమోదైన కేసును కొట్టేయాలని పిటిషన్ దాఖలు చేశారు. సృజన్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని తెలంగాణ హైకోర్టు పీపీని ఆదేశించింది. తదుపరి విచారణ వచ్చే నెల 9కి వాయిదా వేసింది.

## రష్యా బంపర్ ఆఫర్

స్థానాల్లో ఇరాక్ (17.1 శాతం), సౌదీ అరేబియా (16.1%), యూఏఈ (11.8)% ఉన్నాయి. రష్యా చమురు కొంటున్న కారణంగా ఆగస్టు 27 నుంచి భారత వస్తువులపై ట్రంప్ ప్రభుత్వం అదనంగా మరో 25% టారిఫ్ అమలుచేయడంతో మొత్తం టారిఫ్ రేటు 50 శాతానికి చేరింది. కాగా, అమెరికా నుంచి భారత్ 8.9% మేర జులైలో చమురు దిగుమతి చేసుకోవడం విశేషం.

## చలో హైదరాబాద్ వాయిదా

చేపట్టనున్న జిల్లా బస్సు యాత్ర, 12న ఛలో హైదరాబాద్ వాయిదా వేస్తున్నట్లు ఉద్యోగ సంఘాల ఐకాస తెలిపింది.

## వీఆర్‌వోలకు నియామక పత్రాలు

### 5న అందించనున్న సీఎం రేవంత్

**హైదరాబాద్(జనంసాక్షి):**నూతనంగా నియమితులైన 5వేల మంది విలేజ్ రెవెన్యూ ఆఫీసర్లకు ఈ నెల 5వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నియామక పత్రాలను అందజేయనున్నట్లు– రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు తెలియజేశారు. వీఆర్వోలకు నియామక పత్రాలను మాదాపూర్ లోని హైటెక్స్ లో 5వ తేదీ నాలుగు గంటలకు అందజేయడం జరుగుతుందని, ఈ కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి తో పాటు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తదితర మంత్రులు హాజరవుతారని తెలిపారు. ఈ కార్యక్రమ ఏర్పాట్లపై మంగళవారం సంబంధిత కార్యదర్శులు ఉన్నతాధికారులతో సి.ఎస్. టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. వివిధ జిల్లాల నుండి ఎంపికైన వీఆర్వోలు మధ్యాహ్నం రెండు గంటల లోపు హైటెక్స్ చేరుకునేలా ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సులను ఏర్పాటు– చేశామని చెప్పారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే వారికి దాదాపు 120 కి పైగా ఆర్టీసీ బస్సులు ఏర్పాటు– చేయాలని ఆర్.టి.సి ఎం.డి ని ఆదేశించారు. ఈ బస్సుల పార్కింగ్, ట్రాఫిక్ నిర్వహణను చేపట్టాలని సైబరాబాద్ కమిషనర్ ను ఆదేశించారు. టెలికా÷–ఫరెన్స్‌లో రోడ్డు భవనాలు శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, రెవిన్యూ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి, ఫైర్ సర్వీస్ డీజీ నాగిరెడ్డి, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## దేశ వ్యతిరేక చర్యలకు పాల్పడితే విదేశీయులకు నో ఎంట్రీ

అలాంటి వారిని గుర్తిస్తే వారిని నిర్బంధించాలని పేర్కొంది. ఇటీవల ప్రవేశపెట్టిన ఇమ్మిగ్రేషన్ ఫారినర్స్ చట్టం (2025) ప్రకారం దేశవ్యతిరేక చర్యలకు పాల్పడిన విదేశీయులను గుర్తించి.. వారిని అదుపులోకి తీసుకునేందుకు వీలుగా ప్రత్యేక హెూల్డింగ్ సెంటర్లు లేదా నిర్బంధ శిబిరాలను ఏర్పాటు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.ఈ విషయంలో సరిహద్దు రక్షణ దళాలు, కోస్ట్ గార్డులు కూడా బాధ్యత తీసుకోవాలని హెూంమంత్రిత్వ శాఖ ఆదేశించింది. సరిహద్దుల వద్ద భారత్‌లోకి ప్రవేశించడానికి ప్రయత్నించే అక్రమ వలసదారులను నిరోధించడానికి చర్యలు తీసుకోవాలని పేర్కొంది. అంతే కాకుండా భారత్‌లో ఉద్యోగం చేయడానికి చెల్లుబాటు అయ్యే వీసా ఉన్న విదేశీయులు ఇక్కడి పౌర అధికారుల అనుమతి లేకుండా విద్యుత్, నీరు, పెట్రోలియం వంటి వాటికి సంబంధించిన ప్రైవేటు ఉద్యోగాల్లో చేరకూడదని షరతు పెట్టింది. కేంద్ర ప్రభుత్వ అనుమతి లేకుండా పర్వతారోహణ యాత్రలు సైతం చేపట్టొద్దని సూచించింది.అఫ్గానిస్థాన్, చైనా, పాకిస్థాన్‌లలో జన్మించిన విదేశీయులకు భారత్‌లోని అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, మిజోరాం, నాగాలాండ్, సిక్కిం, ఉత్తరాఖండ్, లడఖ్, హిమాచల్ ప్రదేశ్, రాజస్థాన్, జమ్మూ కశ్మీర్‌లోని కొన్ని ప్రాంతాల్లో ప్రవేశం నిషిద్ధమని తెలిపింది.

## వరద నీటిని వృథా చేయొద్దు

### టబ్బుల్లో పట్టుకోండి

### పాక్ రక్షణ మంత్రి ఆసక్తికర వ్యాఖ్యలు

పాకిస్తాన్(జనంసాక్షి):పాకిస్థాన్‌ను వరదలు ముంచెత్తుతున్నాయి. లక్షలాది మందిపై ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో పాక్ రక్షణ మంత్రి ఖవాజా మహమ్మద్ ఆసిఫ్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. వరదలను అదృష్టంగా భావించాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలు నీటిని వృథా పోనివ్వకుండా కంటెయినర్లలో నిల్వ చేసుకోవాలని ఉచిత సలహా ఇచ్చారు. పాక్ పంజాబ్ సహా అనేక ప్రావిన్సుల్లో రికార్డు స్థాయిలో వర్షాలు (%ఎముజఎ ఘుఅఅం%) కురుస్తున్నాయి. 2వేలకుపైగా గ్రామాలు నీటిలో మునిగిపోగా లక్షలాది మందిపై ప్రభావం చూపినట్లు పాక్ సమాచారశాఖ వెల్లడించింది. ఒక్క పంజాబ్ రాష్ట్రంలోనే 7లక్షల మంది సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లినట్లు అంచనా. పాక్ జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ప్రకారం గడిచిన రెండు నెలల్లో (జూన్ 26 నుంచి ఆగస్టు 31 వరకు) వరదల కారణంగా 854 మంది చనిపోగా, దాదాపు 1100లకు పైగా గాయాలపాలయ్యారు. ప్రభుత్వ సహాయ కార్యక్రమాల జాప్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ పరిణామాలపై పాక్ రక్షణమంత్రి ఖవాజా ఆసిఫ్ ఇటీవల ఓ స్థానిక మీడియా ఛానల్‌తో మాట్లాడుతూ.. "వరద పరిస్థితులకు వ్యతిరేకంగా నిరసనలు చేస్తున్న ప్రజలు ముందుగా ఆ నీటిని కాపాడుకోవాలి. వారి వారి ఇళ్లలోని టబ్‌లు, కంటెయినర్లలో నిల్వ చేసుకోవాలి. ఈ నీటిని అదృష్టంగా భావించి నిల్వ చేసుకోవాలి" అని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా మెగా ప్రాజెక్టుల కోసం 10–15ఏళ్లు వేచిచూడొద్దని, త్వరితగతిన పూర్తయ్యే చిన్న డ్యామ్‌లను నిర్మించుకోవాలని సూచించారు.

# కవితపై సస్పెన్షన్ వేటు


భారత రాష్ట్ర సమితితో విభేదిస్తున్న కవిత.. ఎక్కువగా తెలంగాణ జాగృతి తరఫున నిర్వహించే కార్యక్రమాలకే పరిమితమయ్యారు. కేసీఆర్ చుట్టూ దెయ్యాలున్నాయని.. తనపై కొందరు కుట్రలకు పాల్పడుతున్నారని ఇటీవల ఆరోపించారు. గతంలో పరోక్ష విమర్శలు చేసిన కవిత.. సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎంపీ సంతోష్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. కేసీఆర్‌పై సీబీఐ విచారణ వరకు పరిస్థితి వచ్చాక.. పార్టీ ఉంటే ఎం? లేకపోతే ఎం? అని కవిత వ్యాఖ్యానించారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో పార్టీ విధానంతో ఆమె విభేదించారు. ఈ పరిణామాల నేపథ్యంలో కవితను పార్టీ సస్పెండ్ చేసింది. ఇకపోతే కేసీఆర్‌కు మరక అంటించడంలో మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎంపీ సంతోష్‌ల అవినీతే ప్రధాన కారణమని.. ఇందులో ముఖ్యపాత్ర హరీశ్‌రావుదేనని కవిత తీవ్ర ఆరోపణలు చేశారు. వీరిద్దరి వెనుక ఉండి కుట్రలు చేస్తున్నది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అని ఆరోపించారు. కేసీఆర్‌పై అభాండాలు వేయడం.. కాళేశ్వరం బూచి చూపి సీబీఐ విచారణకు ప్రయత్నించడం చూసి ఆవేదన కలుగుతోందన్నారు. అమెరికా పర్యటన ముగించుకొని సోమవారం ఉదయం హైదరాబాద్‌కు చేరుకున్న కవిత విలేకరుల సమావేశంలో సంచలన వ్యాఖ్యలు చేశారు. గతంలో అమెరికా పర్యటన అనంతరం.. కేసీఆర్ దేవుడని.. కానీ, ఆయన చుట్టూ దెయ్యాలున్నాయని పరోక్ష విమర్శలు చేసిన కవిత.. ఇప్పుడు నేరుగా హరీశ్‌రావు, సంతోష్‌లపై విరుచుకుపడ్డారు. కేసీఆర్‌కు మరక ఎలా అంటిందో గులాబీ శ్రేణులు ఆలోచించాలి? పక్కన ఉన్న వాళ్ల వల్లే ఆయనకు ఈ దుస్థితి వచ్చింది. అందువల్లే తెలంగాణ అంటే గిట్టని, పక్క రాష్ట్రం ఎజెండాను అమలుచేసే సీఎం రేవంత్‌రెడ్డి సైతం కేసీఆర్‌ను విమర్శించే పరిస్థితి వచ్చిందన్నారు. అవినీతికి పాల్పడిన హరీశ్, సంతోష్‌లు దగ్గరుండి మరీ కేసీఆర్‌ను బద్నాం చేయిస్తున్నారు. ఇందులో మేఘా కృష్ణారెడ్డి పాత్ర కూడా ఉంది. అవినీతి ఆరోపణలు ఉండడం వల్లే హరీశ్‌రావును రెండోసారి మంత్రివర్గంలోకి తీసుకోవడంలో జాప్యం చేశారు. అందుకే రెండోసారి నీటిపారుదల శాఖ కూడా ఇవ్వలేదు. నాపై వారిద్దరూ ఎన్ని కుట్రలు చేసినా భరించాను. కేసీఆర్‌పై ఈ వయసులో సీబీఐ విచారణ ఏంటి? ఆయన ఏనాడూ ఆస్తులు సంపాదించలేదు. నా వివాహం చేసేందుకు సైతం ఇబ్బంది పడ్డారు. దేవుడి లాంటి మా నాన్నపై సీబీఐ విచారణ అంటే బాధ కలుగుతోందంటూ వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో ఆమె వ్యాఖ్యలపై కెసిఆర్ చర్చించాక ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ క్రమంలో ఆమె సొంత కుంపటి పెట్టుకోవడం ఖాయమని తెలుస్తోంది. ఇకపోతే నా వెనుక కాంగ్రెస్ ఉందని.. భాజపా ఉందని సామాజిక మాధ్యమాల్లో ట్రోల్ చేస్తున్నారు. నాది కేసీఆర్ రక్తం. నేను ఇండిపెండెంట్‌గానే ఉంటానని కూడా వ్యాఖ్యానించడంతో ఆమె అన్నింటికీ సిద్దమయ్యారని తెలుస్తోంది.

## నేడు ఎమ్మెల్సీ పదవికి కవిత రాజీనామా?

### నేడు మీడియా ఎదుట ప్రకటించే అవకాశం

### అనుచరులతో చర్చిస్తున్న జాగృతి అధ్యక్షురాలు

**హైదరాబాద్(జనంసాక్షి):**బీఆర్ఎస్ నాయకురాలు ఎమ్మెల్సీ కవితను సస్పెంచ్ చేయడంతో ఆమె ఎమ్మెల్సీ పదవితో పాటు, పార్టీ సభ్యత్వానికి కూడా రాజీనామా చేసే యోచనలో మరో సంచలన నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని భావిస్తున్నట్లు– సమాచారం అందుతోంది. అదే సమయంలో బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి కూడా రాజీనామా చేయాలని భావిస్తున్నారని అనుయా యులు అంటున్నారు. త్వరలో కవిత కొత్త పార్టీని ప్రకటిస్తారని కూడా ఆమె అనుచరులు చెబుతు న్నారు. ఈ నేపథ్యంలోనే బుధవారం నాడు ఎమ్మెల్సీ కవిత మీడియా ముందుకు వస్తారని.. మీడియా ముఖంగానే భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తారని ఆమె అనుచరులు చెబుతున్నారు.ఇటీవలి కాలంలో కవిత ప్రవర్తనా తీరు పార్టీకి నష్టం చేకూర్చే విధంగా ఉందంటూ బీఆర్ఎస్ అధిష్టానం ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు– ప్రకటించింది. ఈ మేరకు బీఆర్ఎస్ అధిష్టానం అధికారిక ప్రకటన విడుదల చేసింది. అయితే, తనను పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో కవిత.. తన ముఖ్య అనుచరులతో సమాలోచనలు జరుపుతున్నారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి



రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నారు. అంతేకాదు.. ఎమ్మెల్సీ పదవిపై బీఆర్ఎస్ ఫిర్యాదు చేయక ముందే ఆ పదవికి కూడా రాజీనామా చేయాలని కవిత భావిస్తున్నారు. ఈ విధంగా బీఆర్ఎస్ పార్టీతో పూర్తిగా తెగదెంపులు చేసుకోవాలనే యోచనలో కవిత ఉన్నారని ఆమె అనుచరులు చెబుతున్నారు.లిక్కర్ స్కామ్ కేసులో జైలు నుంచి బయటకు వచ్చినప్పటి నుంచి పార్టీ లైన్ దాటి అడుగులు వేస్తూ వస్తున్న కల్వకుంట్ల కవిత.. త్వరలోనే కొత్త పార్టీ పెట్టాలని నిర్ణయం తీసుకున్నారని అంటున్నారు. ఇప్పటికే జాగృతిని బలోపేతం చేస్తూ వచ్చిన కవిత.. అదే పేరుతో గానీ.. మరో పేరుతో గానీ కొత్త పార్టీ పెట్టాలని భావిస్తున్నారట. కొత్త పార్టీ ఏర్పాటుకు సంబంధించి సన్నాహాలు కూడా ప్రారంభించారని సమాచారం. బీఆర్ఎస్ నుంచి సస్పెన్షన్ ప్రకటన రావడంతో.. కొత్త పార్టీ వ్యవహారంలో కవిత మరింత స్పీడ్ పెంచ నున్నట్లు తెలుస్తోంది. బుధవారం మీడియా సమావేశంలో దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

## కాళేశ్వరం కుంగింది.. బీఆర్ఎస్ కూలింది

### మూడు పిల్లర్లు కూలితే..ఇప్పుడు పార్టీ మూడు ముక్కలు

### సిబిఐకి ఆధారాలు ఇచ్చి రేవంత్ నిజాయితీ చాటాలి

### కవిత వ్యాఖ్యలతో కాళేశ్వరం అనకొండలు బయటపడ్డాయి

### బిజెపి ఎంపి లక్ష్మణ్ వ్యాఖ్య

**హైదరాబాద్(జనంసాక్షి):**మొన్న కాళేశ్వరం కూలింది, నిన్న బీఅరెస్ కూలిందని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు. కాళేశ్వరం మూడు పిల్లర్లు కూలిపోతే, బీఆర్ఎస్ మూడు ముక్కలు అయ్యిందని ఎద్దేవా చేశారు. అవినీతి పరులకు బీజేపీలో చోటులేదని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన మీడియాతో మాట్లాడారు.. రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతి కేసు విషయంలో కేంద్రానికి లేఖ రాసిందని తెలిపారు. సీబీఐతో దర్యాప్తు చేయాలంటూ.. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని చెప్పు కొచ్చారు. కాళేశ్వరం విషయంలో 22 నెలల నుంచి సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు కాలయాపన చేశారో.. తెలంగాణ ప్రజలకు జవాబు చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. పీసీసీ ప్రెసిడెంట్‌గా ఉన్న సమయంలో తన దగ్గర ఆధారాలు ఉన్నాయని చెప్పిన సీఎం రేవంత్ రెడ్డి, ఇప్పుడు సీబీఐకి ఆ ఆధారాలు ఇచ్చి విచారణకు సహకరించాలని ఎంపీ లక్ష్మణ్ సూచించారు. కాగ్ కూడా అవినీతి జరిగింది, లోపాలు ఉన్నాయాని చెప్పిందని స్పష్టం చేశారు. ఘోష్ కమిషన్ నివేదికలో క్రిమినల్ రిఫరెన్స్ లేకుండా నాయకులు, అధికారులు, కాంట్రాక్టర్ల పాత్ర ఏంటో స్పష్టంగా చెప్పలేదని ఆరోపించారు. ఎమ్మెల్సీ కవిత బహిరంగంగా హరీష్ రావు, సంతోష్ అవినీతికి పాల్పడ్డారు అని చెప్పారని గుర్తు చేశారు. హరీష్‌రావు, సంతోష్ అవినీతి ఆనకొండలు అని చెప్పిందని స్పష్టం చేశారు.

# సవాళ్లు ఎదురైనా అభివృద్ధి ఆగలేదు

భారత్.. త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనుందని విశ్వాసం వ్యక్తంచేశారు. ఈ వృద్ధి కేవలం ఒకే రంగానికి పరిమితం కాకుండా అన్నిరంగాల్లో కనిపిస్తోందని మోదీ అన్నారు. ఆర్థిక స్వార్థం వల్ల ఎదురయ్యే సవాళ్లు ఎదుర్కొంటామని ప్రధాని మోడీ అన్నారు. జూన్ త్రైమాసికంలో భారతదేశం బలమైన ఆర్థిక పనితీరును కనబరించిందని ప్రశంసించారు. ఆర్థిక స్వార్థం ద్వారా నడిచే సవాళ్లను దేశం ఎలా ఎదుర్కొందో ఇదే చక్కని ఉదాహరణ అన్నారు. భారత్ 7.8 శాతం వృద్ధి రేటును సాధించిందని.. దేశ ఆర్థిక వ్యవస్థ అంచనాలను మించి రాణిస్తోందన్నారు. ఇక భారతదేశంలో సెమీకండక్టర్ భవిష్యత్తును నిర్మించడానికి అంతర్జాతీయ సమాజం సిద్ధంగా ఉందనే స్పష్టమైన సందేశాన్ని సెమికాన్ ఈవెంట్ పంపిందని తెలిపారు. తాము మేడిన్ ఇండియా ఉత్పత్తులను వినియోగిస్తున్నట్లు– ప్రపంచదేశాలన్నీ చెప్పుకొనే రోజు త్వరలోనే రానుందని పేర్కొన్నారు. ప్రపంచ దేశాలకు భారత్‌పై నమ్మకం పెరిగిందనడానికి ఇదే ఉదాహరణ అని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా పోటీ– పెరిగిన తరుణంలోనూ భారత్‌కు ఆదరణ తగ్గలేదన్నారు. భారత్‌పై అమెరికా భారీగా పన్నులు విధిస్తున్న నేపథ్యంలో మోదీ మాటలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ప్రతి పరికరంలో ఇండియన్ మేడ్ చిప్ ఉండాలనేది తమ కల అని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ పేర్కొన్నారు. సెమికాన్ ఇండియా 2025 సదస్సులో తొలి 'మేకిన్–ఇండియా' మైక్రో ప్రాసెసర్ చిప్‌లను ప్రధాని మోదీకి ఆయన అందించారు. భారత్ తయారుచేసిన విక్రమ్ 32–బిట్ ప్రాసెసర్‌తోపాటు– 4 –టెస్ట్ చిప్స్‌ను అందించారు. ఈ తొలి మైక్రో ప్రాసెసర్ చిప్‌ను ఇస్రో సెమీ కండక్టర్ ల్యాబ్ అభివృద్ధి చేసిందన్నారు. వాహక నౌకల్లో కఠిన వాతావరణ పరిస్థితుల్లోనూ పనిచేసేలా దీనిని రూపొందించినట్లు– తెలిపారు. సెమీ కండక్టర్ ఎకోసిస్టమ్ పెంపొందించడమే లక్ష్యంగా కేంద్రం చర్యలు తీసుకుంటుందన్నారు. కొన్నేళ్ల క్రితం ప్రధాని దూరదృష్టితో ఆలోచించి.. దీనిని ప్రారంభించినట్లు– తెలిపారు. దీంతో కేవలం 3.5 సంవత్సరాల వ్యవధిలో ప్రపంచదేశాలు భారతదేశం వైపు నమ్మకంగా చూస్తున్నాయన్నారు. ప్రస్తుతం దేశంలో ఐదు సెమికండక్టర్ యూనిట్ల నిర్మాణం వేగంగా జరుగుతోందని అన్నారు. ఇటీవల జపాన్ పర్యటనకు వెళ్లిన ప్రధాని మోదీ భారత్–జపాన్ సంయుక్త ఆర్థిక సదస్సు లో ప్రసంగించారు. సెమికండక్టర్ల పరిశ్రమల నుంచి స్టార్టప్‌ల వరకూ జపాన్ భారత్‌కు అత్యంత కీలక భాగస్వామిగా ఉందని ప్రధాని పేర్కొన్నారు. జపాన్ సంస్థలు భారత్‌లో 40 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టాయని గుర్తుచేశారు. జపాన్ ప్రధాని ఇషిబాతో ఏఐ, సెమీ కండక్టర్లు, బుల్లెట్ రైలు, పెట్టుబడులే అజెండాగా ద్వైపాక్షిక చర్చలు జరిపారు.

# విద్యా వైద్యానికి ప్రభుత్వం ప్రత్యేక కార్యచరణ

- జిల్లా కేంద్రంలో క్యాన్సర్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు
- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా



**మహబూబాబాద్ బ్యూరో, సెప్టెంబర్ 02 (జనంసాక్షి):** మహబూబాబాద్ పట్టణంలోని మెడికల్, నర్సింగ్ కాలేజ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీరాజ్, దేవాదాయ అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్, మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్, అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా మాట్లాడుతూ మహబూబాబాద్ పట్టణ కేంద్రంలో 186 కోట్ల వ్యయంతో ప్రభుత్వ మెడికల్, నర్సింగ్ కాలేజ్, 50 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్, బాలికలు, బారుల, హాస్టల్ ప్రారంభించి, మూడవ సంవత్సరం చదువుతున్న దమయంతి, స్వాతి, ప్రకాష్ పాండే, మైదేహి వర్మ, అనీషా, యతేశం, తదితర వైద్య విద్యార్థిని విద్యార్థులతో స్వయంగా మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించడం కోసం ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక చేపట్టిందని అందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా వైద్య కళాశాలలు 16 ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలు నిర్మించి ప్రతి ఒక్కరికి వైద్య సేవలు అందించడం కోసం నిబద్ధతతో ముందుకు సాగుతుందని అన్నారు. రాష్ట్రంలోని అన్ని వైద్య కళాశాలలో మౌలిక వసతుల కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. వైద్య విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. నర్సింగ్ కాలేజీల ద్వారా విద్యార్థిని విద్యార్థులకు ఉపాధి కల్పించడం కోసం ఇతర దేశాల భాషలపై నైపుణ్యత కల్పించడం కోసం వినూత్న కార్యక్రమం చేపడుతుందన్నారు. తద్వారా ఆర్థికంగా స్థిరపడతారని అన్నారు. ఎన్సిడి నీ నియంత్రించాలని అందుకు వైద్యశాఖ కృషి చేయాలన్నారు, అవయవాల మార్పిడి ద్వారా ఈస్టర్న్ తెలంగాణ హబ్ గా మారాలని సూచించారు. వైద్య రంగంలో నూతన టెక్నాలజీ వినియోగించి ముందుకు సాగాలన్నారు. జిల్లా కేంద్రంలో క్యాన్సర్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం విద్య, వైద్యంకు కోసం ప్రత్యేక కార్యచరణ ద్వారా క్షేత్రస్థాయిలో ఆసుపత్రులు విద్యాసంస్థలు అభివృద్ధికి పకడ్బందీ ప్రణాళికతో అభివృద్ధి, సంక్షేమంపై ముందుకు సాగుతుందని, జిల్లాకు 18 టన్నుల యూరియా రావడం జరుగుతుందని ప్రతి ఒక్క రైతుకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం కేంద్రంతో చర్చలు జరిపి మరింత యూరియా కోటాను సాధించడం కోసం మంత్రివర్గం ఢిల్లీకి వెళ్లనుందని ఆయన చెప్పారు, వైద్య ఆరోగ్య శాఖ బలోపేతానికి పదోన్నతులు కల్పించి అవసరం ఉన్న మౌలిక వసతులను ఏర్పాటు చేయడం కోసం కృషి చేస్తామని తెలిపారు.

రాష్ట్ర అటవీ,దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి ఆరోగ్యం బాగుగా ఉంటేనే ఏదైనా చేయగలమని అందుకోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకొని వైద్యశాఖ బలోపేతానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. వరంగల్ ఎంజీఎం హాస్పిటల్ లో వైద్యుల పోస్టులను భర్తీ చేయాలని మంత్రిని కోరారు.

ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా గిరిజన ప్రాంతం కాబట్టి పూర్తిస్థాయిలో అధిక నిధులు కేటాయించి జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని అందులో భాగంగానే వైద్య,నర్సింగ్ కళాశాలు నిర్మించి మౌలిక వసతులను కల్పించడం జరుగుతుందని అన్నారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ గూడూరును ఆపరేట్ చేయాలని, నెల్లికుదురు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, జేఎన్టీయూ, జూనియర్ కాలేజీలు, పాఠశాలలు, స్టేడియం, మహబూబాబాద్ జిల్లా సమగ్ర అభివృద్ధికి పక్కా ప్రణాళికతో ముఖ్యమంత్రి ప్రభుత్వం ముందుకు సాగుతుందని అన్నారు.

ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, మహబూబాబాద్ పార్లమెంటు సభ్యులు పోరిక బలరాం నాయక్, మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి వైద్య ఆరోగ్యశాఖ, రెవెన్యూ హౌసింగ్ సమాచార శాఖ, అటవీ దేవదాయ శాఖ మంత్రులను కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, అదనపు కలెక్టర్లు స్థానిక సంస్థలు లెనిన్ వత్సల్ టోప్పో (రెవెన్యూ) కె. అనిల్ కుమార్, డిఎంఈ డాక్టర్ కె. నరేంద్ర కుమార్, ఎన్ఎంసి రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ విమల తమస్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లకావత్ వెంకట్, ప్రభుత్వ హాస్పిటల్ సూపర్డెంట్ డాక్టర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టు వ్యవస్థలో 25 శాతం గిరిజనులకివ్వాలి

- తెలంగాణ స్టేట్ షెడ్యూల్ తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



**ఏటూరు నాగారం, సెప్టెంబర్ 02(జనం సాక్షి) :** ఏజెన్సీ ప్రాంతంలో జీవో నెంబర్ 3 ద్వారా రద్దు చేయబడింది దానికి పరిష్కారం చూయించడానికి ప్రయత్ని స్తామని, అదేవిధంగా కాంట్రాక్టు వ్యవస్థలో 25% గిరిజనులకు ఇవ్వాలని, 20 లక్షల వరకు టెండర్ విధానం లేదా నామినేషన్ విధానంలో ఇవ్వాలని తెలంగాణ స్టేట్ షెడ్యూల్ తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులకు సూచించారు. ఐటిడిఏ ఏటురూనాగారంలో జరిగిన రోల్ ఆఫ్ రిజర్వేషన్స్, వివిధ డిపార్ట్మెంట్లో ఖాళీగా ఉన్న బ్యాక్లాగ్ పోస్టులు, రోస్టర్స్ పాయింట్స్ గురించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ చిత్రా మిశ్రా అధ్యక్షతన వివిధ డిపార్ట్మెంట్లో గల ఖాళీల గురించి జరుగుతున్న పనుల గురించి తెలుసుకున్నారు. ఇంజనీరింగ్ విభాగం, విద్యా విభాగం ఏటూరునాగారం మహబూబాద్ హన్మకొండ జనగాం జిల్లాల గురించి సంక్షేమ అధికారులు వివరించారు. తర్వాత ఆర్సిఓ భూపాలపల్లి, మహబూబాద్ కూడా వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వివిధ ఇన్స్టిట్యూషన్ల పనితీరును వివరించారు. రోస్టర్ పాయింట్స్ ఖాళీల భర్తీ గురించి కూడా వివరించారు. గిరిజన ప్రాంతాల్లోని వివిధ రకాల భూములలో బోర్లను వేయించుటకు పరిష్కారం చూపిస్తామని ప్రమోషన్ ఇప్పించుటకు చర్యలు తీసుకుంటామని అదేవిధంగా ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకుంటామని ప్రజా ప్రతినిధులకు ఐటీడీలో తప్పనిసరిగా గౌరవించి సంస్థ స్థానం కల్పిస్తామని ఏ సమస్య ఉన్న మంత్రి ద్వారా, పరిష్కారం చేయించేటట్టు చూస్తామన్నారు ఈనెల ఆరవ తేదీన కలెక్టరేట్ ములుగు నందు జరిగే సమావేశానికి షెడ్యూల్ కులాల మరియు షెడ్యూల్ తెగల ప్రతినిధులు హాజరుకావాలని కోరారు. అనంతరం ప్రాజెక్ట్ ఆఫీసర్ ఏటూరు నాగారం మాట్లాడుతూ ఇంజనీరింగ్ వారి ద్వారా వివిధ పాఠశాలలో మైనర్ రిపేర్ రోడ్స్ హెల్త్ సెంటర్ గిరిజన భవన్ బంజారా భవన్ కూడా నిర్మాణాలు చేపట్టినట్టు తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో ఎస్టి ఎస్సీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, లక్ష్మీనారాయణ, శంకర్, లీలా దేవి, మరియు ఏపీవో వసంతరావు, ఏవో రాజ్ కుమార్, మరియు అధికారులు , సంఘాల బాధ్యులు చింత కృష్ణ, గొప్ప సమ్మరావు, ముద్దబోయిన రవి కొండ సంచయ్య, జన్ను రవి, వావిలాల స్వామి మాదిగ, నెమిలి నరసయ్య, మాదిగ నరసింహా మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం ప్రజావాణిలో 243 దరఖాస్తులు

- దరఖాస్తులు స్వీకరించిన చిన్నారెడ్డి, దివ్య దేవరాజన్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్ లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 243 దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు 57, రెవెన్యూ శాఖకు 33, ఇందిరమ్మ ఇండ్ల కోసం 87, ప్రవాసి ప్రజావాణికి 03 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 63 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సీఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి పలు సమస్యలను పరిష్కరించారు. తుక్కుగూడ, మంఖాల్ గ్రామాలలో డబుల్ బెడ్ రూం ఇండ్లను రాష్ట్ర ప్రభుత్వం సుమారు ఒక వేయి మంది లబ్దిదారులకు మంజూరు చేసినప్పటికీ హై కోర్టు ఆదేశాలతో ఆ మంజూరు ఉత్తర్వులు రద్దు కావడంతో పెద్ద ఎత్తున లబ్దిదారులు మంగళవారం ప్రజా భవన్ కు వచ్చారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే డబుల్ బెడ్ రూం ఇండ్లను కేటాయిస్తామని చిన్నారెడ్డి, దివ్య దేవరాజన్ లబ్దిదారులకు భరోసా ఇచ్చారు.

## 7న హైదరాబాదులో ఐఎఫ్టియు రాష్ట్ర సదస్సు

- గవిచర్ల క్రాస్ జంక్షన్ లో పోస్టర్ ఆవిష్కరించిన నాయకులు




**వరంగల్ ఎంజీఎం, సెప్టెంబర్ 2(జనంసాక్షి):** కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించి పర్మినెంట్ చేసి కనీస వేతనాలు అమలుపరచాలని కనీస వేతనం 26,000గా నిర్ణయించి అమలు చేయాలని సీలింగ్ విధానాన్ని ఎత్తివేయాలని మరియు ఉద్యోగ భద్రత, మరియు పని స్థలాల్లో రక్షణ కల్పించాలని ఎనిమిది గంటల పని విధానాన్ని పరిరక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈనెల ఏడవ తేదీన హైదరాబాదు సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో లిభారత కార్మిక సంఘాల సమాఖ్యలి (ఐ ఎఫ్ టి యు) ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు జరుగుతుందని ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు గంగుల దయాకర్ తెలిపారు.ఈ సదస్సుకు ఐ ఎఫ్ టి యు రాష్ట్ర అధ్యక్షులు ఐ కృష్ణ అధ్యక్షత వహిస్తారని ఐఎఫ్టియు జాతీయ అధ్యక్షులు డాక్టర్ అపర్ణ ప్రారంభోపన్యాసం చేస్తారని ముఖ్యఅతిథిగా ఐ ఎఫ్ టి యు జాతీయ నాయకులు కామ్రేడ్ బాలన్ తో పాటు జాతీయ ప్రధాన కార్యదర్శి పి శ్రీనివాస్ కోశాధికారి డి అనిమేష్ జాతీయ కమిటీ సభ్యులు ప్రతాప్ జి భారతి లత పాటు లతోపాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాస్ ప్రసంగిస్తారని కావున సదస్సును జయప్రదం చేయాలని కార్మిక వర్గాన్ని ఆయన కోరారు.పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ కార్యదర్శి రాచర్ల బాలరాజు, ఐ ఎఫ్ టి యు జిల్లా కార్యవర్గ సభ్యులు బండి కుమార్, నగర అధ్యక్ష కార్యదర్శులు ఎర్ర జయ బాబు, బన్న నర్సింగం, అయిత యాకయ్య పాల్గొన్నారు.

## వాహనం ఢీకొని పునుగుపిల్లి మృతి

**తిరుమల, సెప్టెంబర్ 1 (జనంసాక్షి):** తిరుమల రెండో ఘాట్ రోడ్డులో మంగళవారం పునుగుపిల్లి మృతి చెందింది. ఎనిమిదో కిలోమీటరు హరిణి సమీపంలో ఈ ఘటన చోటుచేసుకుంది. గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో పునుగు పిల్లి మృతి చెందినట్టు- ఫారెస్ట్ అధికారులు గుర్తించారు. అంతరించిపోతున్న అరుదైన జంతువులలో పునుగుపిల్లి ఒకటి అని తెలిపారు. ఘాట్‌రోడ్డులో వాహన దారులు వేగంగా ప్రయాణించవద్దని కోరారు.

## నానో యూరియా వాడకంపై రైతులు అవగాహన కలిగి వుండాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాల పల్లి బ్యూరో, (జనంసాక్షి):** పంటలకు నానో యూరియా వాడకంపై రైతులు అవగాహన కలిగి వుండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. మంగళవారం ఐడిఓసీ కార్యాలయంలోని తన ఛాంబర్ లో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, ఫెర్టిలైజర్ షాపుల యజమానులతో జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రైతులకు నానో యూరియా వాడకంపై అవగాహన కల్పించాలని, గ్రామ స్థాయి నుండి ఫెర్టిలిజర్ షాపుల యజమానులు రైతులకు నానో యూరియా వాడకం పై అవగాహన కల్పించాలని తెలిపారు. నానో యూరియా వాడకం వల్ల రైతులకు దిగుబడితో పాటు లాభం చేకూరుతుందని తెలిపారు. జిల్లాలో యూరియా సరఫరా జరుగుతుందని, ఇక ముందు రైతులకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు సైతం రైతులకు సైంటిస్టులతో అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, వ్యవసాయశాఖ అధికారులు, ఫెర్టిలైజర్ షాపుల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రియుడి ఇంటి ముందు ప్రియురాలి మౌన పోరాటం!

- ప్రేమించాడు... పెళ్లి చేసుకోనని ముఖం చాటేశాడు
- న్యాయం చేయాలని వేడుకుంటున్న యువతి



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 2 (జనం సాక్షి):** ప్రియుడి ఇంటి ముందు ప్రియురాలు మౌన పోరాటానికి దిగిన సంఘటన మండలంలోని పాపయ్యపేట గ్రామంలో మంగళవారం వెలుగులోకి వచ్చింది. ఇదే గ్రామానికి చెందిన బొక్కల వెంకన్న, సదారాణి దంపతుల కూతురు బొక్కల పల్లవిని అదే గ్రామానికి చెందిన అబ్బదాసి భాస్కర్, రమ దంపతుల కుమారుడు అబ్బదాసి ఉదయ్ 2016 వ సంవత్సరం నుండి వెంటపడి ప్రేమిస్తున్నాడు. పెళ్లి చేసుకుంటానని చెప్పి శారీరకంగా వాడుకున్నాడు. అంతేకాక రెండుసార్లు గర్భవతి అయితే మాత్రలు మింగించి తీసివేయించాడని యువతి పల్లవి ఆరోపించింది. పెళ్లి చేసుకోమని అడిగితే పెళ్లి చేసుకోనని ముఖం చాటేశాడని ఆవేదన వ్యక్తం చేసింది. ఈనెల 21వ తేదీన తనకు న్యాయం చేయాలని కోరుతూ చెన్నారావుపేట పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసినట్లు ఆమె పేర్కొంది. అయినా కూడా అక్కడ న్యాయం జరగకపోవడంతో చివరకు చేసేది ఏమీ లేక మంగళవారం ఉదయం ప్రియుడి ఇంటిముందు కూర్చుని మౌన పోరాటానికి దిగింది. తన తండ్రి వెంకన్న అనారోగ్యంతో రెండు సంవత్సరాల క్రితం చనిపోయాడని రోధిస్తూ తెలిపింది. చదువుకునే రోజుల్లో నుండి అంటే గత 9 సంవత్సరాలుగా తన వెంటపడి ప్రేమిస్తున్నానని చెప్పి తనను పెళ్లి చేసుకుంటానని శారీరకంగా వాడుకొని పెళ్లి చేసుకోమని అడిగితే పెళ్లి చేసుకోనని మోసం చేశాడని ఆందోళన వ్యక్తం చేసింది. వెంటనే పోలీసు ఉన్నతాధికారులు స్పందించి తాను ప్రేమించిన యువకుడితో పెళ్లి చేసి తనకు న్యాయం చేయాలని వేడుకుంటుంది.

## రైతులందరికీ యూరియా ఇవ్వాలి

- కలెక్టర్ తో ఫోన్లో మాట్లాడిన మాజీ మంత్రి ఎర్రబెల్లి




**పాలకుర్తి, సెప్టెంబరు 02(జనంసాక్షి)** మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు దేవరుప్పుల మండలంలోని ఓ కార్యక్రమంలో పాల్గొని మంగళవారం పాలకుర్తి మీదుగా రాయపర్తి మండలానికి వెలుతుండగా మండల కేంద్రంలోని ఎఫ్ఎస్సీఎస్ వద్ద రైతులు యూరియా కోసం క్యూలైన్లో నిలబడగా, వారి వద్దకు వెళ్లిన దయాకర్రావు రైతులను యూరియా పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దయాకర్రావు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ తో ఫోనులో మాట్లాడారు. కలెక్టర్ గారు, రైతులందరికి యూరియా బస్తాలను సకాలంలో ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా దయాకర్రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు యూరియా అందించడంలో విఫలం అయిందన్నారు. రేవంత్రెడ్డికి అవగాహన లేకపోవడంతోనే యూరియా కష్టాలు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన వెంట నాయకులు పసునూరి నవీన్, జరుపుల బాలూనాయక్, పుస్కూరి శ్రీనివాసరావు, మాచర్ల ఎల్లయ్య తదితరులు ఉన్నారు.

## మహిళ దారుణ హత్య

**మహబూబాబాద్, సెప్టెంబర్ 1 (జనంసాక్షి) :** గుర్తు తెలియని దుండగులు మహిళను దారుణంగా హతమార్చి నిర్మానుష్య ప్రదేశంలో పడేసిన సంఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయ గూడెంలో మంగళవారం వెలుగు చూసింది.పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మరిపెడ మండలంలోని ఉల్లేపల్లి గ్రామానికి చెందిన బంటు- వెంకటమ్మ (55) వ్యవసాయ కూలీలకు మేస్త్రీగ్రా పని చేస్తుంది. ఆమెకు భర్త, ఓ కుమార్తె, కుమారుడు ఉన్నారు. సోమవారం ఉదయం పని మీద వెళ్తున్నానని చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. మంగళవారం మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం గ్రామం నుంచి జల్లెపల్లి గ్రామానికి వెళ్లే మార్గంలో విగతజీవిగా పడి ఉండటంతో గ్రామస్తులు చూసి పోలీసులకు సమాచారమిచ్చారు. కాగా మృతదేహంపై కత్తి గాయాలు, గొంతు నులిమిన ఆనవాళ్లు ఉండగా ఘటనా స్థలంలో క్లూస్ టీం ఆధారాలు సేకరించారు. కుమారుడి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు- ఎస్ఐ తెలిపారు.


## పంట నష్టాలపై తక్షణ నివేదిక సిద్ధం చేయండి

- కార్మిక, మైనింగ్ శాఖ మంత్రివర్యులు డాక్టర్ జి.వివేక్ వెంకటస్వామి
- ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట పొలాల పరిశీలన



**కోటపల్లి సెప్టెంబర్ 2 (జనం సాక్షి) :** పంట నష్టాలపై తక్షణ నివేదిక సిద్ధం చేయాలని కలెక్టర్‌కు కార్మిక, మైనింగ్ శాఖ మంత్రివర్యులు డాక్టర్ జి.వివేక్ వెంకటస్వామి ఆదేశాలు జారీ చేశారు. కోటపల్లి మండలం అన్నారం గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాల వలన పంట పొలాలు దెబ్బతిన్న రైతులను కార్మిక, మైనింగ్ శాఖ మంత్రివర్యులు డా. జి.వివేక్ వెంకటస్వామి ప్రత్యక్షంగా పరామర్శించారు. వర్షానికి సైతం లెక్కచేయకుండా, వర్షంలో తడుస్తూ పొలాల్లోకి వెళ్లి పంట నష్టాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి గారు రైతుల సమస్యలను శ్రద్ధగా విని వారి బాధను పంచుకున్నారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి నష్టపోయిన ప్రతి ఎకరా పంటను పరిశీలించారు. పంట నష్టాలపై తక్షణ నివేదిక సిద్ధం చేసి, రైతులకు సహాయం అందించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. పరిహారం విషయంలో ఎటువంటి ఆలస్యం లేకుండా త్వరితగతిన సహాయం అందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. రైతుల జీవనోపాధి కాపాడేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. రైతు బంధు, రైతు భీమా వంటి పథకాలు కష్టకాలంలో అండగా ఉంటాయని గుర్తుచేశారు. ప్రభుత్వం రైతుల పక్షాన ఎప్పటికీ నిలుస్తుందని మంత్రి పునరుద్ఘాటించారు. అన్నారం రైతుల పంట నష్టంపై తక్షణ చర్యలు తీసుకుంటానని మంత్రి వివేక్ వెంకటస్వామి రైతులకు భరోసా ఇచ్చారు.

## కొడంగల్ మెడికల్ కాలేజీకి ఎన్ఎంసి అనుమతులు



**హైదరాబాద్, సెప్టెంబర్ 2 (జనంసాక్షి) :** కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో మెడికల్ కాలేజీకి నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసి) గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. 50 ఎంబిబిఎస్ సీట్లతో కాలేజీకి అనుమతులు ఇస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఈ ఏడాది నుంచే కొడంగల్ కాలేజీలో ఎంబిబిఎస్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్నది. కొడంగల్ మెడికల్ కాలేజీకి అనుమతులు వచ్చిన నేపథ్యంలో ఆరోగ్యశాఖ కార్యదర్శి, వైద్య విద్య అధికారులను మంత్రి దామోదర్ రాజనర్సింహా అభినందించారు. జిఓ.33ను సమర్థిస్తూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే. స్థానికత విషయంలో సమస్య తీరడంతో ఒకటి రెండు రోజుల్లో మొదటి విడత మెడికల్ కౌన్సిలింగ్ ప్రారంభం కానున్నది. ఈ విద్యాసంవత్సరం ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో అందుబాటు-లో 4100కుపైగా ఎంబిబిఎస్ సీట్లు- ఉండనున్నాయి.

## గద్దెనెక్కాక ఉద్యోగుల, పెన్షన్‌దారుల
# సమస్యలు పట్టని ప్రభుత్వం

తెలంగాణలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ఎన్నికల ముందు ఉద్యోగుల ఆశలను రెక్కలు కట్టినట్లు చేసి, ఇప్పుడు వాటిని రాల్చేసినట్లు కనిపిస్తోంది. ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ వ్యవస్థలోని లోపాలు, ముఖ్యంగా కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సీపీఎస్) రద్దు చేసి పాత పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్) పునరుద్ధరణ వంటి హామీలు, అధికారంలోకి వచ్చిన 17 నెలల్లో ఇంత వరకు చర్యలు చేపట్టలేదు. పెన్షన్ దారుల ఓపిక నశించింది. వారి డిమాండ్లు కనుమరుగవుతున్నాయి. ఇది కేవలం ఒక ఆర్థిక సమస్య మాత్రమే కాదు. ఇది లక్షలాది కుటుంబాల భవిష్యత్తును ప్రభావితం చేసే నమ్మక ద్రోహం. ఈ విషయంపై ఇటీవలి డేటాను, గణాంకాలను పరిశీలిస్తే, ప్రభుత్వం యొక్క నిర్లక్ష్యం మరింత స్పష్టమవుతుంది.

సీపీఎస్ 2004లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన వ్యవస్థ, దీని కింద రాష్ట్రాలు కూడా అమలు చేశాయి. తెలంగాణలో 2004 సెప్టెంబర్ 1 తర్వాత నియమితులైన సుమారు 2.2 లక్షల మంది ఉద్యోగులు ఈ స్కీమ్ పరిధిలోకి వచ్చారు. ఉద్యోగి తన జీతంలో 10 శాతం డీడక్ట్ చేస్తే, ప్రభుత్వం కూడా అంతే మొత్తాన్ని జమ చేస్తుంది. ఈ ఫండ్ మార్కెట్‌లో పెట్టుబడి పెట్టబడుతుంది. కానీ, మార్కెట్ హెచ్చుతగ్గుల వల్ల పెన్షన్ మొత్తం అనిశ్చితంగా మారుతుంది. ఓపీఎస్‌లో మాత్రం చివరి జీతంలో 50శాతం పెన్షన్ గ్యారంటీ, డియర్‌నెస్ అలవెన్స్ (డీఏ) సర్దుబాట్లతో స్థిరత్వం ఉంటుంది. సీపీఎస్ వల్ల రిటైర్మెంట్ తర్వాత ఆర్థిక భద్రత తగ్గుతుందని ఉద్యోగ సంఘాలు ఎప్పటి నుంచో వాదిస్తున్నాయి. ఉదాహరణకు, ఒక సాధారణ టీచర్ నెలకు రూ.12,000 కంట్రిబ్యూట్ చేస్తే, ప్రభుత్వం మరో రూ.12,000 జమ చేయాలి, కానీ మార్కెట్ రిటర్న్స్ 9-10 శాతం మాత్రమే ఉండటం వల్ల, చివరి పెన్షన్ తక్కువగా వస్తుంది. అందుకే ఉద్యోగ సంఘాలు దీన్ని వ్యతిరేకిస్తే ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఈ సమస్యను ప్రధాన అస్త్రంగా చేసుకుంది. "అధికారంలోకి వస్తే సీపీఎస్ రద్దు, ఓపీఎస్ పునరుద్ధరణ" అని స్పష్టంగా హామీ ఇచ్చారు. ఇది ఉద్యోగులు, ఉపాధ్యాయుల మద్దతు సాధించడంలో కీలక పాత్ర పోషించింది. కానీ, 2023 డిసెంబర్‌లో అధికారంలోకి వచ్చిన తర్వాత, ఈ హామీపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. బదులుగా, సీపీఎస్ కంట్రిబ్యూషన్స్ డిపాజిట్ చేయడంలో జాప్యం చేస్తున్నారు. 2024 జనవరి నుంచి 2025 మే వరకు, ఉద్యోగుల నుంచి డీడక్ట్ చేసిన రూ.1,300 కోట్లు మరియు ప్రభుత్వ షేర్ రూ.1,300 కోట్లు సహా మొత్తం రూ.2,600 కోట్లు పీఆర్ఏఎన్ అకౌంట్లలో జమ కాలేదు. ఇది కేవలం ప్రిన్సిపల్ మొత్తమే కాదుబీ 9-10 శాతం వడ్డీ నష్టం రూ.260 కోట్లు ఉంటుంది, మార్కెట్ రిటర్న్స్ నష్టం అంతకంటే ఎక్కువ. ఈ నిర్లక్ష్యం వల్ల ఉద్యోగులలో ఆగ్రహం పెరుగుతోంది. సెప్టెంబర్ 1ని 'పెన్షన్ విద్రోహ దినం'గా జరుపుకుంటున్నారు, మహా ధర్నాలు ప్లాన్ చేస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి "కొత్త ఆర్థిక బాధ్యతలు తీసుకోలేం" అని చెప్పడం వల్ల ఈ ఫండ్స్ ఎప్పటికీ డిపాజిట్ అవుతాయా అనే అనుమానాలు పెరుగుతున్నాయి. అంతేకాకుండా, డీఏ అర్రియర్స్ కూడా 17 నెలల్లో కేవలం 5 నెలలు మాత్రమే చెల్లించారు. మిగతావి పెండింగ్‌లో ఉన్నాయి. ఇది ఆర్థికంగా చూస్తే, ప్రభుత్వ ఖజానాపై భారం పెరిగినట్లు కనిపిస్తుంది. తెలంగాణ బడ్జెట్‌లో పెన్షన్లు, జీతాలు ఇప్పటికే 50 శాతం పైగా ఖర్చవుతున్నాయి. ఓపీఎస్ పునరుద్ధరణ వల్ల అదనపు భారం రూ.10,000 కోట్లు వరకు ఉండవచ్చు. ఇది రాష్ట్ర ఆర్థిక స్థిరత్వాన్ని ప్రభావితం చేస్తుంది. కానీ, ఇతర రాష్ట్రాలు ఇలాంటి సవాళ్లను ఎదుర్కొని ఓపీఎస్ అమలు చేశాయి. ఉదాహరణకు, రాజస్థాన్‌లో కాంగ్రెస్ 2022లో ఓపీఎస్ పునరుద్ధరించింది. కానీ, తర్వాత బీజేపీ ప్రభుత్వం దాన్ని రద్దు చేసి న్యూ పెన్షన్ స్కీమ్ (ఎన్‌పీఎస్) తిరిగి తీసుకొచ్చింది. హిమాచల్ ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాలు కాంగ్రెస్ హయాంలో ఓపీఎస్ అమలు చేశాయి, కానీ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. కేంద్రం ఇటీవల యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్) తీసుకొచ్చింది. ఇది సీపీఎస్‌కు సమానంగా కంట్రిబ్యూటరీ మోడల్. కానీ, అస్యూర్డ్ పెన్షన్ 50 శాతం వరకు గ్యారంటీ ఇస్తుంది. తెలంగాణ ఉద్యోగులు దీన్ని కూడా తిరస్కరిస్తూ ఓపీఎస్ నే డిమాండ్ చేస్తున్నారు. విమర్శనాత్మకంగా పరిశీలించి చూస్తే, కాంగ్రెస్ హామీలు ఓట్ల కోసమే అని స్పష్టమవుతోంది. రాష్ట్ర ఆర్థిక స్థితి "నో పైసా, నో ల్యాండ్" అని ముఖ్యమంత్రి అడ్మిట్ చేయడం వల్ల, మహిళలకు రూ.2,500, పెన్షన్ రూ.4,000, రైతులకు రూ.15,000 వంటి ఇతర హామీలు కూడా అమలు కావడం కష్టమే. ఇది ప్రజాస్వామ్యంలో నమ్మకాన్ని దెబ్బతీస్తుంది. ఉద్యోగులు తమ జీవితాలను ప్రభుత్వ సేవకు అంకితం చేస్తారు. కానీ, రిటైర్మెంట్ తర్వాత అనిశ్చితి ఎదుర్కోవడం అన్యాయం. ప్రభుత్వం ఇప్పుడు చర్యలు తీసుకోకపోతే, ఉద్యమాలు మరింత ఊపందుకుంటాయి. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయంగా ఖరీదు చెల్లించాల్సి వస్తుంది. మొత్తంగా, పెన్షన్ సమస్య తెలంగాణ ప్రభుత్వం యొక్క ప్రాధాన్యతలను ప్రశ్నిస్తోంది. హామీలు నెరవేర్చడం ద్వారా మాత్రమే ప్రజల విశ్వాసం పునరుద్ధరించవచ్చు. లేకపోతే, ఇది మరో రాజకీయ ద్రోహంగా చరిత్రలో మిగిలి పోతుంది. ఉద్యోగులు, వారి కుటుంబాలు ఆవేదనతో రగిలిపోతున్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని గ్రహించకుంటే, రానున్న ఎన్నికల్లో ఈ ప్రభుత్వం పై తమ ఓటు ఆయుధాన్ని బలంగా ప్రయోగించనున్నారు.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496

## విద్యుత్ సంస్థల్లో ఎస్సి, ఎస్టి ఉద్యోగుల పదోన్నతులకు..
## రిజర్వేషన్ వ్యతిరేకుల కుట్రల నుంచి
# మోక్షం ఎప్పుడో..?


*తెలంగాణ విద్యుత్ సంస్థల్లో ఎస్సీ, ఎస్టీల కొరకు రాజ్యాంగ పరంగా అమలౌతున్నట్టి రిజర్వేషన్ల పట్ల అక్కస్సు కొద్ది ఓసి, బీసీల పదోన్నతులను ఎస్సీ, ఎస్టీలు అనుభవిస్తున్నారని తప్పుడు ప్రచారానికి ఒడిగట్టి సాఫీగా జరుగుతున్నట్టి పదోన్నతులను పిటిషన్ల ద్వారా అడ్డుకోవడం జరుగుతుంది. రాజ్యాంగపర రిజర్వేషన్ల విషయంలో సుప్రీమ్ కోర్టు ఉత్తర్వులను అర్థం చేసుకోక కొందరు ఓసి, బిసి ఉద్యోగులు జీవో 26 రద్దుకు కోర్టు పరంగా ప్రయత్నించి విఫలమయ్యి కేసు ఓడిపోతున్నామన్న భయం కొద్ది తెలివిగా కోర్టు దృష్టిని జీవో 26 నుంచి మరల్చి నాగరాజు వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా అను కేసులో సుప్రీమ్ కోర్టు నిర్దేశించిన మూడు అంశాల వైపు మళ్ళించారు.*

సుప్రీమ్ కోర్టు చెప్పినప్పటి మూడు అంశాలలో సాధన చేయకుండానే ప్రభుత్వము అన్ని శాఖల్లో ఎస్సీ, ఎస్టీల పదోన్నతులు అమలు పరుస్తుందని చెప్పడంతో కోర్టు స్పందించి ఇక నుంచి నాగరాజు వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా తీర్పులో చెప్పినట్టి మూడు అంశాలలో సాధన చేసుకుంటూ ఎస్సీ, ఎస్టీలకు పదోన్నతులు ఇవ్వాలని డబ్ల్యూపి నెం. 4415/2016 తీర్పులో సూచించింది. నిజానికి ఎస్సీ, ఎస్టీల పదోన్నతులకు జారి అయిన జీవోల్లోనే ఈ మూడు అంశాలు పొందుపరచి ఉన్నందున 2003 నుంచే ఎస్సి, ఎస్టీల పదోన్నతులు ఇచ్చు సందర్భంగా సాధన చేస్తూ పాటిస్తునే ఉన్నారు. నాగరాజు వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా తీర్పు 2006 అక్టోబర్ లో వెలువడినందున కోర్టుకు చెప్పిన అబద్ధము అతికినట్టయ్యింది. అట్టి ఆదేశాలు విద్యుత్ సంస్థలకు కూడా వర్తింప చెయ్యాలి అని విద్యుత్ సంస్థల ఓసి, బిసి ఉద్యోగుల జెఏసి డబ్ల్యూపి నెం. 47125 / 2018 పిటిషన్ వేసింది. అయితే డబ్ల్యూపి నెం. 4415/2016 ఉత్తర్వు వలన లాభం ఉండబోదని గ్రహించి క్యాచ్ అప్ రూల్ పద్ధతి అయితేనే తాము అనుకున్నట్టు ఎస్సీ, ఎస్టీలపై పదోన్నతులు, సీనియారిటీలు సాధించుకోవచ్చని కుట్రతో ఎస్సీ, ఎస్టీల తరపున ఉన్నట్టి డిపార్ట్మెంట్ అడ్వకేట్ తోనే చెల్లుబాటు కానట్టి పనీర్ సెల్వం, బి కె పవిత్ర - 1 తీర్పులను ఉటంకించి వాటిని కూడా పరిగణలోకి తీసుకుంటు ఒక విధానాన్ని రూపొందించి అమలు పరుస్తామని కోర్టులో చెప్పించి డబ్ల్యూపి నెం. 47125/2018 తీర్పులో రికార్డు చేయించడం జరిగింది. అయితే కోర్టు మాత్రం ఈ విషయాన్ని తీర్పులో అవసరము అనుకుంటే వీటిని దృష్టిలో పెట్టుకుని ఒక విధానాన్ని రూపొందించుకోవచ్చు అని అభిప్రాయాన్ని మాత్రమే వెలిబుచ్చింది. విద్యుత్ సంస్థల యాజమాన్యాలు ఏ విధానాన్ని రూపొందించిన 85వ రాజ్యాంగ సవరణ మరియు జీవో 26ల స్ఫూర్తిని నిరుగార్చకుండా ఉండాలి.

ఎస్సీ, ఎస్టీల రోస్టర్ పదోన్నతుల తదనంతరం ఫిక్స్ అయ్యే సీనియారిటీ అనగా కాన్సిక్వెన్షియల్ సీనియారిటీ 85వ రాజ్యాంగ సవరణతో అమలులోకి వచ్చింది. రాష్ట్రంలో కాన్సిక్వెన్షియల్ సీనియారిటీ అమలు జీవో 26 తేది 20.02.2009 ద్వారా జీవో 5 తేది 14.02.2003 కు సవరణతో జీవో 5 తేది నాటి నుంచే అమలులోకి పెట్టడం జరిగింది. కాబట్టి, పనీర్ సెల్వం, బి కె పవిత్ర కేసులు రాష్ట్రంలో చెల్లుబాటుకు ఆస్కారం లేనట్టివి. 85వ రాజ్యాంగ సవరణ ముఖ్య ఉదేశ్యం ఎస్సీ, ఎస్టీలకు పదోన్నతులతో పాటే సీనియారిటీ కూడా కల్పించడం.

విద్యుత్ సంస్థల్లోని ఎస్సీ, ఎస్టీల ప్రయోజనాల కోరకు వాదించడానికి కేసు తీసుకున్న డిపార్ట్మెంట్ అడ్వకేట్ పూర్తిగా ఎస్సీ, ఎస్టీలకు విరుద్ధంగా, ఓసి, బిసి పక్షపాతిగా వ్యవహరించడం జరిగింది. ఎస్సీ, ఎస్టీల పదోన్నతులకు ఇతరులు తెచ్చిపెడుతున్నట్టి సమస్యల పట్ల డిపార్ట్మెంట్ పరంగా ప్రొటెక్ట్ చెయ్యాల్సిన అడ్వకేట్ ఏ కోశాన కూడా న్యాయంగా లేకపోవడం సరికదా అసంబద్ధంగా ఉన్నట్టి, ప్రస్తుత చట్టవిరుదమైన క్యాచ్ అప్ రూల్ ప్రక్రియను తానే కోర్టు ముందు ఉంచి డబ్ల్యూపి నెం. 47125/2018 తీర్పులో కూడా రికార్డు చేయించడం జరిగింది. ఇది దిగజారుడు చర్య, కొందరు విద్యుత్ సంస్థల ఉన్నతాధికారుల ప్రోద్బలంతోనే జరిగి ఉంటుందని విద్యుత్ ఎస్సి, ఎస్టీ ఉద్యోగులు బలంగా నమ్ముతున్నారు. 85వ రాజ్యాంగ సవరణ మరియు జీవ 26ల స్ఫూర్తికి వ్యతిరేకంగా నడుచుకుంటున్న పిటిషనర్ సంఘానికి తెర చాటున కొందరు డిపార్ట్మెంట్ ఉన్నతాధికారులు సహకరిస్తున్నారు కాబట్టి, ఎస్సి, ఎస్టీల పదోన్నతులకు వ్యతిరేకంగా అనైతిక పిటిషన్లతో రాద్ధాంతం జరుగుతున్నప్పటికి, విషయాలు ఆన్ రికార్డ్ స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ ఉన్నతాధికారులు చూడనట్టుగా వ్యవహరిస్తున్నారు.

డబ్ల్యూపి నెం. 47125/2018 తీర్పులో ఉటంకించిన క్యాచ్ అప్ రూల్ కు సంబంధించిన బి కె పవిత్ర, పనీర్ సెల్వం తీర్పులను కూడా పరిశీలించి ఒక విధానాన్ని రూపొందిస్తామని రికార్డు



చేయించినవి అమలు కొరకు విద్యుత్ డిపార్ట్మెంట్ల పై కంటెంప్ట్ పిటిషన్ల వత్తిడి ఉండాలని, అలా చేసి జీవో 26కు విరుద్ధంగా ఓసి, బిసి ఉద్యోగులకు అనుకూలంగా నిర్ణయం జరిపించవచ్చు అని అభిప్రాయపడుతున్నారు. 85వ రాజ్యాంగ సవరణ చట్టం స్ఫూర్తిని గాని, జీవో 26 స్ఫూర్తి ఏ రకంగా బంగ పరిచినా, విస్మరించినా అది చట్ట వ్యతిరేకముగా, రాజ్యాంగ విరుద్ధముగానే భావించాల్సి ఉంటుంది.

తెలంగాణ ప్రభుత్వం, డబ్ల్యూపి నెం. 4415/2016 ఉత్తర్వు ప్రకారం అన్ని ప్రభుత్వ శాఖలలో నాగరాజ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా చెప్పినట్టి మూడు అంశాలలో సాధన జరగక ఎస్సీ, ఎస్టీల పదోన్నతులు ఏమైనా జరిగి ఉంటే తక్షణమే సమీక్షించి, సాధన జరిపి ఒకవేళ ఎస్సీ, ఎస్టీల అడిక్వాసీ తక్కువగా ఉంటే కొత్తగా పదోన్నతులు ఇచ్చి అడిక్వసీని పూరించి (ఇప్పుడు ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్) నివేదికలు ఇవ్వమని ప్రభుత్వం అన్ని శాఖాధిపతులకు ఆదేశించింది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగానే అన్ని శాఖలు సమీక్షలు నిర్వహించి, అడేక్వసీలు పూరించి నివేదికలు కూడా సమర్పించడం జరిగింది. కానీ, విద్యుత్ సంస్థలు మాత్రం ఆ ప్రక్రియను ఈ రోజువరకు మొదలు పెట్టనే లేదు. ప్రభుత్వం ఆదేశించిన విధంగా విద్యుత్ సంస్థలు నడుచుకుని ఉండి ఉంటే డిపార్ట్మెంట్ కు మరియు ఓసి, బిసి ఉద్యోగుల జెఏసి నాయకులకు స్పష్టమైన అవగాహన వచ్చేది, వారి అనుమానం తీరేది. అలాగే డబ్ల్యూపి నెం.47125/2018లోని తీర్పును అమలు పరిచినట్టు అయ్యేది మరియు కంటెంప్ట్ పిటిషన్ల బాధ కూడా తప్పేది. లక్షలు ఖర్చుచేసి అప్పటి అడ్వకేట్ జనరల్ వద్ద నుంచి తెప్పించుకున్నట్టి వివరణ తేది 09.05.2023లో కూడా ఇదే సూచన ఉండింది.

ఇక రెండవ విషయం నేరుగా జరిగిన నియామకాలలో సీనియారిటీల సమీక్ష. ఈ విషయంలో తెలుసుకోవాల్సింది ఏమిటి అనగా రాష్ట్ర ప్రభుత్వానికి ఉద్యోగులకు సంబంధించిన రూల్స్, చట్టాలు చేసుకునే అధికారాలు ఉంటాయి. ఆయా రాష్ట్రాలు ఉద్యోగులకు అక్కడి స్టాట్యూటరీ రూల్స్ ప్రకారం సీనియారిటీలు నిర్ధారించుకుంటారు. ఇట్టి విధానానికి సుప్రీమ్ కోర్టు ఆమోదం కూడా ఉంది. ఎన్నో కేసుల విచారణల సందర్భంగా ఈ విధానాన్ని సమర్థిస్తూ వస్తుంది. మన రాష్ట్రంలో తెలంగాణ స్టేట్ సబార్డినేట్ సర్వీస్ రూల్స్ అలాగే ఉనికిలోకి వచ్చినవి. రాష్ట్రంలోనీ ఉద్యోగులకు సీనియారిటీలు నిర్ధారించేది సబార్డినేట్ సర్వీస్ రూల్స్ లోని రూల్ 33(బి) ప్రకారము. విద్యుత్ సంస్థల్లో పైన చెప్పిన రూల్ 33(బి) మరియు సంస్థ రెగ్యులేషన్స్, పార్ట్ - 2, రూల్ 26(ఏ) ప్రకారమే సీనియారిటీలు నిర్ధారిస్తూ ఐదు దశాబ్దాలకు పైగా కాలంగా అదే పద్ధతిని పాటిస్తున్నారు. సీనియారిటీలను సమీక్షిస్తే కనుక ఇంత కాలంగా నియామకాలలో ఓన్ మెరిట్ ఎస్సీ, ఎస్టీలకు జరిగిన అన్యాయం కూడా బయటపడుతుంది. ఓన్ మెరిట్ ఎస్సి, ఎస్టీలకు జనరల్ మెరిట్లో ఇవ్వాల్సిన నియామకాలు ఇవ్వకుండా వారిని రోస్టర్లకు అడ్జస్ట్ చేసారన్న అపవాదు కూడా నిజమో కాదో తెలుస్తుంది. ఈ రకంగా దశాబ్దాలుగా, నేరుగా నియామకాలు జరిగే అన్ని కేడర్లలో కలిపి వందల సంఖ్యలో ఎస్సీ, ఎస్టీల పోస్టులు నిజంగా విస్మరించబడ్డాయా లేదా అనే విషయాన్ని కూడా రికార్డు మీదికి తేవచ్చు. ఈ విషయాలు నిర్ధారించబడ్డాక నష్టపోయిన పోస్టులకు మళ్ళీ బ్యాక్లాగ్ నోటిఫికేషన్ లు జారీ చేసి ఎస్సి, ఎస్టీల రిక్రూట్మెంట్ చెయ్యాల్సి ఉంటుంది. డిపార్ట్మెంట్ లోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ సంఘాలు ఈ రకంగా నష్టపోయిన ఎస్సీ, ఎస్టీల హక్కులను తిరిగి సాధించుకోవాల్సిన అవసరము ఎంతైనా ఉంది.

నియామకాల సీనియారిటీలు సమీక్షకు పెట్టి ఎస్సీ, ఎస్టీలకు నష్టపర్చగలమని అనుకుంటే ఎస్సీ, ఎస్టీల కన్నా ఎక్కువ నష్టపోయేది ఓసి, బిసి ఉద్యోగులే. రాష్ట్ర ప్రభుత్వం డబ్ల్యూపి నెం. 4415/2016 లోని కామన్ ఆర్డర్ అమలు చేస్తున్న సందర్భంలో ఎస్సి, ఎస్టీల పదోన్నతులు పెరిగాయి. నియామకాల సందర్భంగా రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, అంగ వైకల్యం, మాజీ సైనికులు, స్పోర్ట్స్ వగైరాలకు రిజర్వేషన్లు అమలు చేయడం జరుగుతుంది. నియామకాలలో దాదాపుగ యాభై శాతం వరకు రిజర్వేషన్లు అమలు జరుగాలి, ఇందులో అత్యధికంగా అమలు అయ్యేది బిసిల రిజర్వేషన్. ఓసి, బిసి నాయకులు ఆశిస్తున్నట్టి నియామకాల సీనియారిటీల సమీక్ష లో పైన తెలిపిన రిజర్వేషన్ల ద్వారా ఉద్యోగాలు పొందిన అందరి పదోన్నతులు, సీనియారిటీలు కోల్పోవలసి వస్తుంది. ఆ రకంగా అన్ని కేడర్లలో, అందరూ పదోన్నతులు, సీనియారిటీలు కోల్పోయి క్రింది క్యాడర్లకు అనగా వెనక్కి వెళ్ళాల్సి వస్తుంది. ఈ నిజాలను ఓసి, బిసి నాయకులు వారి ఉద్యోగులకు తెలియచేయ్యాల్సిన బాధ్యత ఉండి కూడా చెయ్యక అమాయక ఓసి, బిసి ఉద్యోగులకు లేని పోనీ భ్రమలు కల్పిస్తున్నారు.

రాష్ట్రంలో బిసిలు రిజర్వేషన్లు అనుభవిస్తున్నపటికీ ఇప్పుడు జనాభా ప్రాదికాన బిసిల రిజర్వేషన్ల శాతాన్ని పెంచాలనే డిమాండ్ తో ఉద్యమిస్తున్నారు. మరో ప్రక్క ఇదే బిసిలు ఎస్సీ, ఎస్టీల రూల్ ఆఫ్ రిజర్వేషన్ పదోన్నతులపై అక్కస్సు పెంచుకుని మెరిట్ అంటూ ఓసిలతో జతకట్టి పిటిషన్ల ద్వారా ఎస్సీ, ఎస్టీల పదోన్నతులు అడ్డుకుంటున్నారు. ఒక వేళ బిసిల ఉద్యమం ఫలించి రిజర్వేషన్లు పెరిగితే జనరల్ మెరిట్ సైజు తగ్గి నష్టపోయేది ఓసిలే. ఈ విధంగా రాష్ట్రంలోని బిసిల పరిస్తితి అగమ్యగోచరంగా తయారయ్యింది.

ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్ల అమలు, వారి అభివృద్ధి కొరకు జారి చేసే ఉత్తర్వుల అమలుకు అడుగడుగునా అడ్డంకులను సృష్టిస్తున్నారు. రిజర్వేషన్లు ఉనికిలోకి వచ్చిన నాటి నుంచి నేటి వరకు ఏనాడు కూడా దేశంలో అడ్డంకులు లేకుండా నిబద్ధతతో సాఫీగా ఉత్తర్వులు అమలుకు నోచుకోలేదు దానికి కారణం ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్ల ఆవశ్యకతను, రాజ్యాంగంలో పొందుపర్చిన ఆర్టికల్ 16 యొక్క స్ఫూర్తిని అర్థం చేసుకునేట్టుగా ఈ కుల సమాజం ఎదగలేదు. విద్యుత్ సంస్థల్లో సైతం ఇప్పటివరకు ఎస్సి, ఎస్టీల రిజర్వేషన్లు, పదోన్నతులు పూర్తిగా అమలుకు నోచుకోలేదు. ఎస్సీ, ఎస్టీల పట్ల జారీ అయ్యే ఆదేశాలు అన్ని ప్రభుత్వ శాఖల్లో రాద్ధాంతానికి గురి చేసి వివరణల సాకుతో ప్రక్కన పెట్టే ఆనవాయితీ ఈ రాష్ట్రంలో చాలాకాలంగా కొనసాగుతుంది. రాష్ట్రంలో ఓసి సంఘం ఉనికిలోకి వచ్చినాక ఓసి, బిసి వర్గాల్లోని ఈ తరం ప్సూయెడో మేధావి వర్గం చరిత్రను పూర్తిగా తెలుసుకోక, ఉత్తర్వులను అర్థం చేసుకోక దూకుడు తనం ప్రదర్శించడం ఎక్కువయ్యింది.

ఎస్సీ, ఎస్టీల కొరకు ఉద్దేశించిన రిజర్వేషన్లు, డిపార్ట్మెంట్లలో పదోన్నతులు, సంక్షేమ ప్రయోజనాలు, ఇతర ఉత్తర్వులన్నీయు నిత్యం అడ్డంకులను ఎదుర్కుంటూ మందకొడిగా అమలౌతుంటే, విద్యుత్ సంస్థల్లోఎస్సీ, ఎస్టీ ఉద్యోగులు మించి ఉన్నారని, రివర్స్ రిజర్వేషన్లు జరిగాయని ఎస్సీ, ఎస్టీలకు ఉదారంగా డిపార్ట్మెంట్ లో పదోన్నతులు కట్టబెట్టారని చెప్పుకోవడం పెద్ద అబద్ధం.

పీఎం రాజు,
పౌర హక్కుల సంఘం, తెలంగాణ
రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు,
తెలంగాణ విద్యుత్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమం

# కోర్టు తీర్పులు - ఆదివాసీలపై ప్రభుత్వాల హత్యాకాండ

**40 ఏళ్ళ రామనాథం వర్ధంతి సందర్భంగా..**



రామనాథం హత్య జరిగి 3 సెప్టెంబర్ 2025 నాటికి సరిగ్గా 40 ఏళ్ళు. 1985 తెలుగుదేశం ఎన్‌టిఆర్ ప్రభుత్వం ఆట-మాట బంద్‌చేసిన కాలంలో ఉద్యమకారులు, ఉద్యమ సానుభూతిపరులపై సాధారణ ప్రజలపై రాజ్య హింస చాలా విస్తృతంగా కొనసాగుతూ ప్రజాస్వామిక వాదులపై కూడా రాజ్యం వేట కొనసాగించింది. అది డా॥ రామనాథంను బలి తీసుకున్నది. 1985 ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు నిర్బంధ కాలం అది, 1985, సెప్టెంబర్ 2వ సాయంత్రం ఖాజీపేట రైల్వేస్టేషన్‌లో యాదగిరి రెడ్డి అనే ఎస్ఐని కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసారు. సెప్టెంబర్ 3నయాదగిరి రెడ్డి శవయాత్ర రామనాథం క్లినిక్ ముందు నుండే వెళుతున్నది. ఎస్.పి., డిఐజి పోలీసులు ఉన్నతాధి కారులతో పాటు చాలామంది పోలీసులు పాల్గొన్నారు. ఈ ఊరేగింపు జయప్రకాశ్ నారాయణ రోడ్డులోని రామనాథం క్లినిక్‌కు కొంతమంది పోలీసులు చొరబడి పాయింట్ బ్లాంక్ రేంజ్‌లో డా॥ రామనాథంను హత్యచేశారు. రెండు గంటలలోపు శవాన్ని పోలీసులు ఆధీనంలోకి తీసుకోవడం హైదరాబాద్ స్థాయిలో కథ అల్లి కొంతమంది గుర్తుతెలియని వ్యక్తులు రామనాథం హత్య చేసారనే ప్రచారం చేసారు. ప్రభుత్వంపై ప్రజల ఆరోపణకు ముందే సర్కారే తప్పుడు ప్రచారానికి సిద్ధమయ్యింది.

రామనాథం కార్యచరణ ఒక బలమైన హక్కులోద్యమానికి బలమైన పునాది వేసింది. చివరికి రామనాథమే హక్కులోద్యమానికి ఒక నినాదంగా మారిపోయాడు. ఆ నినాదం హక్కుల కోసం కొనసాగిన బలమైన విద్యార్థి ఉద్యమాలు రైతాంగ ఉద్యమాలు అన్ని కలిసి ఒక బలమైన ప్రజాఉద్యమాన్ని నిర్మించడంలో రామనాథం పాత్ర, ఆచరణ మనందరి ఒక చరిత్రలో నిక్షిప్తమైన పుస్తకం లాంటిది. అందరము చరిత్రను మనందరం కలబోసుకోవాలి, చరిత్రలో నిక్షిప్తమైన ఆచరణను గుర్తు చేసుకుంటూ, మనందరం 40వ వర్ధంతి సందర్భంగా మరొకసారి స్మరించుకుంటూ సెప్టెంబర్ 3 రామనాథం వర్ధంతి గుర్తు చేసుకుందాం.

అక్టోబర్ 16, 1933న ఖమ్మం జిల్లా మధిర తాలూకాలో మునిలికుంట్ల అనే చిన్న గ్రామంలో జన్మించాడు. వీరి కుటుంబంలో ఉన్నత చదువులు అభ్యసించినవాడు చాలా బాధలకోర్చి డాక్టర్ వృత్తిని పూర్తి చేసినాడు. వరంగల్‌లో ప్రభుత్వ దవాఖానాలో చాలా ఏండ్లు డాక్టర్‌గా, తర్వాత ఖమ్మం, వరంగల్‌లోని హెల్త్ సెంటర్లలో డాక్టరుగా పనిచేసాడు. వృత్తి నేపథ్యంలో వస్తున్న అవినీతి, అనైతిక విధానాలను తట్టుకోలేక డాక్టర్ ఉద్యోగానికి రాజీనామాచేసి 1968లో వరంగల్‌లోనే పిల్లలు వైద్యశాలలను ప్రారంభించాక క్లినిక్ ఆధారంగా ప్రజల అనేక సామాజిక సమస్యలను పరిష్కరిస్తూ వుండేవాడు. అతని వైద్యశాల అనేక సమస్యలతో వచ్చే ప్రజలకు కేంద్రంగా మారిపోయింది. హక్కుల ఉద్యమకారులు నిరంతరం ప్రజాసమస్యల పరిష్కారంలో భాగమవుతూ ఉండేవారు. అందులో భాగంగా హక్కులోద్యమంలో క్రియాశీలకంగా పనిచేసిన రామనాథంతోపాటు గోపి రాజన్న, జాపా లక్ష్మారెడ్డి, నర్రా ప్రభాకర్ రెడ్డి, పురుషోత్తం, ఆజాం అలీలను ప్రభుత్వమే హత్య చేసింది. ఏ హత్యపై కూడా ప్రభుత్వాలు నేరస్తులను పట్టుకునేయత్నం చట్టబద్ధంగా చేయలేకపోయాయి.

రామనాథం హత్య ఎస్ఐ యాదగిరి రెడ్డి హత్యకు, ప్రతీకారంగానే జరిగిందని అధికార ప్రచారం జరుగుతూ ఉంది. ప్రతీకార హత్యలు ప్రజాస్వామ్యంలో ప్రధానంగా ప్రభుత్వంలో ఉండకూడనివి; నిజానికి పౌరహక్కుల సంఘాన్ని నక్సలైట్ల సానుభూతి సంస్థగా పేర్కొనబడడానికి వీలు లేదు. నేటికి పౌర ప్రజాస్వామిక హక్కుల కోసం ప్రజాస్వామికంగా పనిచేస్తున్న సంస్థ, ఎమర్జెన్సీకి ముందు, ఎమర్జెన్సీలో, ఎమర్జెన్సీ తరువాత కొనసాగిన ప్రజల ప్రాథమిక హక్కుల ఉల్లంఘనలోంచే సుమారుగా, దేశంలోని అన్ని హక్కుల సంఘాలు పుట్టాయి. వాటి కార్యచరణ ప్రజాస్వామిక హక్కుల ఉల్లంఘన కొనసాగుతున్నది. కాని చట్ట ఉల్లంఘనలో భాగంగా హత్యలు చేస్తున్న ప్రభుత్వం పోలీసులకు, వారి చట్ట ముసుగును తొలగించి రామనాథం సమాజం ముందు దోషులుగా నిలబెట్టేవాడు. తట్టుకోలేని ప్రభుత్వాలు మొదట నక్సల్స్ ఫ్రంటల్ ఆర్గనైజేషన్‌గా ప్రచారం చేస్తూనే, హక్కుల సంఘం కార్యాచరణలపై నిర్బంధం అమలు చేస్తువస్తూన్నది. నక్సల్స్ హత్యలకు పాల్పడ్డప్పుడు ప్రభుత్వం ప్రతీకార హత్యలకు సిద్ధపడుతున్నది. ఇది ప్రభుత్వాలు అంటున్న ప్రజాస్వామ్యానికి కూడా పూర్తిగా వ్యతిరేకం. సమాజంలో నక్సలైట్లు, ప్రజా ఉద్యమకారుల, పౌరహక్కులే ఎక్కువగా అణచివేతకు గురయ్యాయి. కాబట్టి పౌరహక్కుల సంఘం వారి గురించే ఎక్కువగా మాట్లాడింది. నేటికి మాట్లాడుతూ ఉంది. పౌరహక్కుల సంఘంలో, ప్రజలపై, ప్రజా ఉద్యమాలపై అమలవుతున్న రాజ్యహింసను, నక్సల్స్ పేరుతో జరుగుతున్న హత్యాకాండను ప్రశ్నించేవాళ్ళు ఎక్కువమందే పౌరహక్కుల సంఘంలో సభ్యులుగా ఉంటారు. కాని పౌరహక్కుల సంఘం ప్రధాన లక్ష్యం ప్రభుత్వం చట్టబద్ధ పాలనను ప్రజలకు అందజేసే విధంగా చూడడం నక్సల్స్ పట్లనైనా, ఎవరి పట్లనైనా ప్రభుత్వం చట్టప్రకారం నడుచుకోవాలని రాజ్యాంగం నిర్దేశించిన ప్రాథమిక హక్కులను కొల్లగొట్టకూడదని పౌరహక్కుల సంఘం వాదిస్తున్నది. ఇంతబలంగా మా వాదనలు ఉంటున్నప్పటికీ ఎన్‌కౌంటర్ నిజనిర్ధారణపై కూడా నిర్బంధం అమలుచేస్తూ సత్యాన్ని బంధీఖానాలో బంధీ చేస్తున్నది ప్రభుత్వం. నక్సల్స్ ఆయుధాలు కలిగి ఉన్నారనే దాడే కాదు. నేడు 80ఏళ్ళ ప్రజాస్వామిక వాదులను సైతం చంపే స్థితికి ప్రభుత్వం దిగజారిపోయింది. ప్రశ్నించిన వారిపై పోలీసులను ఎగదోయటం ప్రభుత్వాలు నేర్చుకున్న అప్రజాస్వామిక విద్యలో - న్యాయం కాలగర్భంలో కలిసిపోతున్నది. కాని రామనాథం ఆచరణ తర్వాత 1990లో వరంగల్‌లో జరిగిన రైతుకూలీ సంఘం మహాసభలు వరంగల్ ప్రజలకు ఎంతటి విశ్వాసం ఇచ్చిందో అంత బలంగా వరంగల్‌లో ప్రజా ఉద్యమాలు కొనసాగాయి. ప్రభుత్వం మనిషిని ఎన్‌కౌంటర్‌లో హత్య చేస్తున్నది. మనిషినీ మాయం కూడా చేస్తున్నది. కాన్ని ఎక్కడ ప్రజా పోరాటాలు ఆగలేదు. మాయం కాబడిన వ్యక్తుల కోసం కూడా దేశవ్యాప్తంగా అనేక సంఘాలు ఏర్పడ్డాయి.

40 ఏళ్ళ రామనాథం వర్ధంతి సందర్భంగా పౌర హక్కుల సంఘంగా ఆపరేషన్ కగార్ హత్యాకాండపై బలంగా మాట్లాడాల్సిన అవసరం ఉండింది. కానీ దేశంలో జరుగుతున్న పరిణామాల్లో భాగంగా ఉపరాష్ట్రపతి పోటీ అనేది ప్రధాన ఎజెండాగా ముందుకు వచ్చిన నేపథ్యంలో బిజెపి ప్రభుత్వం అతను సుప్రీం కోర్టు జడ్జిగా ఉన్నప్పుడు జస్టిస్ సుదర్శన్ రెడ్డి నిలువురించిన తీర్పును బయటికితీసి, తీర్పును వక్రీకరిస్తూ మావోయిస్టు సమర్థకులలాగా తీర్పు చెప్పాడని ఆరోపిస్తూ ఆ తీర్పు నక్సలైట్లకు సహాయపడిందని ప్రకటన చేసాడు. ఆ కాలంలోనే సల్వాజుడుంకు మద్దతుగా తీర్పు చెప్పినట్లయితే ఐదేళ్ళ ముందరే నక్సలిజాన్ని నిర్మూలించేవాళ్ళమని ప్రకటన చేసారు. ఇది చాలా ప్రజాస్వామ్య వ్యతిరేకం రాజ్యాంగ ఉల్లంఘనగా మనందనం పరిగణించాలి. సల్వాజుడుంను అప్పుడున్నటువంటి చత్తీస్‌ఘడ్ రమణ్‌సింగ్ ప్రభుత్వం, కేంద్రంలో ఉన్నటువంటి మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం కలిసి కొనసాగించిన ప్రైవేటు సాయుధ దళాల హత్యాకాండే సల్వాజుడుం ప్రతిరూపం. ఈ సల్వాజుడుం కన్నా ముందు 1991 నుండి జన్‌జాగరణ్ అభియాన్ పేరుతో గ్రామాలలో ఉన్న సంఘ నాయకత్వాన్ని గ్రామస్తుల ఇళ్ళను దహనం చేస్తూ బయోత్పాతాన్ని సృష్టిస్తూ అభియాన్ పేరుతో హత్యాకాండలు కొనసాగిస్తూ వచ్చారు. దీన్ని ప్రతిఘటించిన సంఘ నాయకత్వాలను చూసిన తరువాత 2005లో ఇదే మహేంద్ర కర్మ నాయకత్వంలో సల్వాజుడుంను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ప్రారంభించాయి. దీనిలో పెత్తందారులు, భూస్వాములు, వ్యాపారస్తులతో పాటు నక్సల్ ఉద్యమం నుండి సరండర్ అయిన వారిని కూడా పెట్టుకొని సాయుధ దళాలను ఏర్పాటు చేసి గ్రామాలపై దాడులను కొనసాగించేవారు. ఈ సల్వాజుడుం దళాలకు టాటా ఏస్సార్ కంపెనీలు వేతనాలు చెల్లించేవారు. మొత్తంగా సల్వాజుడుం 26566 మందితో కొనసాగింది. 644 గ్రామాలలో పూర్తిగా దగ్ధం చేశారు. లక్షయాభై వేల ఆదివాసీలను విస్తాపనకు గురిచేశారు. కుంట, వింజరం, ఎర్రపోరు, డోర్నపాల్ లాంటి చోట్ల పెద్ద పెద్ద బేస్ క్యాంపులను ఏర్పాటు చేసి యాభై వేల మందితో క్యాంపులను నిర్వహించారు. ఈ క్యాంపుల్లో వర్ణించబడ్డ మహిళలకుగాని, పురుషులకుగాని, బాలులకుగాని ఎటువంటి హక్కులు ఉండేటివి కాదు. చివరికి వారిని బానిసల కన్నా హీనంగా వేటాడారు. ఈ స్థితిలో ప్రొ. నందిని సుందర్, చరిత్రకారులు రామచంద్రగుహ, శర్మ నేతృత్వంలో సుప్రీంకోర్టులో పిటీషన్ వేయడం ద్వారా 2011లో సల్వాజుడుం రద్దు విషయమై ఒక బలమైన తీర్పును పొందగలిగారు. కానీ వెయ్యికి పైగా హత్యాకాండను సృష్టించిన ఈ సల్వాజుడుం బృందంపై కేసుల నమోదు కోసం ప్రయత్నం చేసిన ప్రముఖ గాందేయవాది హిమాంష్ కుమార్‌కు కేవలం 500 వరకే కేసులను నమోదు చేయించగలిగాడు. చివరికి వాటికోసం గత రెండేళ్ళ క్రితం సుప్రీం కోర్టు విచారణ చేపట్టే క్రమంలో విచారణ చేపట్టడం వల్ల కూడా మావోయిస్టు ఉద్యమం బలపడుతుందని తలస్తూ కేసులు వేసినందుకు హిమాంష్ కుమార్‌పై కూడా ఐదు లక్షల నష్టపరిహారం విధించింది. ఇప్పటికి ఆ కేసులు ఆ విధంగానే పెండింగ్‌లో ఉన్నాయి. ఇది సల్వాజుడుం దాడిలో 450లకుపైగా హత్యగావించబడ్డారు. ఏ ఒక్క హత్యాఘటనపై ఇప్పటికీ విచారణ చేపట్టడం జరగలేదు. 2011లో వచ్చిన సుప్రీం కోర్టు తీర్పు కూడా ఈ సల్వాజుడుం చెల్లదు దాన్ని రద్దుచేయాలని తీర్పును అమలు చేయకుండానే ఆ సల్వాజుడుం ప్రైవేటు సాయుధ దళాలకు డిస్ట్రిక్ రిజర్వ్ గార్డ్‌గా పేరు మార్చి అధికారికంగా వినియోగించుకోవడం జరుగుతుంది.

సల్వాజుడుం తరువాత వచ్చిన ఆపరేషన్ గ్రీన్‌హంట్, సమాధాన్, నేడు కొనసాగుతున్న ఆపరేషన్ కగార్‌లో కూడా డిస్ట్రిక్ రిజర్వ్ గార్డ్స్ క్రియాశీలక పాత్రను పోషిస్తూ ఆదివాసీలను అత్యంత హేయమైన పద్ధతిలో వేటాడుతూ హత్య చేసి ఎన్‌కౌంటర్‌గా ప్రకటిస్తున్నారు. ఈ రెండేళ్ళ కాలంలో ఆపరేషన్ కగార్‌పేరుతో 70కిపైగా ఎన్‌కౌంటర్లలో 650 మందిని అత్యంత కిరాతకంగా చంపేసారు. చివరికి మావోయిస్టు కేంద్ర కమిటి కార్యదర్శి నంబాల కేశవరావు, కేంద్ర కమిటి సభ్యులు, సుధాకర్, గాజర్ల రవిలు సజీవంగా దొరికినప్పటికి అత్యంత చిత్రహింసలకు గురి చేసి హత్య చేసి ఎన్‌కౌంటర్‌గా ప్రకటించారు. ఈ పరిస్థితే ఇలా ఉంటే సాధారణ ఆదివాసీలను లెక్కలేకుండా చంపేస్తున్నారు. ఈ స్థితిలో ఉపరాష్ట్రపతి ఎన్నిక ముందుకు రావడంతో సల్వాజుడుం తీర్పు అనేది అమిత్‌షానే ఎజెండా మీదికి తీసుకువచ్చారు. 50 ఏళ్ళుగా కొనసాగుతున్న మావోయిస్టు ఉద్యమంపై దేశంలో ఉన్న మేధావులందరు ఇది వామపక్ష ఉగ్రవాదం కాదు ఇది సామాజిక, ఆర్థిక, అంతరాల మధ్య ఉన్న సమస్య, దీని పరిష్కారం చేయడానికి పీపుల్స్ వారైనా, మావోయిస్టు పార్టీ అయినా సరే, ఒక రాజకీయ పార్టీగా అనేక త్యాగాలతో పోరాటం చేస్తూ ప్రజలను విముక్తిబాటవైపు నడిపించడానికి ప్రయత్నం చేస్తున్నారు. అందులో భాగంగా ఇప్పటికే మావోయిస్టులు కూడా సుమారు 10 వేలకుపైగా చనిపోయారు. ప్రభుత్వాలు చర్చల ద్వారా పరిష్కరించు కోవాల్సిన అంశాలను హత్యాకాండలు కొనసాగించి, నక్సలిజాన్ని రూపుమాపాలని 30 మార్చి 2026 ముహూర్తం తేదిని నిర్ణయించి హత్యాకండను కొనసాగిస్తున్న అమిత్‌షా మోడీల అప్రజాస్వామిక హంతక పాలనను మనందరం ప్రశ్నించాల్సిన అవసరం ఉన్నది. దేశంలోని రిటైర్డ్ న్యాయమూర్తులు కూడా బి. సుదర్శన్ రెడ్డి పక్షంమీద నిలబడి సుప్రీం కోర్టు తీర్పును తప్పు పట్టడం సరైంది కాదని అదీ కాక ఇప్పుడు కొనసాగిస్తున్న ఆదివాసీల అణచివేతను హత్యాకాండను ప్రశ్నిస్తున్న మేధావులపై దాడిని కొనసాగిస్తున్నది. అందులో భాగంగానే అప్పుడు తీర్పు వెలువరించిన సుప్రీం కోర్టు తీర్పు అయినపటికి అది బి. సుదర్శన్ రెడ్డి పరిమితం చేస్తూ వ్యక్తిగత తీర్పుగా పరిగణిస్తూ అతనిపై దాడికి బిజెపి ప్రభుత్వం కేంద్ర హోం శాఖా మంత్రి అమిత్‌షా ప్రయత్నిస్తున్నాడు. రామనాథం అమరత్వ స్ఫూర్తితో ప్రజాస్వామ్య వాదులుగా రాజ్యాంగాన్ని రక్షించుకునే ప్రయత్నంలో మనందరం నిలబడాల్సిన అవసరం ఉంది.



ఎన్.నారాయణ రావు
ప్రధాన కార్యదర్శి. పౌర హక్కుల సంఘం

# ఎమ్మెల్యేల ఇండ్లు ముట్టడిస్తాం

- అంగన్వాడీలు కలెక్టరేట్ ముట్టడి

**వికారాబాద్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 2 (జనం సాక్షి) :** ప్రీ ప్రైమరీ పీఎం శ్రీ విద్య అంగన్వాడి కేంద్రంలో నిర్వహించాలని పోటీ సెంటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా వ్యాప్తంగా ఉన్న అంగన్వాడి టీచర్లు హెల్పర్లు మంగళవారం వికారాబాద్ జిల్లా కలెక్టరేట్ ముట్టడి చేశారు. జిల్లా నలుమూలల నుంచి భారీగా అంగన్వాడి టీచర్లు కలెక్టరేట్ ముట్టడికి తరలివచ్చారు. తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియూ జిల్లా అధ్యక్షురాలు, నర్సమ్మ అధ్యక్షతన కలెక్టరేట్ ముట్టడి జరిగింది. నాలుగు గంటల పాటు కలెక్టరేట్ ముందు హై డ్రామా చోటుచేసుకుంది. వర్షానికి లెక్కచేయకుండా బిస్మించుకొని కూర్చున్న అంగన్వాడీ మహిళలతో పోలీసుల తోపులాటలు జరిగాయి. దీంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. కొందరు అంగన్వాడి మహిళలకు చిన్న చిన్న గాయాలు తగిలాయి. ఈ సందర్భంగా అంగన్వాడి యూనియన్ సిఐటియు జిల్లా కార్యదర్శి భారతి, సిఐటియూ జిల్లా అధ్యక్షులు ఆర్ మహిపాల్, జిల్లా కార్యదర్శి రామకృష్ణ లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ప్రీ పై మరి పీఎం శ్రీవిద్యను అంగన్వాడి కేంద్రాలలో నిర్వహించాలని విద్య బోధన బాధ్యతను అంగన్వాడీ టీచర్లకు, హెల్పర్లకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. విద్యా వాలంటీర్లకు నియమించిన వేతనాన్ని వారికి అదనంగా అన్నారు. ఆరు సంవత్సరాల లోపు పిల్లలకు ప్రైవేటు స్కూల్స్ నడపడానికి అనుమతి ఇవ్వకూడదని డిమాండ్ చేశారు. అదరపు పనులు రద్దు చేయాలి. ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని. రాష్ట్ర వ్యాప్తంగా




ఇచ్చిన మేరకు వికారాబాద్ కలెక్టర్ కార్యాలయం ముట్టడి చేసే ప్రయత్నంలో పోలీసుల తోపులాట జరిగింది. పరిస్థితి ఉధృతంగా మారింది వికారాబాద్ డీఈవో పీఎం విద్య, పోటీ సెంటర్ల కోసం ఈ నెల 1 నుంచి 9తొమ్మిది వరకు నిర్వహిస్తున్న కొత్తవారికి సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ ను వెంటనే రద్దు చేయాలని ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని నూతన విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయం ముట్టడి చేశారు. అధికారులు బయటికి రావాలని అంగన్వాడీలు పట్టుబట్టడంతో పోలీసుల అతి ఉత్సాహంతో తోపులాటలు జరిగాయి. మహిళలకు నాయకులకు చిన్న చిన్న గాయాలు తగిలాయి. ఆరు సంవత్సరాల లోపు పిల్లలకు అందించే ఇంగ్లీష్ మీడియం విద్యకు వ్యతిరేకం కాదు. ప్రీ ప్రైమరీ పీఎం విద్యపై నా రాష్ట్ర ప్రభుత్వం చేసిన నిర్ణయం సరైనది కాదు. అలా చేస్తే ఒక డిపార్ట్మెంటు బలోపేతం కోసం, మరొక డిపార్టుమెంటును నాశనం చేయడమే అవుతుందని అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ విద్య బలపడాలంటే, ప్రైవేట్ విద్యను నిర్వీర్యం చేయాలని ఆరు సంవత్సరాల లోపు పిల్లలకు ప్రైవేటు స్కూల్స్ నడపడానికి అనుమతి ఇవ్వకూడదు ప్రీ ప్రైమరీ పీఎం శ్రీవిద్యను అంగన్వాడి కేంద్రాలలో నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రీ ప్రైమరీ పి యం శ్రీవిద్య ను అంగన్వాడి కేంద్రాల్లో నిర్వహించాలి. విద్యా బోధన బాధ్యతను అంగన్వాడి టీచర్స్ హెల్పర్స్ ఇవ్వాలి. విద్యా వాలంటీర్లకు నిర్ణయించిన వేతనాన్ని అదనంగా అంగన్వాడీ టీచర్స్ హెల్పర్స్కు ఇవ్వాలి. ఆరు సంవత్సరాల లోపు పిల్లలకు ప్రైవేట్ స్కూల్స్ నడపడానికి అనుమతి ఇవ్వకూడదు. ఐసిడిఎస్కు సంబంధంలేని బిఎల్ఓ తదితర అదనపు పనులను రద్దు చేయాలి. అంగన్వాడి టీచర్స్, హెల్పర్స్ కాలిపోస్టులను వెంటనే భర్తీ చేయాలి. ప్రీ ప్రైమరీ పీఎం శ్రీవిద్యను రద్దు చేయనిచో కొత్త దరఖాస్తులు వికారాబాద్ డీఈవో తీసుకోవడం ఆ పనిచో.. ఎమ్మెల్యేల ఇండ్లు ముట్టడిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అంగన్వాడి పోరాటానికి మద్దతుగా వచ్చిన సిఐటియూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మహిపాల్ రామకృష్ణ, ఉపాధ్యక్షులు బుస చంద్రయ్య, సతీష్, అంగన్వాడి యూనియన్ జిల్లా నాయకులు నర్సమ్మ, భారతీ లక్ష్మి భారతి విజయలక్ష్మి నిర్మల కవిత యాదమ్మ సత్యమ్మ మంజుల, బేబీ, సుజాత ,నర్సింగ్ మ్మ, మనోహర లక్ష్మి భాగ్యలక్ష్మి అండాలు తారాబాయి విజయబాయి లక్ష్మీబాయి జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ సమస్యల్ని తక్షణమే పరిష్కరించాలి



**అబ్దుల్లాపూర్మెట్, సెప్టెంబర్ 2 (జనం సాక్షి) :** అబ్దుల్లాపూర్మెట్ గ్రామపంచాయతీ పరిధిలోని జిన్నారం కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఐ అబ్దుల్లాపూర్మెట్ మండల కార్యదర్శి, మాజీ కౌన్సిలర్ అజ్మీరా హరి సింగ్ నాయక్, మండల సహాయ కార్యదర్శి కేతరాజు నరసింహ కలిసి గ్రామపంచాయతీ కార్యదర్శి గారికి వినతిపత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... జిన్నారం కాలనీలో హైస్కూల్ నుండి చివరి బస్ స్టాప్ వరకు రహదారిపై మురుగునీరు ఎప్పటికప్పుడు నిల్వవుతున్నదని, దాంతో రోడ్డు అంత పకూరు పట్టి కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గత నాలుగేళ్లుగా పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా అధికారులు పట్టించుకోలేదని సిపిఐ నాయకులు విమర్శించారు. వెంటనే చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిన్నారం శాఖ కార్యదర్శి వద్యా రమేష్ నాయక్, కె.మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

# యువత అభివృద్ధి కోసం కృషి చేయాలి

- చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి
- చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్. రత్నం

**మొయినాబాద్, సెప్టెంబర్ 2 (జనం సాక్షి) :** దేశ అభివృద్ధిలో యువత ఎంతో కీలకమని యువతతోనే దేశాభివృద్ధి సాధ్యమని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే బీజేపీ నాయకుడు కేఎస్.రత్నంలు అన్నారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం 66వ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేవెళ్ల నియోజకవర్గం లోని చేవెళ్ల, మొయినాబాద్, శంకర్ పల్లి, షాబాద్, నవాబ్ పేట్ మండలాల లోని బీజేపీ నాయకులు కార్యకర్తలు జంట నగరాల నుంచి అభిమానులు బిజెపి నాయకులు పాల్గొన్నారు. చేవెళ్ల బీజేపీ ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, చేవెళ్ల ఓబిసి మోర్చా అధ్యక్షుడు బాకారం ఎల్లని వెంకటేష్ గౌడ్ పాల్గొని నాయకులతో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా చేవెళ్ల ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. దేశ అభివృద్ధి యువతతోనే సాధ్యమని అన్నారు. యువతతోనే అన్ని సాధ్యమవుతున్నాయని తెలిపారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు నేడు గ్రామాలలో ప్రజలకు చేరుతున్నాయని తెలిపారు. ముఖ్యంగా రైతులు దేశ ప్రధాని నరేంద్ర మోడీని ఎంతో ఆదర్శంగా అభిమానిస్తున్నారని పేర్కొన్నారు. నేడు ప్రపంచ దేశాలలో భారతదేశం అన్ని



రంగాలలో ఆదర్శంగా అభివృద్ధి చెందిందని మరింత అభివృద్ధి చేసేందుకు నరేంద్ర మోడీ ప్రపంచ దేశాలతో పోటీపడుతూ.. భారతదేశాన్ని అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నారని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపుగా అందరూ పని చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చన్వెల్లి ప్రభాకర్ రెడ్డి, మల్లేష్, మోత్కుపల్లి మాజీ సర్పంచ్ రత్నం, మండల అధ్యక్షుడు దారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు మాదాపురం శ్రీకాంత్, ఉపాధ్యక్షులు షాబాద్ కిషన్, కొత్తపల్లి తిరుపతిరెడ్డి, సమ ప్రభాకర్ రెడ్డి, మోర నర్సింహారెడ్డి, రాంపల్లి సంతోష్ కుమార్, శ్రీనివాస్ గౌడ్, నియోజకవర్గ బీజేపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- మండల కేంద్రాలలో ధర్నాలను జయప్రదం చేయండి
- సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు

**ఊరుకొండ, సెప్టెంబర్ 2 (జనం సాక్షి) :** తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈనెల 2, 3 తేదీలలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండల ప్రజాపరిషత్ కార్యాలయాల ముందు ధర్నా కార్యక్రమం చేపట్టాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు బంగారు అజనేయులు కోరారు. మంగళవారం రోజు ఊరుకొండ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా చేపడంతోపాటు వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఎంపీడీవోకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ ప్రకారం మల్టీ పర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలని.. ప్రతి నెల గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాల చెల్లింపులు చేయాలని డిమాండ్ చేశారు. పంచాయతీ సిబ్బందికి బకాయి వేతనాలు చెల్లించాలని.. అసెంబ్లీలోనే అమలు చేయాలని



కోరుతూ ప్రతి మండల కేంద్రంలో మండలంలోని సిబ్బంది అందరినీ పాల్గొనేలా రాష్ట్ర ఆఫీస్ వైరస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాధ్యత తీసుకొని కార్యక్రమాన్ని ఉధృతంగా జరిగేలా చూడాలని పేర్కొన్నారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శి పరుశురామ్, అలివేల, నరసింహ, కృష్ణయ్య, శంకరమ్మ, బాల్ చెన్నమ్మ, ఆంజనేయులు, తిరుపతమ్మ, ఇదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# స్కాలర్‌షిప్ తక్షణమే విడుదల చేయాలి

- ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా
- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎర్రోళ్ల మహేష్, టీ. రాజేష్

**సంగారెడ్డి టౌన్, సెప్టెంబర్ 2 (జనం సాక్షి) :** పెండింగ్‌లో ఉన్న రూ. 8158 కోట్ల స్కాలర్షిప్ రియంబర్స్‌మెంట్ ఫీజులు వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంగళవారం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ధర్నా, భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఎర్రోళ్ల మహేష్ , టీ. రాజేష్ లు మాట్లాడుతూ రాష్ట్రంలో పేద విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2004 లో ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాన్ని నాటి ప్రభుత్వం తీసుకుని వచ్చిందన్నారు. ప్రభుత్వమే సామాజికంగా, ఆర్థికంగా వెనుక బడిన వర్గాల విద్యార్థులకు డిగ్రీ ప్రొఫెషనల్ కోర్సులు, యూనివర్సిటీ విద్య చదువుతున్న




విద్యార్థులకు ఈ ఫీజును చెల్లిస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంగా విభజన చెందినా తర్వాత ఏర్పడిన బిఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకాన్ని మార్చాలని చూసిందని విద్యార్థుల ఉద్యమించటంతో వెనక్కు తీసుకుందని అన్నారు. 2014 నుండి 2018 వరకు ఫీజులు చెల్లించిన బిఆర్ఎస్ ప్రభుత్వం 2019- 20 విద్యాసంవత్సరం కొంత బకాయిలను ఉంచింది. అప్పటి నుండి రాష్ట్రంలో 2024 వరకు సుమారు 5358 కోట్ల స్కాలర్ షిప్స్ , ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులు ఇతర స్కీం లకు వాడుకుంది. విద్యార్థులకు ఒక్క పైసా చెల్లించకుండా వారి చదువుల నుండి మధ్యలోనే డ్రాప్ అయ్యే చర్యలకు పూనుకుంది. బిఆర్ఎస్ పాలనలో ఫీజు బకాయిలు ఇవ్వలేదని, ఈ పథకాన్ని తీసుకుని వచ్చింది మా కాంగ్రెస్ అని మేం అధికారంలోకి వస్తే ఫీజు రీయింబర్స్ మెంట్ పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేస్తామని, మరింత అభివృద్ధి చేసి అందరికి బకాయిలు లేకుండా ఇస్తామని కాంగ్రెస్ తన ఎన్నికల మేనిఫెస్టోలో హామీని ఇచ్చిందని గుర్తు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా ఫీజుల బకాయిలు చెల్లించలేదన్నారు. గత ప్రభుత్వాల బకాయి, కాంగ్రెస్ ఇవ్వాల్సిన నిధులు కలిపి రూ. 8,158 కోట్లు నిధులు ఇవ్వాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, పావని, శ్రావణి, , జి శంకర్, అభి, చిన్న, సందీప్, రజనీకాంత్, రిషి, మార్కస్, సిద్దు, రాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## నష్టపోయిన పంట పొలాలను పరిశీలించిన ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



**బోధన్, సెప్టెంబర్ 2 (జనంసాక్షి) :** బోధన్ నియోజకవర్గ పరిధికొని సాలూర మండలం ఖాజాపూర్, హున్స, మంధర్న గ్రామాల పంటలను భారీ వర్షాల కారణంగా పంట నష్టాన్ని అంచనా వేయడానికి వరద ప్రభావిత ప్రాంతాలను బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి క్షేత్రస్థాయిలో సందర్శించారు. భారీ వర్షం మరియు వరదల కారణంగా పంటలు కోల్పోయిన రైతులకు మరియు ఇళ్ళు దెబ్బతిన్న కుటుంబాలకు పరిహారం అందుతుందని అయన అన్నారు. వ్యవసాయం, ఉద్యానవనం మరియు రెవెన్యూ శాఖల అధికారులు గ్రామ స్థాయిలో పంట నష్టంపై సంయుక్తంగా సర్వేలు నిర్వహించాలని మరియు తుది ఏకీకృత నివేదికను సమర్పించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, టీపీసీసీ డెలిగేట్ గంగా శంకర్, మందర్న కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మందర్న రవి, బోధన్ మార్కెట్ కమిటీ చైర్మన్ చీల శంకర్, నాయకులు అల్లే రమేష్, ఖాజాపూర్ అశోక్, అల్లె జనార్ధన్, రైతులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ చేసిన ఆరోపణలకు నిరసనగా ధర్నా



**మల్దకల్, సెప్టెంబర్ 2 (జనంసాక్షి) :** మండల కేంద్రంలో బిఆర్ఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ యువజన విభాగం నాయకుడు రామకృష్ణమాట్లాడుతూ కాలేశ్వరంపై కాంగ్రెస్ బిజెపిల నాటకలను ప్రజలు గమనిస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు తిప్పి కొట్టాలని వారన్నారు.కెసిఆర్ నిర్మించిన కాలేశ్వరం ప్రాజెక్టుపై ఉరవలేక ఓర్వలేక కాంగ్రెస్ బిజెపి ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నారని వారు మండిపడ్డారు.కాలేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు గర్వకారణమని గోదావరి జిల్లాలను ఎత్తిపోసి లక్షల ఎకరాలకు సాగునూరు అందించిన చరిత్ర కేసీఆర్కు దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ ఎస్ యువజన విభాగం జిల్లా నాయకులు రామకృష్ణ ముదిరాజ్, విరేష్ గౌడ్,జిల్లా యువ నాయకులు చిన్న యాదవ్,పుణ్యమూర్తి, నాగరాజు,అగ్గి నడిపన్న,రజినీ, రమేష్,వినయ్,నీలా పరుష, రాముడు,రమేష్, అఖిల్,వెంకట్రాములు,రమేష్ ధర్మ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి

- బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి జహంగీర్



**శామీర్‌పేట్, సెప్టెంబర్ 2 (జనంసాక్షి) :** బిఆర్ఎస్ పార్టీని అంతమొందించడం కాంగ్రెస్ పార్టీ తరం కాదని బి ఆర్ ఎస్ పార్టీ రాష్ట్ర కార్య దర్శి మహ్మద్ జహంగీర్ అన్నారు. కాళేశ్వరం పేరుతో బి ఆర్ ఎస్ పార్టీని కించ పర్చడాన్ని నిరసనగా శామీర్ పేట్ మండలంలో బిఆర్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి పిలుపు మేరకు మంగళవారం షామీర్ పేట మండలం అలియాబాద్ చౌరస్తా నుంచి బి ఆర్ ఎస్ శ్రేణులు పాదయాత్రగా వచ్చి తాహశీల్దార్ కార్యాలయం ముందు అంబేద్కర్ విగ్రహానికి పూల దండ వేసి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం బిఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ తరలించారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ మండల పార్టీ అధ్యక్షులు మోహన్ రెడ్డి, మల్లేష్, డిసిఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి, తుంకుంట మున్సిపాలిటీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు రాజు యాదవ్, జగదీశ్ గౌడ్, సతీష్ రెడ్డి, వెంకట్ రెడ్డి, ఐలయ్య, బి ఎన్, ఆర్, శంకర్, పవన్,పెద్ద సంఖ్యలో టిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు.

## గణపయ్య ఆశీస్సులు అందరిపై ఉండాలి

- సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



**సంగారెడ్డి టౌన్, సెప్టెంబర్ 2 (జనం సాక్షి) :** గణపయ్య ఆశీస్సులు అందరిపై ఉండాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో మొట్టమొదటి సారిగా ఏర్పాటు చేసిన వినాయక మండపంలో గణపయ్యకు నిర్వహించిన పూజల్లో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ మాట్లాడుతూ... గణేష్ని ఆశీస్సులతో నియోజకవర్గంలోని ప్రజలు సుభిక్షంగా ఉండాలన్నారు. సంగారెడ్డి జిల్లాలోనే నాయి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో సంగారెడ్డి పట్టణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ఏర్పాటు చేయడం శుభ పరిణామం అన్నారు. అనంతరం నిర్వాహకులు ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ కు శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సిడిసి చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, కంది మాజీ జెడ్పిటిసి కొండల్ రెడ్డి, మాజీ టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షులు మామిళ్ళ రాజేందర్, నాయి బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా అధ్యక్షులు నాగభూషణం, పట్టణ గౌరవ అధ్యక్షులు దత్తాత్రేయ, వర్కింగ్ ప్రెసిడెంట్ సాయినాథ్, ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, కమిటీ సభ్యులు పెంటయ్య, గోపాల్, సంగన్న, రాజు, పాండు, శేఖర్, కిరణ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్ల మరమ్మతులు వెంటనే చేపట్టాలి

**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 2 (జనం సాక్షి) :** వర్షాలకు పాడైన రోడ్లు వెంటనే మరమ్మతులు చేపట్టాలని నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్ అధికారులను ఆదేశించారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బ తిన్న ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్, నీటిపారుదల శాఖ కు సంబంధించిన బీటీ, మట్టి రోడ్లను మంగళ వారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలించారు. ముందుగా జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి ఆర్డిఓ ఆఫీస్, పాత బస్టాండ్ మీదుగా పళ్ళా బ్రిడ్జ్, ఎంబీ చర్చి ఆర్ అండ్ బీ రోడ్డు ను చూశారు. అటు నుంచి ఎక్లాస్ పూర్ మార్గంలోని లోకపల్లి లక్ష్మమ్మ గుడికి వెళ్ళే మట్టి రోడ్డును పరిశీలించారు. ఇటివలే లోకపల్లి లక్ష్మమ్మ జాతరకు ముందు ఆ రహదారిని మట్టి వేసి చదును చేయగా వారం క్రితం కురిసిన వర్షాలకు ఆ మట్టి రహదారి కొంచెం దెబ్బ తిన్నదని, పై నుంచి వచ్చే వాన నీరు రహదారి పైకి చేరకుండా చిన్న కల్వర్టు మాదిరిగా పైపులు వేయా లంటే రహదారి పక్కన ఉన్న వెంచర్ యజమాని నిరాకరి స్తున్నాడని పీఆర్ ఈ ఈ హీర్యా నాయక్ కలెక్టర్ కు తెలిపారు. స్పందించిన కలె క్టర్ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని సూచించారు. జాతరకు ఎంత మంది భక్తు లు వస్తారని ప్రశ్నించగా దాదా పు 50 నుంచి 60 వేల మంది వస్తారని లోకపల్లి ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇటీవలే



జాతర జరిగిందని వారు చెప్పారు. అనంతరం కలెక్టర్ ఊట్కూరు మండలం వల్లంపల్లి గ్రామానికి వెళ్లే మట్టి రహదారిని పరిశీలించారు. వర్షం వస్తే ఆ రహదారి చిత్త డిగా మారుతుందని, తాత్కాలిక మరమ్మతు పనులు చేస్తామని పంచాయతీ రాజ్ అధికారులు తెలపగా, ఇంతకుముందు ఆ రహదారి మర మ్మతులకు ఎన్ని నిధులు మంజూరు అయ్యాయి..? ఇంకా ఎన్ని మిగిలి ఉన్నాయి అనే వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. చివరగా పట్టణంలోని యాదగిరి రోడ్డు మార్గంలో గల కొత్త కాలనీ కి వెళ్ళే దారిలో ఉన్న లోలెవల్ కల్వర్టును కలెక్టర్ పరిశీలించారు. ఇటీవలే ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు వాన నీరు కల్వర్టుపైకి చేరి రాకపోకలు నిలిచి పోయా యని, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్నికా రెడ్డి చొరవతో అవతలి వైపు నుంచి తాత్కా లిక దారిని ఏర్పాటు చేయ డం జరిగిందని ఆ కాలనీవాసులు కలెక్టర్ కు తెలిపా రు. అయితే కల్వర్టు కింద నుంచి వాన నీరు ముందుకు పోకుండా ప్లాస్టిక్ వ్యర్థాలు, ముళ్ళ పొదలు ఉన్నాయని వాటిని తొలగింపజేయాలని కలెక్టర్ మున్సిపల్ అధికా రులను ఆదేశించారు. కల్వర్టు ఎత్తు పెంచి నిర్మించేందుకు ప్రతిపాదిస్తామని కాలనీ వాసులకు కలెక్టర్ భరోసా ఇచ్చారు. అనంతరం కలె క్టరేట్ లోని తన ఛాంబర్ ఆర్ అండ్ బి, పంచాయతీరాజ్, నీటిపారుదల శాఖ అధికారు లతో విపత్తు నిర్వహణ నిధుల వినియోగంపై కలెక్టర్ చర్చించారు. విపత్తు నిర్వహ ణ నిధులకు సంబంధించి రోడ్లు, కల్వర్టులు, తెగిన చెరు వులు, కుంటల మరమ్మ తులకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇవ్వాలని కలెక్టర్ ఆయా శాఖల అధికారులను ఆదేశిం చారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఈ.ఈ. వెంకటర మణ, డీ ఈ రాములు, నీటిపారుదల శాఖ ఈ ఈ బ్రహ్మానందరెడ్డి, మున్సిపల్ కమిషనర్ నర్సయ్య, పి.ఆర్.ఆర్ అండ్ బిఏఈ లు పాల్గొన్నారు.

# కేసీఆర్‌పై కక్ష సాధింపు చర్యలు మానుకోవాలి



**టేక్మాల్, సెప్టెంబర్ 2 (జనం సాక్షి) :** కాలేశ్వరం ప్రాజెక్టుపై అవినీతి జరిగిందని కేసీఆర్ పై రేవంత్ రెడ్డి కావాలనే కక్ష సాధింపుకు చర్యలకు పాల్పడుతున్నాడని బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు భక్తుల విరప్ప అన్నారు. నీళ్లు నిధుల కోసం తెలంగాణ ను సాధించుకున్నాము అందులో భాగంగానే తెలంగాణలో భారీ నీటిపారుదల ప్రాజెక్టు కాలేశ్వరం నిర్మాణం జరిగిందన్నారు. బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్,హరీష్ రావు, క్రాంతికిరణ్ ఆదేశాల మేరకు మంగళవారం టేక్మాల్ మండల కేంద్రంలో బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు ధర్నా రాస్తా రోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువత కార్యదర్శి నాయికోటి భాస్కర్, కమ్మరి సిద్దయ్య, సాయిలు, రవి,భసంత్ రావు,రమేష్ నాయక్, సుధాకర్, సాయిబాబా, మహేందర్,నారాయణ,గోవింద చారి,సురేష్, పాల్గొన్నారు.

# మహబూబ్‌సాగర్ చెరువు అభివృద్ధి లక్ష్యం

- రూ.500 కోట్లతో సుందరీకరణ
- టిజిఐసి కార్పొరేషన్ చైర్మన్ నిర్మల, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి
- చెరువును సందర్శించిన జిల్లా కలెక్టర్



**సంగారెడ్డి టౌన్, సెప్టెంబర్ 2 (జనం సాక్షి) :** మహబూబ్ సాగర్ చెరువును సుందరీ కరణ లక్ష్యం అని జగ్గారెడ్డి అన్నారు. మంగళవారం సంగారెడ్డి పట్టణంలోని మహబూబ్ సాగర్ సుందరీకరణ పై కలెక్టర్ ప్రావీణ్యత టి జిఐసి చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే జయప్రకాశ్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంగారెడ్డి పట్టణంలోని మహబూబ్ సాగర్ చెరువు అభివృద్ధిపై గతంలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేక నిధులు రూ. 500 కోట్లు ఇవ్వాలని అనేకసార్లు సీఎంను కలిశానన్నారు. హెచ్ఎండిఏ నిధులతో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసే విధంగా కార్యచరణ కొనసాగించాలని కోరామని అన్నారు. సంగారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికై కృషి చేస్తానని ఎమ్మెల్యేగా లేకపోయినా, నియోజకవర్గ అభివృద్ధి అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రితో కలిశానని మహబూబ్ సాగర్ చెరువు అభివృద్ధికి 500 కోట్లు నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని కోరానని దానికి సీఎం సానుకూలంగా స్పందించారని అన్నారు త్వరలోనే టెండర్లు వేసి మైబుసాగర్ చెరువును ఆలధాకరంగా సుందరి కరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని అన్నారు ప్రజలు వచ్చి మంచి వాతావరణంలో ఆలధాకరంగా గడిపేందుకు మహబూబ్ సగర్ చెరువు అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు రానున్న బతుకమ్మ, వినాయక చవిత వరకు పనుల పూర్తి అయ్యేవిధంగా కార్యచరణ రూపొందిస్తామని అన్నారు, ధోబి గాట్, మత్స్యకారుల కోసం ప్రత్యేకంగా గాట్లు ఏర్పాటు చేశామని అన్నారు శుద్ధికరమైన నీటిని చెరువులో వదిలే రూపకల్పన చేస్తామని అన్నారు ఈ కార్యక్రమంలో హెచ్ఎండిఏ అధికారులు, మున్సిపల్ అధికారులు, నీటి పరదా శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలి

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబర్ 2 (జనం సాక్షి) :** రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న 8వేల 250 కోట్ల రూపాయల పెండింగ్ స్కాలర్షిప్‌లను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో విద్యార్థులు మహా ప్రదర్శన నిర్వహించారు. ఎస్ ఎఫ్ ఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని వివేకానంద డిగ్రీ కళాశాల నుంచి తెలగాణ చౌరస్తా వరకు భారీ ర్యాలీ నిర్వహించి నిరసన చేపట్టారు. 2019 నుంచి 2025 వరకు స్కాలర్షిప్ బకాయిలు పెండింగ్ లోనే ఉన్నాయని అన్నారు. చాలామంది విద్యార్థులు స్కాలర్షిప్ల తోనే చదువుకుంటున్నారనీ వాపోయారు. స్కాలర్షిప్ రానందువల్ల విద్యార్థులు విద్యకు దూరమయ్యే పరిస్థితి రాష్ట్రంలో కనిపిస్తుందనీ, విద్యార్థి చదువు కోల్పోయి.. నష్టపోతున్నాడంటె అది విద్యార్థి తప్పు కాదని ప్రభుత్వం తప్పు అవుతుందని మండిపడ్డారు. ఈ మధ్యకాలంలో స్కాలర్షిప్ల పైన ఆధారపడి చదువుకుంటున్న బడుగు బలహీన వర్గాల విద్యార్థులు చదువుకు దూరం అయ్యే పరిస్థితి నెలకొందని, ఇంటర్ పూర్తయిన తర్వాత డిగ్రీ చదవాలంటే కళాశాలలో రియంబర్స్మెంట్ రాలేదని సర్టిఫికెట్లు ఇచ్చే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజులు కట్టలేకపోవడంతో చదువును ఆపేసి పొలాల బాట పటాల్సిన పరిస్థితి ప్రజా ప్రభుత్వం లో నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా విద్యార్థుల సమస్యలు పరిష్కరించలేదని అన్నరు. ప్రభుత్వం ఏర్పడి దాదాపు 18 నుంచి 20 నెలలు గడుస్తున్న.. ఇప్పటివరకు కూడా విద్య పైన ప్రత్యేక దృష్టి




పెట్టలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేయాలని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పెండింగ్ స్కాలర్షిప్ లను వెంటనే చెల్లించాలని, పూర్తిస్థాయిలో అధ్యాపకులను భర్తీ చేయాలి డిమాండ్ చేశారు. మద్యానికి మంత్రి ఉన్నాడు కానీ, విద్యకు మంత్రి లేని పరిస్థితి రాష్ట్రంలో కనిపిస్తుందని విద్యాశాఖ మంత్రిని నియమించాలని డిమాండ్ చేశారు. స్కాలర్షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని లేకపోతే ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శి భరత్ పాల్గొన్నారు.

# విద్యార్థులకు గుణాత్మక విద్యా బోధన అందించాలి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 2 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు గుణాత్మక విద్యా బోధన అందించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం వనపర్తి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. ఈ విద్యా సంవత్సరంలో జిల్లా నుండి పదవ తరగతిలో ఏ ఒక్క విద్యార్థి ఫెయిల్ కాకుండా ఉపాధ్యాయులు గుణాత్మక విద్యా బోధనలు అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. పదవ తరగతి విద్యార్థులలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించారు. పాఠశాలను తిరిగి పరిశీలించిన కలెక్టర్ పాఠశాలలో అదనపు గదుల నిర్మాణానికి రూ. 31 లక్షలు ఉన్నాయని వాటితో అదనపు గదులు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని ఎ. ఈ ను ఆదేశించారు. ప్రస్తుతానికి బాలభవన్ భవనాన్ని కూడా తాత్కాలికంగా తరగతి గదులుగా వాడుకోవాలని సూచించారు. ఖాన్ అకాడమీ కంప్యూటర్ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి సామాన్య శాస్త్రం, గణిత శాస్త్రం విద్యను బాగా నేర్చుకునేందుకు ఖాన్ అకాడమీ ద్వారా ఏర్పాటు చేసిన కంప్యూటర్ విద్యను విద్యార్థులకు అందించాలని కలెక్టర్ ప్రధానోపాధ్యాయిని ఆదేశించారు. బాలికల ఉన్నత పాఠశాలలో ఇప్పటికే కంప్యూటర్లు, అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసినందున అవసరమైన విద్యను విద్యార్థులకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. బాలభవన్ కేంద్రంలో నటరాజ విగ్రహానికి పూజలు చేసిన కలెక్టర్ బాల భవన్ భవనాన్ని ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్ అక్కడ నాట్య శిక్షణ పొందుతున్న విద్యార్థులను చూసి ఆనందం వ్యక్తం చేశారు. బాల భవన్ లో ఏ వయసు పిల్లలకు సాంస్కృతిక కార్యక్రమాలు నేర్పిస్తారు, ఏ ఏ సమయాల్లో నేర్పిస్తారు అనే వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన నటరాజ విగ్రహానికి దీపం వెలిగించి పూజలు చేశారు. అనంతరం విద్యార్థులతో ఫోటో దిగారు. జిల్లా విద్యా శాఖ అధికారి అబ్దుల్ ఘని, ఎ.యం.ఓ మహానంది, మండల విద్యా అధికారి మద్దిలేటి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యం. ఉమాదేవి, ఉపాధ్యాయులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

- పద్మశాలి జిల్లా నాయకులు కే. తిరుపతయ్య



**బిజినేపల్లి సెప్టెంబర్ 2 (జనం సాక్షి) :** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుపరచడం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమైందని పద్మశాలి జిల్లా నాయకులు కె తిరుపతయ్య అన్నారు మంగళవారం మండల కేంద్రంలో గల నేతాజీ యూత్ క్లబ్ హాలులో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ బీసీల కు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నదని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలన్నిటిని క్షేత్రస్థాయిలో ప్రజలలోకి తీసుకు వెళ్లే విధంగా ప్రతి ఒక్కరం ముందుకు సాగాలని ఆయన తెలిపారు మండల కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి చీలికలు గాని, ఎలాంటి వ్యతిరేకతలు గాని లేవని నాగర్కర్నూల్ శాసనసభ్యులు కూచికూల రాజేష్ రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి లా ఆదేశానుసారం ప్రతి ఒక్కరం కలిసికట్టుగా పనిచేసే రాబోయే ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను కచ్చితంగా గెలిపించుకుంటామని ఆయన అన్నారు. ఈ సమావేశంలో నాయకులు జీ తిరుపతయ్య, రామన్ గౌడ్, నరేందర్ గౌడ్, లవ, ఎర్ర రాములు, తదితరులున్నారు.

# కాంగ్రెస్ కుట్ర బట్టబయలైంది

**మెదక్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 2 (జనం సాక్షి) :** కేసీఆర్‌ను బద్నాం చేసేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం కాళేశ్వరం విషయంలో కుట్ర చేస్తోంది అని, ఘోష్ కమిటీ ట్రాష్ కమిటీ అని చెప్పిన మాటే నిజమైందని, న్యాయస్థానంలో న్యాయం గెలిచిందని బీఆర్ఎస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఘోష్ కమిటీ రిపోర్టును న్యాయస్థానమే తప్పుపట్టిందని, దీని ఆధారంగా కేసీఆర్ పైన, మాజీ మంత్రివర్యులు హరీశ్ రావుపైన ఎటువంటి చర్యలు తీసుకోరాదని, ఈ రిపోర్టు సరిగా లేదని న్యాయస్థానమే చెప్పిందని అన్నారు. భవిష్యత్తులో కూడా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా, సీబీఐకి నివేదించినా, ఎవరికి ఇచ్చినా కూడా, తెలంగాణ ప్రజలకోసం కాళేశ్వరం ప్రాజెక్టును ఒక యజ్ఞంలాగా కట్టిన కేసీఆర్ విజయంతో ముందుకు వస్తారని, కాంగ్రెస్ కుట్రలను ఛేధిస్తారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌తో చేతులు కలిపి, బనకచర్లకు నీటిని తరలించేందుకు కాళేశ్వరం మీద కుట్ర చేసి, మేడిగడ్డను సాకుగా చూపెట్టి, తెలంగాణను ఎడారి చేయడానికి కుట్ర చేస్తోందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అన్ని అనుమతులూ ఉన్నాయని, వాటిని కేసీఆర్, హరీశ్ రావు ఘోష్ కమిటీ ముందు హాజరై వాటిని చూపించి, తమ వాదనలు వినిపించారని గుర్తు చేశారు. ఘోష్ కమిటీ రిపోర్టు కాంగ్రెస్ పార్టీ ఆలోచనలకు అనుగుణంగా ఉందే తప్ప, అందులో న్యాయం లేదని, ఇదే విషయాన్ని హైకోర్టు కూడా చెప్పిందని వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్ని కుట్రలు చేసినా, వాటిని ఛేధించుకుని నిప్పులాగా వారిద్దరూ నిలబడతారని, తెలంగాణ ప్రజల్ని




కాపాడుకుంటారని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ కవిత సస్పెన్షన్‌పై మాట్లాడుతూ అంతర్గతంగా చర్చించాల్సిన విషయాలను, బహిరంగంగా లేఖ రూపంలో కేసీఆర్ కి అందజేసిన ఎమ్మెల్సీ కవిత , అప్పటి నుంచి ఇప్పటి వరకూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ ఉన్నారని, క్రమశిక్షణ తప్పారని అన్నారు. అందుకే కేసీఆర్ తన బిడ్డ అని కూడా చూడకుండా పార్టీ క్రమశిక్షణ తప్పిన ఆమెను సస్పెండ్ చేశారని, దీనిని అందరం స్వాగతిస్తున్నామని చెప్పారు. పార్టీ క్రమశిక్షణ తప్పితే చర్యలు తప్పవని కేసీఆర్ సందేశాన్ని పంపించారని అన్నారు. 25 సంవత్సరాలుగా పార్టీని ఏర్పాటు చేసి, పోరాటం చేసి, గత పదేళ్లుగా తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా ఉంచి, పార్టీ శ్రేణులందరినీ కడుపులో పెట్టుకుని కాపాడుకుంటున్న కేసీఆర్ లక్ష్యాలను సాధించేందుకు అందరం అండగా నిలుస్తాం అని, పార్టీ పరంగా తెలంగాణ ప్రజలను ఆదుకుంటామని స్పష్టం చేశారు.

# ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి బ్యూరో, సెప్టెంబర్ 2 (జనంసాక్షి) :** వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం తో పాటు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మంగళవారం ఉదయం వనపర్తి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఆసుపత్రిలో డ్రైనేజ్ పైప్ లైన్లు మార్చడము సిసి రోడ్లు వేయడం వంటి పనులు త్వరగా పూర్తిచేయాలని వైద్య విభాగం ఎ. ఈ ను ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రి మొత్తాన్ని కలియతిరిగిన కలెక్టర్ పరిసరాల పరిశుభ్రతతో



పాటు దివ్యాంగులకు సదరం క్యాంపు ఏర్పాటుకు అవసరమైన గదులను అన్వేషించారు. ఆసుపత్రి వెనక భాగంలో సదరం క్యాంపు ఏర్పాటుకు గదులు సిద్ధం చేయాలని అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రస్తుతం పనిచేస్తున్న డయాలసిస్ సెంటరును మాతా శిశు ఆరోగ్య కేంద్రం వద్ద నూతనంగా నిర్మించిన క్రిటికల్ కేర్ యూనిట్ కు మార్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కేటరాక్ట్ సర్జరీలు ఎన్ని నిర్వహించారు అని వివరాలు అడిగారు. కంటి వైద్య ప్రొఫెసర్ డా. శ్రీధర్ వివరిస్తూ ఫిబ్రవరి, 2025 నుండి ఇప్పటి వరకు 103 మేజర్ శాస్త్ర చికిత్సలు,113 మైనర్ సర్జరీలు నిర్వహించినట్లు తెలిపారు. స్పందించిన కలెక్టర్ జిల్లాలో కేటరాక్ట్ సమస్యతో బాధపడుచున్న వారందరికీ శస్త్రచికిత్సలు నిర్వహించాలని సూచించారు. అదేవిధంగా జిల్లాలో 19,700 మంది మధుమేహం వ్యాధితో బాధపడుచున్న వారిని గుర్తించడం జరిగిందని, మధుమేహం ఉన్న వారు కంటి సమస్యలు ఎదుర్కొంటారు కాబట్టి వారందరికీ ఇళ్ల వద్దనే రేటినోపతి వైద్య పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. డెంగ్యూ జ్వరాలను ఆదిలోనే గుర్తించి సరైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. జ్వరం లక్షణాలతో వచ్చే వారందరికీ రక్త పరీక్షలు నిర్వహించి డెంగ్యూ లేదా వైరల్ జ్వరాల ఎలాంటి జ్వరం ఉందో గుర్తించి అవసరమైన వైద్యం అందించాలని సూచించారు. ఈ నెలలో ఇప్పటి వరకు నిర్వహించిన రక్త పరీక్షల రిజిస్టరును కలెక్టర్ పరిశీలించారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా శ్రీనివాసులు, ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డా. రంగా రావు, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సాయినాథ్ రెడ్డి, ఇతర ప్రొఫెసర్లు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# రోడ్డుకిరువైపుల చెట్ల తొలగింపు

- జనంసాక్షి కథనానికి స్పందించిన అధికారులు



కడెం, సెప్టెంబర్ 2 (జనంసాక్షి) : కడెం మండలంలోని నచ్చన్ ఎల్లాపూర్ గ్రామం నుండి పెత్తార్పు గ్రామం మీదుగా పలు గ్రామాల రైతులు కొత్త మద్దిపడిగా గ్రామానికి రైతులు వరి పొలాలకు వెళ్లేటువంటి రోడ్డుకు ఇరువైపులా ఉన్నటువంటి చెట్లను, రోడ్డుపైకి పెరిగినటువంటి వాటి కొమ్మలను, పిచ్చి మొక్కల్ని అటవీ శాఖ అధికారులు స్పందించి వాటిని తొలగించాలి అని సోమవారం రోజున జనం సాక్షిలో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించి మంగళవారం రోజున జెసిబి సహాయంతో అటవీ శాఖ అధికారి ఎఫ్ ఆర్ ఓ గీతా రాణి ఆదేశాల మేరకు ఎఫ్ఎస్ఓ రవికుమార్ ఆధ్వర్యంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెట్లను, వాటి కొమ్మలను, పిచ్చి


రోడ్డుకు ఇరువైపులా చెట్లను తొలగించి దారులకు మరమ్మతులు వేయండి

మొక్కలను తొలగించి రైతులు పంట పొలాలకి వెళ్లడానికి దారిని క్లియర్ చేశారు. ఈ సందర్భంగా రైతులు పలువురు మాట్లాడుతూ... రైతులకు ఉన్న సమస్యల పట్ల వెంటనే స్పందించిన అటవీ శాఖ అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే సంబంధిత అధికారులు రైతుల పడుతున్న కష్టాన్ని చూసి వెంటనే రోడ్డుకి మరమ్మతులు చేసి రైతులకు సహకరించగలరని కోరారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ ఎస్ ఓ రవికుమార్, రైతులు ఫీలి రాజేందర్, ఉత్కం వెంకటేష్ గౌడ్, భీమన్న, బుచ్చన్న, రాజన్న రైతులు గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

# పంట నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందిస్తాం

- రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్



మంచిర్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 2 (జనంసాక్షి) : ఇటీవల ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షాల కారణంగా జిల్లాలో పంట నష్టపోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. మంగళవారం జిల్లాలోని చెన్నూర్ మండలం సుందర శాల గ్రామంలో కాళేశ్వరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ వలన నష్టపోయిన పంట పొలాలను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ... భారీ వర్షాలు, వరదల కారణంగా పంట నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ కారణంగా గత 5 సంవత్సరాల నుండి రైతులు పంట నష్టపోతున్నారని, గత సంవత్సరం కూడా పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించడం జరిగిందని తెలిపారు. చెన్నూరు ప్రాంతంలో ప్రాజెక్టు లేని సమయంలో కూడా రైతులు సాధారణం కంటే 70 శాతం అధికంగా పంట దిగుబడి సాధించారని, ఇలాంటి సందర్భంలో ఈ సంవత్సరం పంట నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం చేసే విధంగా నష్టపరిహారం అందిస్తామని తెలిపారు. సుమారు 200 ఎకరాల మేర పంట నష్టం జరిగినట్లు రైతులు రాష్ట్ర మంత్రి దృష్టికి తీసుకురాగా జిల్లా వ్యవసాయ శాఖ అధికారుల సమన్వయంతో స్పష్టమైన నివేదికలు రూపొందించి, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిహారం మంజూరు అయ్యే విధంగా కృషి చేస్తామని తెలిపారు. దుగ్నేపల్లి గ్రామపంచాయతీలోని పెద్దగూడెం, నారాయణపూర్ గ్రామాలలో పర్యటించి ప్రజలకు అందుతున్న ప్రభుత్వ పథకాలు, సౌకర్యాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజా ప్రభుత్వం ప్రజల కోసం సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేస్తూ అభివృద్ధి, సంక్షేమ పథకాలను మారుమూల గ్రామాల వరకు అమలు చేస్తుందని తెలిపారు. గ్రామంలో నీటి అవసరాలను తీర్చేందుకు బోర్ వెల్ లు, ఇతర సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకోవడంతో పాటు ప్రజల ఆరోగ్యం దృష్ట్యా పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టడం జరుగుతుందని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో అవసరమైన మందులు అందుబాటులో ఉంచి ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందించడం జరుగుతుందని, వ్యాధుల వ్యాప్తిని నియంత్రించేందుకు పాటించవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం కోటపల్లి మండలం అన్నారం గ్రామంలో పర్యటించి పరిస్థితిని సమీక్షించారు. భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా అధికార యంత్రాంగం ప్రజలకు అందుబాటులో ఉంటూ అత్యవసర సేవలు అందించడం జరుగుతుందని తెలిపారు. లోతట్టు, వరద ప్రభావితం ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాసం కల్పించడం జరిగిందని తెలిపారు. గ్రామ పంచాయతీల పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని, వర్షపు నీరు నిలువ ఉండకుండా అంతర్గత రహదారులు, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ తగు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలతో పాటు ప్రజా రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అంతకు ముందు చెన్నూర్ పట్టణంలోని శాసనసభ్యుల క్యాంపు కార్యాలయంలో కొలువుదీరిన గణనాథుడికి రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా, సంతోషంగా ఉండాలని కోరుతూ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# ముంపు ప్రాంతాలను సందర్శించిన ఎమ్మెల్యే

- రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటాం
- ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్

ఖానాపూర్ సెప్టెంబర్ 02 (జనం సాక్షి) : అకాల వర్షాలకు ముంపుకు గురైన ప్రాంతాలను ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్ మంగళవారం సందర్శించారు. నది పరివాహక ప్రాంతాలైన మండలంలోని బావపూర్ (కె), దిలావర్పూర్, గోడలపంపు, తదితర గ్రామాలను సందర్శించి రైతులను పరామర్శించారు. ప్రకృతి వైపరీత్యానికి గురై పంటలు నష్టపోయిన రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. సంబంధిత శాఖల సిబ్బంది, అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులు నష్టపోయిన పంటలకు సంబంధించి నివేదిక సిద్ధం చేసి ప్రభుత్వానికి సమర్పించాలని సూచించారు. రైతులు నష్టపోయిన పంటను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి నమోదు చేయించుకోవాలని అన్నారు. ఎమ్మెల్యే వెంట తహసిల్దార్ సుజాత, ఎంపీడీవో రత్నాకర్ రావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పడిగల భూషణ్ వైస్ చైర్మన్ అబ్దుల్ మాజీద్, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు దొనికేని దయానంద్, ఖానాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ లు అంకం రాజేందర్, రాజుర సత్యం, నాయకులు లక్ష్మీపతి గౌడ్, తదితరులు ఉన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణపు పనులను త్వరగా పూర్తి చేయాలి

- మెనూ ప్రకారం నాణ్యమైన పోషకాహారం అందించాలి
- ములుగు జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్
- చంద్రుపట్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, పేరూరు పిహెచ్‌సి ఆకస్మిక తనిఖీ
- జిల్లా కలెక్టర్ టీఎస్ పర్యటన



ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 02(జనంసాక్షి) : ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణపు పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. మంగళవారం వాజేడు మండలం టేకులగూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణపు పనులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లబ్ధిదారులతో ఇందిరమ్మ బిల్లులు పడుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో మొత్తం ఎన్ని ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయని, నిర్మాణంలో ఉన్న ఇండ్లను త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు. మంజూరు అయినంత వరకు ఇండ్ల పనులు జరుగుతున్నాయ, ఏఏ దశలో ఉన్నాయని, పనులు జరిగినంత వరకు ఫోటో కాప్చర్ పూర్తి చేశారా అని అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులు కూడా ఇండ్లు పనులు వేగంగా పూర్తి చేయాలని, ప్రతి సోమవారం లబ్ధిదారుల అకౌంట్ లలో డబ్బులు జమ అవుతున్నాయని తెలిపారు. ఇల్లు రానివారు అధైర్య పడద్దని అర్హులైన ప్రతి ఒక్కరికి దశల వారిగా ఇండ్లను మంజూరు చేయబడునని అన్నారు. అనంతరం చంద్రు పట్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడారు. వంట గదిని మధ్యాహ్న భోజనంను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి స్కూల్లో మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందించాలని మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచించారు. కట్టెల పొయ్యి మీద వంట చేయవద్దని గ్యాస్ పొయ్యి నీ వినియోగించాలని మధ్యాహ్నం భోజనం కార్మికులకు సూచించారు. ప్రభుత్వం మధ్యాహ్న భోజన కార్మికులకు వంట పాత్రలను తదితర సామాగ్రిని పంపిణీ చేసిన నేపథ్యంలో వాటిని సక్రమంగా వినియోగించుకొని పరిశుభ్రంగా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. అనంతరం పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించి కలెక్టర్ మాట్లాడుతూ ఈ వర్షాకాలంలో వచ్చే మలేరియా డెంగ్యూ వ్యాధుల నియంత్రణలో ఏ ఒక్క వైద్య ఉద్యోగి నిర్లక్ష్యం వహించకూడదని లేనియెడల వారిపై శాఖాపరమైన కఠిన చర్యలు ఉంటాయని ఆదేశించారు. జిల్లా స్థాయిలో తయారుచేసిన ప్రణాళికల షెడ్యూల్ ని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు అమలు చేయాలని, క్షేత్రస్థాయిలో సూపర్వైజర్స్ ప్రణాళికల ప్రకారం కార్యక్రమాల అమలు ఏ విధంగా జరుగుతుందని నిరంతరం పర్యవేక్షించాలని, ఆశా కార్యకర్తలు ప్రతిరోజు 20 ఇంటింటి సందర్శన కావించి జ్వరంతో బాధపడుతున్న వ్యక్తులను గుర్తించి వారికి మందు బిల్లలను ఇచ్చి, రెండు రోజులైనా కూడా జ్వరము తగ్గకుండాట్లయితే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాలని తెలిపారు. అత్యవసర మందులతో పాటు ఇతర ఔషధాలను నిల్వ ఉంచుకోవాలని తెలిపారు. ల్యాబ్ టెక్నీషియన్ మందుల గదిని ఇన్ పేషెంట్ వార్డులను రూములను సందర్శించి రిజిస్టర్ లను రికార్డులను తనిఖీ చేశారు. పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఒక్క వైద్యులనీతో వైద్య సేవలు అందించడంలో ఒత్తిడిని తగ్గించడానికి, ఒక మెడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ను ఏర్పాటు చేస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపిఓ శ్రీకాంత్, ఎంఈఓ వెంకటేశ్వర్లు, పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాహీల్, ఆర్ఐ కుమార స్వామి, పిఆర్ ఏఈ ప్రభాకర్, ఆరోగ్య విస్తరణ అధికారి వేణుగోపాల కృష్ణ , ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు, విద్యార్థులు, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు, ఆరోగ్య కార్యకర్తలు ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# యూరియా బస్తా.. దొరికితే దైవప్రసాదం

- బస్తాలకు రైతులు నానాతంటాలు
- రైతుకు పంట రాదని భయం
- రాకుంటే అప్పులు తీరవని భయం

కాటారం సెప్టెంబర్ 2 (జనం సాక్షి): కాటారం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో రైతులు వేసిన పంటకు పత్తి, వరి, ఇతర పంటలకు యూరియా అవసర ఉంటుంది. అవసరాన్ని తీర్చుకునేందుకు కుటుంబంలోని భార్య, భర్త, పిల్లలు కూడా క్యూలో లైన్లో నిలబడి రోజుల తరబడి ఉంటున్నారు. రైతుకు ఏదో ఆశ బస్తాలు దొరుకుతాయని నిలబడుతున్నాడు. కానీ వంద బస్తాలు వస్తే 200 మంది లైన్ లో ఉంటున్నారు. నిలబడి నిలబడి ఒత్తిడి తట్టుకొని చివరకు నిరాశతో ఇంటికి తిరిగి వస్తున్నాడు. రైతు ఆశలు నెరవేరక బాధతో కుమిలిపోతున్నాడు. తెలంగాణలో ఇలాంటి పరిస్థితి పది సంవత్సరాల నుండి రాలేదని రైతులు చెప్తున్నారు. ప్రభుత్వ ముందుచూపు తప్పిదమా, లేక వేరే విధంగా ఉందా ప్రభుత్వమే తేల్చాలి. ఏది ఏమైనా రైతుకు యూరియా దొరకకుంటే పంట పెట్టుబడి కాదని పైరు ఎదుగుదల ఆగుతుందని గ్రామీణ ప్రజలు రైతులు వేడుకుంటున్నారు.

# కెసిఆర్‌ను తట్టుకోలేకనే కాంగ్రెస్ కుట్రలు

- కాళేశ్వరంపై కుట్రలకు నిరసనగా బిఆర్ఎస్ ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో



చెన్నారావుపేట, సెప్టెంబర్ 2 (జనంసాక్షి) : కాళేశ్వరం పై కాంగ్రెస్ పార్టీ చేస్తున్న కుట్రలకు నిరసనగా బిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు నర్సంపేట మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి ఆదేశానుసారం చెన్నారావుపేట మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా, రాస్తారోకో కార్యక్రమాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బాల్నె వెంకన్న మాట్లాడుతూ ఓటుకు నోటు దొంగ రేవంత్ రెడ్డి చంద్రబాబు, బిజేపీ డైరెక్షన్లో కేసీఆర్ పై కుట్ర చేస్తున్నారన్నారు. కాళేశ్వరంపై ఎలాంటి అవినీతి జరగలేదని కేసీఆర్ పై విచారణ అంటేనే తెలంగాణ రైతాంగాన్ని అవమానించినట్లేనన్నారు. బడేభాయ్.. చోటే భాయ్ లు కలిసి కేసీఆర్ ను తట్టుకోలేక కుట్రలు పన్నుతున్నారని విమర్శించారు. తెలంగాణ కోసం చావు నోట్లో తలపెట్టి పోరాడిన కేసిఆర్ పై కుట్రలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం బిఆర్ఎస్ పార్టీ పై ఎన్ని కుట్రలు చేసిన ఎదురుకునేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జక్క అశోక్, సొసైటీ చైర్మన్ మురహరి రవి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు కొండవీటి ప్రదీప్ కుమార్, అనుముల కుమారస్వామి, అమ్మ రాజేష్, జిల్లా పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ రఫీ, మండల పరిషత్ మాజీ కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ అబ్దుల్ గఫార్, మాజీ సర్పంచులు కుండె మల్లయ్య, హంస విజయరామరాజు, బిఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షులు మంచోజు మనోజ్ కుమార్, భూక్య రవీందర్ నాయక్, కిషన్ నాయక్, సోషల్ మీడియా మండల ఇన్చార్జి బోడ మురళి నాయక్, కుసుమ నరేందర్, ములుక సాంబయ్య, సాదు నర్సింగరావు, బుర్ర సుదర్శన్ గౌడ్, గుర్రం రవి, జున్నుతుల మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# తాగు, సాగునీరు అందించినందుకు శిక్షిస్తారా?

- జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి



బచ్చన్నపేట సెప్టెంబర్ 2 (జనంసాక్షి) : తెలంగాణకు తాగునీరు సాగునీరు అందించినందుకు తెలంగాణ ఊపిరి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను శిక్షిస్తారా అని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు . ఆరోగ్య రిత్యా నియోజకవర్గానికి రాలేకపోయినా ఎమ్మెల్యే మంగళవారం జిల్లా కేంద్రంలో పార్టీ కార్యకర్తల ముఖ్య సమావేశానికి వెళ్తూ బచ్చన్నపేట మండల కేంద్రంలో స్వాగతం పలికిన పార్టీ నాయకులను. కార్యకర్తలను.ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ ఉద్యమానికి ఊపిరి పోసింది బచ్చన్నపేట అని, నియోజకవర్గానికి గుండెకాయనే బచ్చన్నపేట అని అన్నారు. కెసిఆర్ వచ్చినంకనే గుడి చెరువు నిండిందని ఇప్పుడు ఎండిందని, పదేళ్లలో యూరియా కోసం రైతులు రోడ్డు ఎక్కలేదని అన్నారు. గోదావరి జలాలన్నీ ఆంధ్రకు తరలించడం బాధాకరమని, కెసిఆర్ బచ్చన్నపేటకు వచ్చినప్పుడు రోడ్లపై ముసలోళ్ళు తప్ప, యువకులు కనబడలేదని దాంతో కెసిఆర్ కంట తడిపెట్టి స్వరాష్ట్రం సాధించు కుంటేనే బాదలు తిరుగుతాయి అని చెప్పారని గుర్తు చేశారు. తెలంగాణ కోసం ప్రాజెక్టులు పెట్టిన కెసిఆర్ ను శిక్షించాలన్న దుర్బుద్ధితో కాంగ్రెస్ ప్రయత్నం చేస్తుందన్నారు. కాళేశ్వరం వద్దని బనకచర్లకు గోదావరి జలాలు తరలించబోతున్న ఇక్కడ నేతలు పట్టించుకోవడం లేదని మన నీళ్లను చంద్రబాబు దోచుకే కెళ్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం లో ప్రజలకు రైతులకు కష్టాలు మొదలు అవుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చంద్రారెడ్డి, రైతుబంధు సమితి మాజీ జిల్లా అధ్యక్షులు రమణారెడ్డి, పిఎసిఎస్ చైర్మన్ పూర్ణచందర్, సర్పంచులు, ఎంపీటీసీల ఫోరమ్ మాజీ మండల అధ్యక్షుడు గంగం సతీష్ రెడ్డి, దూడల కనకయ్య, రైతుబంధు సమితి మాజీ మండల అధ్యక్షులు చల్లా శ్రీనివాస్ రెడ్డి, మండలంలోని ఆయా గ్రామాల మాజీ సర్పంచ్లు, మాజీ ఎంపీటీసీలు, పి ఎస్ ఎ డైరెక్టర్లు, గ్రామ శాఖ అధ్యక్షులు, కార్యదర్శులు, ముఖ్య నేతలు పాల్గొన్నారు..

# బురదమయంగా వేములపల్లి రోడ్లు


- నాట్లు వేసి నిరసన తెలిపిన గ్రామస్తులు



జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని వేములపల్లి రోడ్లు బురదమయంగా మారాయి. రోడ్ల దుస్థితి అధ్వానంగా మారడంతో గ్రామస్థులు బురద రోడ్డుపై నాట్లు వేసి నిరసన తెలిపారు. ఇటీవలె కురిసిన వర్షాలకు గ్రామంలోని రోడ్లన్నీ బురదమయమయ్యాయి. అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి దాపురించింది. ఆర్టీసీ బస్సులు కూడా రాకపోవడంతో ప్రయాణం కష్టతరమవడంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఈ బాధలు భరించలేక బురదమయమైన రోడ్లపై నాట్లు వేసి ప్రజలు నిరసన తెలిపారు. మండల కేంద్రానికి ఎనిమిది కిలోమీటర్ల దూరంలో ఉన్న వేములపల్లి గ్రామంపై అధికారులు, పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, గతంలో హన్మకొండ నుండి వేములపల్లి మీదుగా బంగ్లాపల్లి వరకు బస్సు వచ్చేదని, రోడ్లు సరిగా లేక బస్సు నిలిపివేయడంతో గ్రామ ప్రజలకు రవాణా కష్టాలు మొదలయ్యాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వేములపల్లి గ్రామ ప్రజల సౌకర్యార్థం రోడ్లను మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# కెసిఆర్‌పై ఈగ వాలనివ్వం

- కెసిఆర్ పై ప్రభుత్వ కుట్రలు మానుకోవాలి
- కాళేశ్వరం నీళ్లు ఆంధ్రకు తరలించేందుకు కుట్ర
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు



పాలకుర్తి/ దేవరుప్పుల, సెప్టెంబర్ 2 (జనంసాక్షి): పులి నోట్లో తలకాయ పెట్టి. ప్రాణాన్ని సైతం లెక్కచేయకుండా ఆమరణ దీక్ష చేపట్టి. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కుట్ర పన్నుతు న్నాడని. ఆయనపై ఈగ వాలిన తెలంగాణ సమాజం సహించదని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు హెచ్చరించారు.తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ పై సిబిఐ అక్రమ కేసును ఖండిస్తూ, మంగళవారం దేవరుప్పుల మండల కేంద్రంలో జనగామ సూర్యపేట ప్రధాన రహదారిపై బైఠాయించారు. సుమారు రెండు గంటల పాటు రహదారిని స్తంభింపజేయడంతో వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యక్తిగత కక్షలతో కాళేశ్వరం కమిషన్ విచారణ పేరుతో మాజీ సీఎం కేసీఆర్ మాజీమంత్రి హరీష్ రావు లపై బనయించేందుకు కుట్రలు చేస్తున్నాడని మండిపడ్డారు. గోష్ కమిషన్ నివేదిక రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించినప్పటికీ. విచారణ పేరుతో సిబిఐకి అప్పగించడం సిగ్గుచేటు అన్నారు. మేడిగడ్డకు 200 కోట్లతో మరమ్మతులు చేయాల్సి ఉండగా అవేవీ పట్టింపు లేకుండా కాళేశ్వరం నీరును ఆంధ్రకు తరలించేందుకు రేవంత్ రెడ్డి కుట్ర పన్నుతున్నాడని ఆరోపించారు. సిబిఐ కి అప్పగించడం వల్ల కాళేశ్వరం ఎండబెట్టడానికి రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకున్నాడని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ సిబిఐ బిజెపి చేతుల్లో కీలుబొమ్మగా మారిందని ఎద్దేవా చేశాడని, కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి కాళేశ్వరం కేసును సిబిఐ కి ఎందుకు రెఫర్ చేశావని ప్రశ్నించారు, కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారానే దేవాదుల. మిషన్ భగీరథ ద్వారా గ్రామాల్లో మంచినీరు అందుతుంది అంటే అది కాళేశ్వరం ద్వారానే అని గుర్తించాలని హితవు పలికారు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రణాళిక లేకపోవడంతోనే యూరియా కొరత ఏర్పడిందని దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని విమర్శించారు, కెసిఆర్ హయాంలో రైతులకు యూరియా బస్తాలు ఇస్తే, రేవంత్ రెడ్డి హయాంలో నోట్లో మూటలు రేవంత్ రెడ్డికి మోస్తున్నాడని ఎద్దేవా చేశారు, రైతుల సంక్షేమంపై సీఎం రేవంత్ రెడ్డికి లేదని విమర్శించారు. ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి 420 అమలు కానీ హామీలు ఇచ్చి రాష్ట్ర ప్రజలను మోసం చేశారని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్కు సరైన గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ జిల్లా నాయకులు పళ్ళ సుందర్ రాంరెడ్డి, మండల అధ్యక్షుడు తీగల దయాకర్, బసవ మల్లేశం, కొల్లూరి సోమయ్య, చింత రవి, మేకల సంపత్ కుమార్, ఏల సుందర్, జిల్లా మండల బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు యూత్ సోషల్ మీడియా నాయకులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
03 సెప్టెంబర్ 2025

# గిరిజన బాలికల గురుకులంలో మరుగుదొడ్లు అస్తవ్యస్తం

- మరమ్మతులకు నోచుకోని వైనం
- 72 మరుగుదొడ్లలో 4 మాత్రమే వినియోగం
- బాలికలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోని అధికారులు
- టీసీలు తీసుకొని ఇంటిబాట పడుతున్న విద్యార్థులు
- పాఠశాలను సందర్శించిన స్పెషల్ ఆఫీసర్



**తుంగతుర్తి, సెప్టెంబర్ 2 (జనం సాక్షి) :** అన్నీ ఉన్న అల్లుని నోట్లో శని ఉందన్న చందంగా ఉంది మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల పాఠశాల పరిస్థితి పాఠశాలలో అన్ని వసతులు ఉన్న మరుగుదొడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. పాఠశాల కళాశాలలో 600కు పైగా విద్యార్థినిలు విద్యను అభ్యసిస్తున్నారు దీంతో వారికోసం 72 మరుగుదొడ్లను నిర్మించి వినియోగంలోకి తెచ్చారు కానీ ఇటీవల ఏమైంది ఏమో కానీ అట్టి మరుగు దొడ్లు మరమ్మతులకు నోచుకోక ఈ విద్యా సంవత్సరం నుండి పనిచేయడం లేదు కేవలం 4 మరుగుదొడ్లు మాత్రమే పనిచేస్తుండడంతో ఉదయం పూట విద్యార్థులు అవస్థలు వర్ణనాతీతం పాఠశాల ప్రారంభం నుండే మరుగుదొడ్లను మరమ్మతులు చేయవలసిన అధికారులు నిర్లక్ష్యం వహిస్తుండడంతో పరిస్థితి దారుణంగా మారింది. మరోవైపు ఇటీవల కురిసిన వర్షాలకు మరుగుదొడ్లలో నీరు నిండిపోయింది బయటికి నీరు వచ్చే పరిస్థితి లేదు. మరుగుదొడ్లు నిండిపోయి కంపు కొడుతున్నాయి. మరుగు దొడ్లపై నిర్మించిన వాటర్ ట్యాంకులు సైతం పనిచేయడం లేదు. దీంతో డ్రైనేజీ మరుగుదొడ్ల వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో విద్యార్థులు ఇక్కడ చదువ లేమని అంటూ టీసీలు తీసుకొని ఇంటి బాట పడుతున్నారు. విద్యా సంవత్సరంలో ఇప్పటివరకు 70 మంది విద్యార్థులపైగా ఇంటి బాట పట్టినట్లు సమాచారం. ఇదిలా ఉండగా పాఠశాల కళాశాల విద్యార్థులకు బోధించేందుకు టీచర్ల కొరత ఉంది. పాఠశాల కళాశాల వచ్చే ఉపాధ్యాయులు సైతం పాఠశాల ప్రేయర్ కు రావడంలేదని విమర్శలు పెద్ద ఎత్తున వస్తున్నాయి గత రెండు నెలల క్రితం స్థానిక ఎమ్మెల్యే మందుల సామేలు పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన సమయంలో ఉపాధ్యాయులు ప్రార్థన సమయానికి హాజరు కాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసి సొసైటీ అధికారులకు ఫిర్యాదు చేశారు ఇంత జరుగుతున్న ఉపాధ్యాయులలో మార్పు రావడం లేదు ఇప్పటికైనా అధికారులు స్పందించి పాఠశాలలోమరుగుదొడ్లకు మరమ్మతులు చేసి వినియోగంలోకి వచ్చేలా కృషి చేయాలని బాలికల తల్లిదండ్రులు కోరుతున్నారు.



### పాఠశాల/కళాశాలను సందర్శించిన స్పెషల్ ఆఫీసర్

పాఠశాలలో మరుగుదొడ్లు డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్న విషయాన్ని తెలుసుకున్న స్పెషల్ ఆఫీసర్ స్థానిక తహసిల్దార్ దయానందం పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. సందర్భంగా పాఠశాలలో మరుగుదొడ్ల వ్యవస్థను చూసి ఆశ్చర్య వ్యక్తం చేశారు 72 మరుగుదొడ్లలో కేవలం నాలుగు మాత్రమే పనిచేయడం ఏంటని ఆయన ప్రిన్సిపాల్‌ను ప్రశ్నించారు. ఈ సందర్భంగా తరచుగా పాఠశాల ప్రేయర్ కు హాజరు కాని ఉపాధ్యాయులను పిలిపించి కారణాలు అడిగి ఇప్పటినుండి సక్రమంగా పాఠశాల సమయానికి హాజరుకావాలని హెచ్చరించారు. పాఠశాలలో నెలకొన్న సమస్యలన్నీ ఉన్నతాధికారులకు నివేదిక రూపంలో అందజేయనున్నట్లు తెలిపారు ఈయన వెంట పాఠశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

# పేదరికం తరిమికొట్టే ఏకైక ఆయుధం విద్య



**కోదాడ, సెప్టెంబర్ 2 (జనం సాక్షి) :** కుటుంబ పేదరికం తరిమికొట్టే ఏకైక ఆయుధం విద్య అని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవర్ అన్నారు. మంగళవారం కోదాడ మండలం కొమరబండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు పదవ తరగతి వార్షిక పరీక్షలకు పట్టుదలతో చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని ఆకాక్షించారు. పదవ తరగతి లో జరుగుతున్న ఫిజిక్స్ సబ్జెక్టు నోట్ బుక్ లను పరిశీలించారు. పదవ తరగతి పరీక్షలకు రైటింగ్ బాగా ప్రాక్టీస్ చేస్తేనే మంచి మార్కులు వస్తాయని సూచించారు. మీరు భవిష్యత్ లో ఏమి అవ్వాలని ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకొని చదువు కుంటే కలిగే ప్రయోజనాలను విద్యార్థులకి తెలియజేసి ప్రోత్సాహించారు.అనంతరం కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మండల స్థాయి క్రీడా పోటీలను సందర్శించి చదువుతో పాటు ఆటలపై శ్రద్ధ పెట్టాలని విద్యార్థులను ప్రోత్సాహించారు. పట్టణం లో వంద పడకల హాస్పిటల్ నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు వేగవంతంగా జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కాంట్రాక్టర్‌ని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ సూర్యనారాయణ, తహసీల్దార్ వాజీద్ అలీ,మున్సిపల్ కమిషనర్ రమాదేవి,ఎం ఈ ఒ సలీం షరీఫ్,హాస్పిటల్ సూపరిటీడెంట్ ప్రవీణ్, ప్రధాన ఉపాధ్యాయులు గోవింద్, మార్కండేయ, ఉపాధ్యాయులు శేషగిరిరావు, అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు సీఎం రేవంత్ రెడ్డి చంద్రుగొండ పర్యటన

- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**చంద్రుగొండ, సెప్టెంబర్ 2 (జనం సాక్షి) :** ఇందిరమ్మ లబ్ధిదారుల ఆనందంలో పాలు పంచుకోవడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు మధ్యాహ్నం రెండు గంటలకు చంద్రుగొండ మండలానికి రానున్నారని రాష్ట్ర రెవెన్యూ గృహ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. మంగళవారం చంద్రుగొండ మండలంలోని బెండలపాడు లో సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించనున్న ఇందిరమ్మ ఇళ్ళను, హెలిపాడ్ ను, సభాస్థలని పరిశీలించి అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వాల హాయంలోనే పేదలకు ఇందిరమ్మ ఇల్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్కే దక్కుతుందని దానిలో భాగంగానే రాష్ట్రంలో 10 సంవత్సరాల పాటు బిఆర్ఎస్ ప్రభుత్వం పాలించిన పేదల గురించి పట్టించుకోకుండా హౌసింగ్ డిపార్ట్మెంట్నే లేకుండా చేసిన ఘన చరిత్ర కలిగిన తరువాత ప్రజలు కాంగ్రెస్ పార్టీని నమ్మి గెలిపించడంతో తిరిగి ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని రాష్ట్రంలో సుమారు నాలుగున్నర లక్షల అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి వాటిలో ఇప్పటివరకు రెండు లక్షల 90 వేల ఇల్లు రాష్ట్రవ్యాప్తంగా వడివడిగా నిర్మాణాలు కొనసాగిస్తూ పారదర్శకంగా విడతల వారిగా బిల్లులు అందిస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, హౌసింగ్ ఎండి గౌతమ్, స్థానిక శాసనసభ్యులు జారే ఆదినారాయణ తోపాటు ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఐ డి సి చైర్మన్ మువ్వ విజయబాబు, తుంబురు దయాకర్ రెడ్డి,తుళ్లూరు బ్రహ్మయ్య, నాగ సీతారాములు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జనాన్ని సజావుగా నిర్వహించాలి

- కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్

**సూర్యాపేట ప్రతినిధి, సెప్టెంబర్ 2 (జనంసాక్షి) :** ఎలాంటి ఇబ్బందులకు ఆస్కారం ఇవ్వకుండా వినాయక నిమజ్జనాన్ని సజావుగా నిర్వహించేలా అన్ని శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.వినాయక నిమజ్జనం పై మంగళవారం జిల్లా,డివిజన్ అధికారులతో వెబ్ ఎక్స్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. నిమజ్జనం జరిగే సూర్యాపేట, కోదాడ, హుజూర్ నగర్ ప్రాంతాలలో ఆర్డీవోల కార్యాచరణ ప్రణాళికలను ఆయన అడిగి తెలుసుకున్నారు.అన్నిచోట్ల నిమజ్జనానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఎవరూ నీళ్లలో పడిపోకుండా బారికేడ్లు ఏర్పాటు చేయాలని,గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలన్నారు. అవసరమైనంత వెలుతురు ఉండేలా లైటింగ్ ఏర్పాటు చేయాలని, హెల్త్ క్యాంపులు, హెల్ప్ డెస్కులు, పబ్లిక్ అడ్రస్ సిస్టం ,కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.అంబులెన్స్, ఫైర్ ఇంజన్లు ఏర్పాటు చేయాలన్నారు.సూర్యాపేటలోని సద్దుల చెరువు, రత్నాపురం, కోదాడలో పెద్ద చెరువు, హుజూర్ నగర్ లో మఠంపల్లి, చింతలపాలెం ఘాటు, నేరేడుచర్ల, పాలకీడు ,ఘాట్ల వద్ద నిమజ్జనం జరిగే అవకాశం ఉందని తెలిపారు.ఈ నెల 4, 5, 6వ తేదీలలో నిమజ్జనానికి వినాయక విగ్రహాలు వస్తాయని ఆర్డీవోలు జిల్లా కలెక్టర్ కు వివరించగా, స్పష్టమైన తేదీలను




సంబంధిత ఆర్గనైజేషన్ల ద్వారా సేకరించి దానికి తగ్గట్టుగా ఏర్పాటు చేయాలన్నారు. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అపశృతి చోటు చేసుకోకుండా ఆయా శాఖలు వారికి సంబంధించిన విధులు జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. ముఖ్యంగా పోలీస్ బందోబస్తు, మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీరాజ్, ఫిషరీస్, విద్యుత్ తదితర శాఖలు ముందే క్షేత్రస్థాయిలో పర్యటించి రూట్ మ్యాప్ లు రూపొందించి దాని ప్రకారం చర్య తీసుకోవాలన్నారు. నిమజ్జనం జరిగే అన్ని చోట్ల హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేయడమే కాకుండా, కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, అన్ని శాఖలు వారికి సంబంధించి ఒక ప్రతినిధిని కంట్రోల్ రూమ్ లో ఏర్పాటు చేసి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసే కంట్రోల్ రూమ్ కి అనుసంధానం చేయాలన్నారు. బారికేడింగ్ ,లైటింగ్ విషయంలో రాజీ పడవద్దని, రూట్ మ్యాప్ తయారుచేసి తనకు సమర్పించాలని ఆదేశించారు. నిమజ్జనం చేసే రోజు ట్రాఫిక్ దారి మళ్లింపు పై ప్రజలకు ముందే అవగాహన కల్పించేందుకు ప్రెస్ నోట్ జారీ చేయాలని, అలాగే నిమజ్జనం రోజున బెల్ట్ షాపులు మూసివేయాలని, మద్యం అమ్మకాలు నిలిపోవేయాలని ఎక్సైజ్ శాఖ అధికారులను ఆదేశించారు.జిల్లా ఎస్పీ కె.నరసింహ మాట్లాడుతూ అన్ని శాఖల సమన్వయంతో పోలీసు అధికారులు బందోబస్తుతో పాటు, నిమజ్జనం సాఫీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. రహదారులపై పెద్ద గుంతలను పూడ్చివేయాలని, వినాయకులు వచ్చే దారి నిమజ్జనం అయిపోయిన తర్వాత తిరిగి వెళ్లే దారులు స్పష్టంగా ఉండేలా చూడాలన్నారు. గజ ఈతగాళ్లు ఉదయం విధులలోకి రిపోర్ట్ చేసినప్పటి నుండి నిమజ్జనం పూర్తయ్యే వరకు అక్కడే ఉండాలన్నారు. వినాయక విగ్రహాలను తరలించే వాహనాల డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. నిమజ్జనం చేసే రోజు డ్రైడే నోటిఫికేషన్ ఇస్తామని తెలిపారు.సూర్యాపేట, కోదాడ, హుజూర్ నగర్ ఆర్డీఓలు, వైద్య ఆరోగ్య, మత్స్య, విద్యుత్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు స్థానిక అధికారుల సహకరించండి



**కూసుమంచి, సెప్టెంబర్ 2 (జనం సాక్షి) :** మండలంలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర హౌజింగ్ ఎండి వి.పి. గౌతమ్ అన్నారు. మంగళవారం కూసుమంచి మండలం నాయకన్ గూడెం, గ్రామం హౌజింగ్ ఎండి పర్యటించి, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించి, లబ్దిదారులతో ఇంటరాక్ట్ అయ్యారు. ఈ సందర్భంగా హౌజింగ్ ఎండి కూసుమంచి మండలం నాయకన్ గూడెం లో నిర్మాణంలో ఉన్న కె. ఉమ, సిహెచ్. సునీత, వెంకటమ్మ, ఆండాలమ్మ, లలిత, వెంకటరమణమ్మ ల ఇందిరమ్మ ఇండ్లను, పరిశీలించారు. లబ్దిదారులతో నిర్మాణాల్లో ఇబ్బందులు కల్గుతున్నాయా, ఇసుక సరఫరా, ఇటుకల కొనుగోలు, నిర్మాణం ఖర్చు, బిల్లులు జమ అవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముందు ఎలాంటి ఇంట్లో ఉంటున్నది, మంజూరు మొదలు ఏ దశలోను అధికారులు ఎవరైనా లంచాలు అడుగుతున్నారా అని లబ్ధిదారులను ప్రశ్నించారు. ఇంతవరకు ఎన్ని విడతల డబ్బు ఖాతాల్లో జమ అయింది అడిగి తెలుసుకున్నారు. ఎవ్వరికీ ఒక్క పైసా ఇవ్వాల్సిన అవసరం లేదని, మీ ఖాతాలో జమ మొత్తం ఇంటి నిర్మాణానికి వాడాలన్నారు. ఎంత ఎస్ఎఫ్టి లో ఇల్లు కడుతున్నది, ఇప్పటికి అయిన ఖర్చు, ఇంకనూ అయే ఖర్చు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇసుక ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేస్తుందని, రవాణా ఖర్చులు మాత్రమే లబ్ధిదారులు భరించాలని అన్నారు. లబ్ధిదారులు ఇందిరమ్మ ఇండ్లతో సంతోషం వ్యక్తపరుస్తూ అధికారులు తమ వంతు సహకారం అందిస్తున్నారని అన్నారు. అధికారులు తక్కువ ఖర్చులో నిర్మాణం పూర్తయ్యేలా లబ్ధిదారులకు సహకరించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులకు ఇందిరమ్మ ఇండ్ల విషయమై సంపూర్ణ అవగాహనకు శిక్షణ ఇవ్వాలన్నారు. ఒకరి కంటే ఎక్కువ మందిని గ్రూప్ గా ఏర్పాటు చేసి, ఇటుక, సిమెంట్, ఐరన్, తదితర నిర్మాణ సామాగ్రి బల్క్ గా తక్కువ రేట్ లో ఇప్పించేలా చర్యలు చేపట్టాలన్నారు. నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లు వేగంగా పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. హౌజింగ్ ఎండి పర్యటన సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, కూసుమంచి మండల తాసిల్దార్ రవికుమార్, రాంప్రసాద్, ఎంపిడివో రామచందర్ రావు , నేలకొండపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కంచర్ల సుధీర్ రెడ్డి, మండల అధికారులు, స్థానిక నాయకులు నాయకన్ గూడెం మాజీ మండల పరిషత్ సభ్యులు కొమురవెల్లి ఆలింగా గోవిందరెడ్డి, మారోజు భీష్మాచారి , ముదిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, దేశబోయిన నాగేశ్వరరావు, ఎస్.కె మల్సూర్ తదితరులు ఉన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా చర్యలు



**ఖమ్మం రూరల్, సెప్టెంబర్ 2 (జనం సాక్షి) :** జిల్లాలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర హౌజింగ్ ఎండి వి.పి. గౌతమ్ అన్నారు. మంగళవారం కూసుమంచి మండలం నాయకన్ గూడెం, ఖమ్మం రూరల్ మండలం ఆరేంపుల గ్రామాల్లో హౌజింగ్ ఎండి పర్యటించి, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించి, లబ్దిదారులతో ఇంటరాక్ట్ అయ్యారు. ఈ సందర్భంగా హౌజింగ్ ఎండి కూసుమంచి మండలం నాయకన్ గూడెం లో నిర్మాణంలో ఉన్న కె. ఉమ, సిహెచ్. సునీత, వెంకటమ్మ, ఆండాలమ్మ, లలిత, వెంకటరమణమ్మల ఇందిరమ్మ ఇండ్లను, ఖమ్మం రూరల్ మండలం ఆరేంపుల గ్రామంలో నిర్మాణాలు పూర్తయిన విజయకుమారి, నరేష్, మమత, రాజ్యం ల ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించారు. లబ్దిదారులతో నిర్మాణాల్లో ఇబ్బందులు కల్గుతున్నాయా, ఇసుక సరఫరా, ఇటుకల కొనుగోలు, నిర్మాణం ఖర్చు, బిల్లులు జమ అవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ముందు ఎలాంటి ఇంట్లో ఉంటున్నది, మంజూరు మొదలు ఏ దశలోను అధికారులు ఎవరైనా లంచాలు అడుగుతున్నారా అని లబ్ధిదారులను ప్రశ్నించారు. ఇంతవరకు ఎన్ని విడతల డబ్బు ఖాతాల్లో జమ అయింది అడిగి తెలుసుకున్నారు. ఎవ్వరికీ ఒక్క పైసా ఇవ్వాల్సిన అవసరం లేదని, మీ ఖాతాలో జమ మొత్తం ఇంటి నిర్మాణానికి వాడాలన్నారు.హౌజింగ్ ఎండి పర్యటన సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, తహశీల్దార్లు రవికుమార్, రాంప్రసాద్, ఎంపిడివోలు రామచందర్, శ్రీదేవి, అధికారులు, తదితరులు ఉన్నారు.

# సాగునీరు పర్యవేక్షణకై నీటిపారుదల సర్కిల్ కార్యాలయ ఏర్పాటు

- రాష్ట్ర మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**కోదాడ, సెప్టెంబర్ 2 (జనం సాక్షి) :** నీటిపారుదల శాఖ అధికారులకు మౌళిక సదుపాయాలు కల్పించి రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తున్నానని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.మంగళవారం కోదాడ పట్టణంలో 54. 03 కోట్ల రూపాయలతో రాజీవ్ నగర్, రాజీవ్ శాంతినగర్ లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు,5.10 కోట్ల రూపాయలతో నిర్మించే నీటిపారుదల శాఖ సర్కిల్ ఆఫీస్ డివిజన్ 4 సమీకృత కార్యాలయం నూతన భవన నిర్మాణ పనులకు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తో కలిసి శంకుస్థాపన చేశారు.కోదాడ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం లో ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ కోదాడ నియోజకవర్గంలో 2.29 లక్షల ఎకరాలకు సాగునీరును పర్యవేక్షించే అధికారుల కు కార్యాలయం నాలుగు అంతస్తులతో పన్నెండు వేల చదరపు అడుగుల్లో నిర్మించడం జరుగుతుందని, వచ్చే జూన్ నాటికి. నిర్మాణం పూర్తి చేయాలని కాంట్రాక్టర్, మరియు అధికారులను ఆదేశించారు గతంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు



శాంతినగర్‌లో ఉత్తమ్ పద్మావతి లిఫ్ట్ ఇరిగేషన్ నిర్మించడం జరిగిందని, కానీ గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడంతో పంప్ హౌస్, పైపులు, భవనం శిథిలావస్థకు చేరాయని, అదే విధంగా గత ఆగస్టు 31, సెప్టెంబర్ 2 న పాలేరు వాగు నుండి వచ్చిన భారీ వరదలకు పూర్తిగా మునిగిపోయి సామాగ్రి పనిచేయకుండా పోయిందని, అందువల్ల భవిష్యత్తులో భారీ వరదలు వచ్చిన తట్టుకునేలా రాజీవ్ శాంతినగర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ను 54. 03 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్నామని, దీని ద్వారా అనంతగిరి మండలంలో గొండ్రియాల గ్రామంలో 609 ఎకరాలు, కొత్తగూడెంలో 190 ఎకరాలు, బొజ్జగూడంతండాలో 496 ఎకరాలు,శాంతినగర్ లో 585 ఎకరాలు, లకారంలో 231 ఎకరాలు, తిరువన్నారంలో 803 ఎకరాలు మొగలాయి కోటలో 306 ఎకరాలు మొత్తం అనంతగిరి మండలంలో 3219 ఎకరాలు అలాగే కోదాడ మండలంలోని (1781 ఎకరాలు) చిమ్మిర్యాల గ్రామంలో 750 ఎకరాలు,తమ్మరబండపాలెం 550 ఎకరాలు, నల్లబండగూడెం లో 481 ఎకరాలు , మొత్తం దీని ద్వారా 2138 రైతు కుటుంబాలకి చెందిన 5000 ఎకరాలకు సాగు నీరు అందించటం జరుగుతుందని తెలిపారు.కోదాడ అసెంబ్లీ పరిధిలో మోతే మండలంలో సాగునీరు అందించేందుకు త్వరలో లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు నిర్మించి 45000 ఎకరాలకు సాగునీరు అందిస్తామని దానికి ఏర్పాట్లు చేయాలని ఇరిగేషన్ అధికారి సి.ఈ రమేష్ బాబుని ఆదేశించారు. తాను మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రోజు నుండి ఖరీఫ్, రబీ సీజన్ అయినా నేటి వరకు నాగార్జున సాగర్ ప్రాజెక్టు నిండుకుండలా కళకళలాడటం చాలా సంతోషంగా ఉందని ఈ సందర్భంగా మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ కే నరసింహ,జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ రామారావు, ఇరిగేషన్ సి ఈ రమేష్ బాబు, ఆర్డీవో సూర్యనారాయణ, తహసిల్దార్ వాజిద్ అలీ, మున్సిపల్ కమిషనర్ రమాదేవి, అధికారులు, సిబ్బంది, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# గణేశ్ విగ్రహాల నిమజ్జనం ఘాట్‌ను పరిశీలన




**ఖమ్మం, సెప్టెంబర్ 2 (జనం సాక్షి) :** గణేశ్ విగ్రహాల నిమజ్జనం పురస్కారించుకొని ఖమ్మం నగరంలోని కాల్వవోడ్డు మున్నేరు వద్ద జరిగే నిమజ్జనం ప్రాంతాన్ని నగరపాలక కమిషనర్ అభిషేక్ అగస్త్య, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజా, నగర మేయర్ నీరజ, సంభాద్రి ఉత్సవ కమిటీ వారితో కలసి పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పరిశీలించారు.శోభాయాత్ర, నిమజ్జన సమయాలలో ఎలాంటి ఇబ్బంది లేకుండా రహదారిపై అడ్డుగా వైర్లు, చెట్టు కొమ్మలు లేకుండా చొరవ తీసుకోవాలని సూచించారు. మున్నేరు వరద ఉధృతి దృష్టిలో పెట్టుకొని నిమజ్జనం అనంతరం తిరుగు ప్రయాణంలో ప్రత్యామ్నయ మార్గాలలో వెళ్లేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా క్రేన్లు, ఫ్లడ్ లైట్లు, మార్గాలు, బారికేడింగ్ తదితర అంశాలపై చర్చించారు. ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు వుండాలని, సీసీ కెమెరాలను కంట్రోల్‌రూమ్‌కు అనుసంధానం అయ్యేలా చూసుకొవాలని సూచించారు. మున్సిపల్, విద్యుత్, రెవెన్యూ, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, పోలీసులతో పాటు అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ ఎక్కడా ఇబ్బంది లేకుండా ప్రశాంతంగా శోభాయాత్ర, నిమజ్జనం జరిగే విధంగా ప్రతి ఒక్కరూ సమన్వయంతో సహకరించుకోవాని సూచించారు.కార్యక్రమంలో ఏసీపీ రమణమూర్తి,3 టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మోహన్ బాబు, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సత్యనారాయణ, మున్సిపల్ ఈ ఈ కృష్ణలాల్, అనిల్, డి ఇ ఇశ్రీనివాస్ రావు, సంభాద్రి ఉత్సవ కమిటీ విద్యాసాగర్, వినోద్ లహౌటి,కన్నం ప్రసన్న కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ జోనల్ కార్యాలయంలో..
# ఘనంగా ఎల్ఐసి వ్యవస్థాపక దినోత్సవం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ఎల్ఐసి ఆఫ్ ఇండియా 69వ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్లో సైఫాబాద్లోని జోనల్ ఆఫీస్ భవనంలో ఎల్ఐసి ఆఫ్ ఇండియా సౌత్ సెంట్రల్ జోన్ జోనల్ మేనేజర్ పునీత్ కుమార్ ఎల్ఐసి జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా పునీత్ కుమార్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం నుండి రూ. 5 కోట్ల ప్రారంభ మూలధనంతో 1956లో కంపెనీ ఉనికిలోకి వచ్చి, ప్రస్తుతం రూ. 56,22,923 కోట్ల ఆస్తి స్థాయికి ఎదిగిందని అన్నారు. కస్టమర్ సేవల మెరుగుదల కోసం ఎల్ఐసి ఇటీవలి కాలంలో అనేక వినూత్న చర్యలు చేపట్టిందని, బ్రాండ్ ఫైనాన్స్ ఇన్సూరెన్స్ 2024 ప్రకారం ఎల్ఐసి ఆఫ్ ఇండియా ప్రపంచంలోనే నంబర్ వన్ ఇన్సూరెన్స్ బ్రాండ్గా ఎదిగిందని తెలియజేశారు. ఈరోజు ఎల్ఐసి ఎండోమెంట్, టర్మ్ అస్యూరెన్స్, చిల్డ్రన్, పెన్షన్, మైక్రో ఇన్సూరెన్స్, యూనిట్ లింక్డ్ ఉత్పత్తులు మొదలైన 35 ప్లాన్లను వ్యక్తిగత వ్యాపారం కింద అమ్మకానికి అందిస్తుందని శ్రీ పునీత్ కుమార్ అన్నారు. మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించే బీమా సఖి కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సాధికారతను ప్రోత్సహించడానికి ఎల్ఐసి కట్టుబడి ఉందని పునీత్ కుమార్ తెలియజేశారు. బీమా సఖి కార్యక్రమం ద్వారా ఎల్ఐసి ఈ పథకం ప్రారంభించినప్పటి నుండి ఇప్పటివరకు 48,882 మంది మహిళా ఏజెంట్లను నియమించుకుంది. గడువు ముగిసిన పాలసీల పునరుద్ధరణ కొరకు ప్రీమియంపైన వడ్డీపై 30% వరకు రాయితీతో పునరుద్ధరణ కాంపెయిన్ జరుగుతోందని,ఈ అవకాశం సెప్టెంబర్ 17 వరకు అందుబాటులో ఉంటుందని ఆయన తెలియజేశారు. 'యోగక్షేమం వహామ్యహం' (మీ సంక్షేమం మా బాధ్యత) అనే నినాదాన్ని దృష్టిలో ఉంచుకుని, కార్పొరేషన్ ఉన్నత శిఖరాలకు చేరుకోవడానికి తమ వంతు కృషి చేయాలని, ఉద్యోగులు, క్షేత్రస్థాయి సిబ్బందిని తిరిగి అంకితభావంతో పనిచేయాలని పునీత్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాజేష్ భరద్వాజ్, ఎం రవికుమార్, శరవణ రమేష్, జిఎస్ శాస్త్రి, పిజి కుమారస్వామిలింగం, ఎఎంఎం హిలాలి, ఇతర సీనియర్ అధికారులు హాజరయ్యారు.

# పసిడి ప్రియుల బెంబేలు

### వారం రోజుల నుంచి వరుసగా ధరలు పైపైకి.. ఇది సురక్షితమైన పెట్టుబడి డిమాండ్



**ఈ సంవత్సరం ఇప్పటివరకు వెండి బంగారం కంటే భారీగా పెరిగింది. డిసెంబర్ 2024 చివరలో కిలోకు రూ.89,700 ఉండగా.. ఇప్పటి వరకు 40.58శాతం పెరిగింది. అమెరికా సుంకాల పెంపుదల, అమెరికా కరెన్సీతో పోలిస్తే రూపాయి విలువ తగ్గడం.. సురక్షిత పెట్టుబడులకు డిమాండ్ పెరుగుతోంది. అమెరికా డాలర్తో పోలిస్తే రూపాయి 8 పైసలు తగ్గి 88.18 వద్ద ఆల్ టైమ్ కనిష్ట స్థాయికి చేరుకుంది.**

పసిడి ధరలు బెంబేలెత్తిస్తున్నాయి. సామాన్యులకు అందనంత ఎత్తుకు చేరుతున్నాయి. ఇటీవల వరుసగా ఏడోరోజు ధరలు పెరిగాయి. దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల ధర రూ.400 పెరిగి తులానికి రూ.1,06,070కి పెరిగింది. అదే సమయంలో 22 క్యారెట్ల పసిడి ధర రూ.400 పెరగడంతో తులానికి రూ.1,05,200కి ఎగిసింది. అదే సమయంలో వెండి ధర రూ.100 పెరిగి కిలోకు రూ.1,26,100కి పెరిగి సరికొత్త రికార్డు స్థాయికి చేరింది. గత ఏడు సెషన్లలో బంగారం ధర 10 గ్రాములకు రూ.5,900 పెరిగింది. ప్రస్తుత క్యాలెండర్ సంవత్సరంలో బంగారం ధరలు 34.35 శాతం పెరిగాయి. గత మూడు సెషన్లలో వెండి ధరలు కిలోకు రూ.7,100 పెరిగాయి. ఈ సంవత్సరం ఇప్పటివరకు వెండి బంగారం కంటే భారీగా పెరిగింది. డిసెంబర్ 2024 చివరలో కిలోకు రూ.89,700 ఉండగా.. ఇప్పటి వరకు 40.58శాతం పెరిగింది. అమెరికా సుంకాల పెంపుదల, అమెరికా కరెన్సీతో పోలిస్తే రూపాయి విలువ తగ్గడం.. సురక్షిత పెట్టుబడులకు డిమాండ్ పెరుగుతోంది. అమెరికా డాలర్తో పోలిస్తే రూపాయి 8 పైసలు తగ్గి 88.18 వద్ద ఆల్ టైమ్ కనిష్ట స్థాయికి చేరుకుంది. భారతదేశం-అమెరికా వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితి, బలహీనమైన దేశీయ స్టాక్ మార్కెట్లు స్థానిక యూనిట్పై ఒత్తిడిని కలిగించాయి. గతవారం అమెరికా అప్పీల్ కోర్టు పరస్పర సుంకాలను చట్టవిరుద్ధంగా ప్రకటించాలనే వైట్ హౌస్ నిర్ణయాన్ని సమర్థించిన తర్వాత మంగళవారం బంగారం ధరలు రికార్డు గరిష్ట స్థాయికి చేరుకున్నాయని ఆగ్మాంట్ పరిశోధన విభాగాధిపతి రెనిషా చైనాని తెలిపారు. అక్టోబర్ మధ్యకాలం వరకు సుంకాలు అమలులో ఉండవచ్చని కోర్టు పేర్కొంది. అయితే, అధ్యక్షుడు ట్రంప్ ఈ నిర్ణయాన్ని విమర్శించారు. ఈ నిర్ణయాన్ని సుప్రీంకోర్టులో సవాలు చేస్తామని ఆయన అన్నారు. కమొడిటీ మార్కెట్ నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఈ పరిణామం అమెరికా సుంకాల ఆర్థిక ప్రభావంపై అనిశ్చితిని పెంచింది. ఇందులో ఎక్కువ భాగం ఆగస్టులో అమలులోకి వచ్చాయి. అంతర్జాతీయ మార్కెట్లో స్పాట్ బంగారం న్యూయార్క్లో దాని ఆల్ టైమ్ హై నుంచి 3,477.41 డాలర్లకు పడిపోయింది. ట్రేడింగ్ సమయంలో బంగారం ఔన్సుకు 3,508.54 డాలర్ల వద్ద రికార్డు గరిష్టాన్ని తాకింది. యాక్సిస్ సెక్యూరిటీస్ సీనియర్ రీసెర్చ్ అనలిస్ట్ (కమొడిటీస్) దేవేయ గగ్లాని మాట్లాడుతూ యూఎస్ ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేటు కోతల అంచనాలు పెరగడం, సుంకాల అనిశ్చితిపై ఆందోళనల మధ్య స్పాట్ బంగారం ధరలు ఔన్సుకు 3,508 రికార్డు గరిష్టానికి పెరిగాయన్నారు. ఇది సురక్షితమైన పెట్టుబడి డిమాండ్ను పెంచింది. అయితే, స్పాట్ వెండి 1.08 శాతం తగ్గి ఔన్సుకు 40.29 డాలర్లకు చేరుకుంది. 2011 తర్వాత మొదటిసారిగా ఔన్సుకు 40 డాలర్లకు దాటింది. స్పాట్ ధరలు ఔన్స్కు 41.24 డాలర్లకు చేరాయి.



## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు
### సెన్సెక్స్ 206 పాయింట్లు డౌన్

దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం నష్టాల్లో ముగిశాయి. మార్కెట్లు ఉదయం లాభాల్లో మొదలైనా.. చివరకు నష్టాల్లోకి జారుకున్నాయి. మదుపరులు లాభాల స్వీకరణకు దిగడంతో మార్కెట్లు నష్టాల్లోకి వెళ్లాయి. క్రితం సెషన్తో పోలిస్తే.. 80,520 పాయింట్ల వద్ద లాభాల్లో మొదలైన సెన్సెక్స్.. ఇంట్రాడేలో 70,761.14 పాయింట్ల గరిష్ఠానికి చేరిన సెన్సెక్స్.. 80,008.50 పాయింట్ల కనిష్ఠానికి దిగొచ్చింది. చివరకు 206.61 పాయింట్లు పతనమై.. 80,157.88 వద్ద ముగిసింది. నిఫ్టీ 45.45 పాయింట్లు తగ్గి 24,579.60 వద్ద స్థిరపడింది. దాదాపు 2,413 షేర్లు లాభపడగా.. 1,551 షేర్లు పతనమయ్యాయి. డాలర్ ఐదు వారాల కనిష్ట స్థాయికి చేరుకుంది. బంగారం రికార్డు స్థాయికి చేరుకుంది. పెట్టుబడిదారులు ఈ వారం ఆర్థిక డేటా కోసం ఎదురుచూస్తున్నారు. సెప్టెంబర్లో ఫెడరల్ రిజర్వ్ రేట్ల కోత అంచనాలు బలోపేతం చేయనున్నది. ఈ నెల చివరలో ఫెడ్ వడ్డీ రేట్లను తగ్గిస్తుందని మార్కెట్లు విస్తృతంగా అంచనా వేస్తున్నాయి. 25 బేసిస్ పాయింట్ల కోతకు 89శాతం అవకాశం ఉంది. కానీ, ఈ వారం డేటా పెట్టుబడిదారులు సెంట్రల్ బ్యాంక్ కోత దిశగా మొగ్గు చూపుతుందా? లేదా? అంచనా వేసేందుకు సహాయపడనున్నది. ఫెడ్ పాలసీ సమావేశానికి వారం ముందు, సెప్టెంబర్ 11న విడుదల కానున్న ఆగస్టు మాసానికి సంబంధించిన యూఎస్ ద్రవ్యోల్బణ నివేదిక, కేంద్ర బ్యాంకు దశలను నిర్ణయించడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

# షాంఘైలో అరుదైన సంఘటన

**న్యూఢిల్లీ,సెప్టెంబర్2 :** చైనా కమ్యూనిస్టు పార్టీలో కీలకమైన వ్యక్తి. పేరున్న కైకీ ప్రధాని మోదీతో భేటీ కావడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రధాని మోదీ చైనా పర్యటన సందర్భంగా అధ్యక్షుడు జిన్పింగ్ స్వయంగా కైకీని రంగంలోకి దింపారు. భారత ప్రధానితో ఇరుదేశాల సంబంధాలపై చర్చించాలని సూచించారు. ప్రధాని మోదీ,కైకీ మధ్య దాదాపు 45 నిమిషాలపాటు సమావేశం జరగడం తియాంజిన్ దౌత్యవర్గాల్లో ప్రకంపనలు సృష్టించింది. ప్రధాని ఆలోచనలను ఆయనతో పంచుకొన్నారు. ఎందుకంటే కైకీకి నవ్వడమే తెలియదట. అంటే అంత సీరియస్గా ఉండే వ్యక్తి మోదీ చర్చలు జరపడం నిజంగా ఓ శుభపరిణామం. అతడు అధ్యక్షుడు జిన్పింగ్కు కుడిభుజం అని చైనా కమ్యూనిస్ట్ పార్టీ వర్గాలు చెబుతుంటాయి. పార్టీలో పలు కీలక పదవులను ఆయన నిర్వహిస్తున్నారు. బీజింగ్లోని విదేశీ దౌత్యవేత్తలు ఆయనతో భేటీ కావడానికి ఆసక్తి చూపినా.. చాలావరకు ఆయన వాటికి దూరంగా ఉంటారు. కానీ, ఇటీవల ఎస్సీవోలో పాల్గొన్న ఏ దేశ నాయకుడినీ ఆయన బహిరంగంగా కలవలేదు. కానీ, మోదీ-జిన్పింగ్ ద్వైపాక్షిక భేటీకి మాత్రం హాజరయ్యారు. ఇరుదేశాల సంబంధాలు వేగంగా సాధారణ స్థితికి చేరడానికి ఈ భేటీ దోహదపడుతుందని నమ్ముతున్నారు. చైనాలోని భారత వ్యతిరేక వర్గాలకు ఈ భేటీ బలమైన సంకేతాలు పంపినట్లు భావిస్తున్నారు. కైకీ ప్రస్తుతం కమ్యూనిస్టు పార్టీ సెక్రటేరియట్లో ఫస్ట్ ర్యాంకింగ్ హోదా, పొలిట్బ్యూరో స్టాండింగ్ కమిటీలో సభ్యుడిగా ఉన్నారు. అన్నింటికీ మించి జిన్పింగ్కు అత్యంత సన్నిహితుడు.చైనాలోని అధికార క్రమంలో ఐదో స్థానంలో ఉన్నారు. ఫుజియాన్ ప్రావిన్స్కు చెందిన కై, షీ జిన్పింగ్ ను 1980ల్లో తొలిసారి కలిశారు. ప్రస్తుతం ర్యాంకులు ఎలాఉన్నా.. చైనా ప్రీమియర్ లి క్వియాంగ్తో సమానంగా ఆయన మాట చెల్లుబాటవుతుంది. పార్టీలో తెలివైన వ్యక్తిగా.. అందుబాటులో ఉండే నేతగా ఆయనకు పేరుంది.

# కేసీఆర్ని ముట్టుకుంటే రాష్ట్రం అగ్నిగుండమైతది







**ఖమ్మం (జనంసాక్షి):** కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ పార్టీ కుట్రలకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఖమ్మం లోని జడ్పీ సెంటర్లో రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తరలించారు. ఖమ్మం జడ్పీ సెంటర్లో రాస్తారోకో చేస్తున్న బిఆర్ఎస్ నేతలు నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, మాజీ మంత్రి పువ్వాడ పీఏ చిరుమామిళ్ల కిరణ్, సీనియర్ నాయకులు బచ్చు విజయ్, ఆర్జెసి కృష్ణ, మక్బూల్,ఖమర్, నాగచంద్ర రెడ్డి, బత్తుల మురళి, దేవభక్తుని కిషోర్ బాబు ను పోలీసులు అరెస్టు చేశారు. ఖమ్మం నగర బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే 3 బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 21 పంప్ హౌజ్లు, 203 కిలో మీటర్ల సొరంగాలు, 1531 కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్స్, 141 టీఎంసీల స్టోరేజీ, 530 మీటర్లకు ఎత్తిపోయడం, 240 టీఎంసీల నిటి ఉపయోగం అని అన్నారు. ఇంత పెద్ద కాళేశ్వర ప్రాజెక్టులో కేవలం ఒక బ్యారేజీలోని 100 పిల్లర్లలో 3 పిల్లర్లు కుంగాయని కాంగ్రెస్ పార్టీ నాయకులు రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీని అణగదొక్కేందుకు కాంగ్రెస్, బీజేపీ ములాఖత్ అయ్యాయని విమర్శించారు. కమిషన్ల పేరుతో ఎంక్వైరీలతో కాలయాపన చేస్తూ బీఆర్ఎస్ను బద్నాం చేసే ప్రయత్నాలను తప్పకుండా ప్రజాక్షేత్రంలో ఎండగడుతామని హెచ్చరించారు. 6 గ్యారంటీలు, 420 హామీల అమలు మరిచి కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు, అన్నివర్గాలకు అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. ఈ ధర్నాలో బిఆర్ఎస్ నాయకులు పసుమర్తి రామ్మోహన్, జ్యోతి రెడ్డి, పల్లా రోజ్ లీన,కురాకుల వలరాజు,మాటేటి నాగేశ్వరావు, డోకుపర్తి సుబ్బారావు,తాజుద్దీన్, రుద్ర గాని ఉపేందర్, శంషుద్దీన్ షకీన, ఉస్మాన్, సాయి,రాజేష్, షానవాజ్, మాధవి, శైలజ,షేక్ యాకూబ్,అశోక్ సింగ్ పాల్గొన్నారు.

**తెలంగాణ తెచ్చిన వ్యక్తిపై సీబీఐ విచారణా..?**
**బీఆర్ఎస్ పార్టీని అణగదొక్కేందుకు కాంగ్రెస్, బీజేపీ ములాఖత్**

## వామన్రావు దంపతుల హత్య
# మొదలైన సీబీఐ దర్యాప్తు



**హైదరాబాద్,సెప్టెంబర్2 (జనంసాక్షి):** పెద్దపల్లి జిల్లా మంథనికి చెందిన న్యాయవాదులు గట్టు- వామన్రావు, నాగమణి దంపతుల హత్య కేసులో దర్యాప్తు బాధ్యతలను సీబీఐ చేపట్టింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 120బీ, 341, 302, 34 సెక్షన్ల కింద సీబీఐ కేసు నమోదుచేసింది. నిందితులుగా వసంతరావు, కుంట శ్రీనివాస్, అక్కపాక కుమార్ పేర్లను చేర్చింది. 2021, ఫిబ్రవరి 17న పెద్దపల్లి సమీపంలో వామనరావు దంపతులు హత్యకు గురైన విషయం తెలిసిందే. ఈ ఘటనపై నమోదైన కేసును సీబీఐకి బదిలీ చేయాలంటూ వామన్రావు తండ్రి గట్టు- కిషన్రావు సుప్రీం కోర్టులో పిషన్ దాఖలు చేశారు. గత నెల 12న పిటిషనర్కు అనుకూలంగా తీర్పు వెలువరించిన అత్యున్నత న్యాయస్థానం.. కేసును సీబీఐకి బదిలీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలో సీబీఐ కేసు నమోదుచేసింది.ఈ హత్య కేసులో కిషన్ రావు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా రామగిరి పోలీస్ స్టేషన్లో ఎఫ్ఐఆర్ నమోదయింది. అయితే ఈ కేసు దర్యాప్తును చేపట్టి తుది నివేదిక దాఖలు చేయాలని సుప్రీంకోర్టు ఆగస్టు 12న ఆదేశించింది. దీంతో ఇప్పటికే రామగిరి పీఎస్లో నమోదైన ఎఫ్ఐఆర్ను అదే సెక్షన్ల కింద మంథని మండలం గుంజపడుగుకు చెందిన వెల్ది వసంతరావు, కుంట శ్రీనివాస్, అక్కపాక కుమార్లపై రీరిజిస్టర్ చేసి విచారణ చేపడుతున్నాం' అని సీబీఐ పేర్కొంది. కేసు దర్యాప్తు అధికారిగా ఇన్స్పెక్టర్ విపిన్ గహలోత్ వ్యవహరించనున్నారు.

# రోడ్డెక్కిన గ్రీన్ఫీల్డ్ భూ నిర్వాసితులు


**చింతలపూడి,సెప్టెంబర్1(జనంసాక్షి) :** గ్రీన్ ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్లు ప్రొవిజన్ కల్పించాలని, గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల పోరాట కమిటీ-, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం రేచర్ల వద్ద రైతులు రోడ్డెక్కారు. భూ నిర్వాసిత రైతుల సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రీన్ ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్లు ప్రొవిజన్ కల్పించకపోవడం దారుణమని విమర్శించారు. రైతులు తమ పొలాలకు వెళ్లే మార్గాలు లేక, తమ పంటలు తెచ్చుకునే అవకాశం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనేక చోట్ల అండర్ పాస్ లు తగినంత ఎత్తు, వెడల్పు తో నిర్మాణం చేయకపోవడంతో గ్రామాల మధ్య రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయని చెప్పారు. గ్రీన్ ఫీల్డ్ హైవే వలన ప్రతి గ్రామం పరిధిలో సమస్యలు ఉన్నాయని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. గ్రీన్ ఫీల్డ్ హైవే అథారిటీ- అధికారులు, రెవిన్యూ అధికారులు, భూ సేకరణ అధికారులు క్షేత్ర స్థాయిలో గ్రామాల వారీగా రైతులతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల సమస్యల పట్ల కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాలన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల పోరాట కమిటీ నాయకులు కంచర్ల శ్రీనివాసరావు, చీకటి శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు పి.పాండు రంగారావు, సిఐటియు జిల్లా నాయకులు ఆర్.వీ.ఎస్ నారాయణ తదితరులు మాట్లాడుతూ రేచర్ల ఎగ్జిట్ వద్ద రైతులు తమ పొలాలకు వెళ్లే మార్గం లేదన్నారు. సర్వీస్ రోడ్ ఏర్పాటు- చేస్తామని, ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని అధికారులు ఇచ్చిన హామీలు అమలు కాలేదన్నారు. భూసేకరణలో రైతులకు అన్యాయం జరిగిందన్నారు. రేచర్ల నుండి లింగగూడెం వరకు ఉన్న అన్ని గ్రామాల పరిధిలో గ్రీన్ ఫీల్డ్ హైవే వలన అనేక సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కారం చేయాలని కోరారు. ఎన్నిసార్లు విజ్ఞప్తులు చేస్తున్నా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు కొనకళ్ళ రాఘవరావు, ఉప్పల శ్రీనివాసరావు, ఆది జగన్, ఆది ధర్మారావు, కెక్కిరాల ఉపేంద్ర, బులుసు సతీష్,హరికృష్ణ, చీకటి సర్వేశ్వరరావు,పర్వతనేని మురళీ మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

## సుగాలి ప్రీతి కేసు సిబిఐకి..
### కూటమి ప్రభుత్వం నిర్ణయం

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సంచలన సృష్టించిన సుగాలి ప్రీతి కేసులో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సుగాలి ప్రీతి కేసును సీబీఐకు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. కర్నూలు జిల్లాలో సంచలనం సృష్టించిన పదోతరగతి విద్యార్థి సుగాలి ప్రీతి కేసును సీబీఐకి అప్పగిస్తూ ఏపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2017 ఆగస్టు 18న కర్నూలులోని పాఠశాల వసతి గృహంలో సీలింగ్ ఫ్యాన్కు వేలాడుతూ ఆమె మృతదేహం కనిపించింది. వైకాపా హయాంలో ఈ కేసు సీబీఐకి ఇచ్చినా దర్యాప్తు ముందుకు సాగలేదు. ప్రీతి కుటు-ంబానికి న్యాయం చేస్తామని కూటమి నేతల హామీ ఇచ్చారు. ఈనేపథ్యంలో ఈ కేసును మరోసారి సీబీఐకి అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు సీబీఐకు లేఖ రాయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు- తెలుస్తోంది.

# మోడీ, జిన్పింగ్,పుతిన్ల భేటీ

### వీడియో షారే చేసిన కాలిఫోర్నియా గవర్నర్



**శాన్ఫ్రాన్సిస్కో,సెప్టెంబర్2 (జనంసాక్షి) :** భారీ సుంకాల విధింపు నేపథ్యంలో భారత్- అమెరికా మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. ఈక్రమంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ చైనాలో పర్యటించడం.. ఆ దేశాధ్యక్షుడు జిన్పింగ్, రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్లతో భేటీ కావడం ఆసక్తి రేకెత్తించాయి. ఈ ముగ్గురు అధినేతలు కలిసి ఉన్న వీడియోను కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్ ఎక్స్లో పోస్టు చేసి.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నకు కౌంటర్ ఇచ్చారు. ఎస్సీవో సదస్సు నేపథ్యంలో మోదీ, జిన్పింగ్, పుతిన్ లు కలుసుకున్నారు. ఈక్రమంలో రష్యా అధినేత, భారత ప్రధాని చేతులు పట్టు-కొని నడుస్తూ.. జిన్పింగ్ వద్దకు వెళ్తున్న వీడియోను న్యూసమ్ పోస్టు చేశారు. దీనికి 'భయపడకండి.. ట్రంప్ తన గార్డ్లను షికాగోకు పంపుతున్నారు' అని రాసుకొచ్చారు. షికాగోలో నేరాలు, అక్రమ వలసలను అరికట్టడంలో ట్రంప్ ప్రణాళికలపై ప్రతిష్టంభన నెలకొంది. ఈక్రమంలో ట్రంప్ను విమర్శిస్తూ.. న్యూసమ్ ఈ పోస్టు చేసినట్లు- తెలుస్తోంది. దేశంలో శాంతిభద్రతల విషయంలో ఇటీ-వల ట్రంప్ పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అందులోభాగంగా షికాగో, న్యూయార్క్లలో నేషనల్ గార్డ్స్ను మోహరించే యోచనలో ఉన్నట్లు- తెలిపారు. ఆయన ప్రకటనపై తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. కాగా.. అక్రమ వలసదారుల ఏరివేతే లక్ష్యంగా ఇటీ-వల లాస్ఏంజెలెస్లో ఫెడరల్ అధికారులు చేపట్టిన తనిఖీలు ఉద్రిక్తతలకు దారితీసిన విషయం తెలిసిందే. ఆ సమయంలో ట్రంప్ అక్కడికి నేషనల్ గార్డు బృందాలను తరలించారు. నాడు న్యూసమ్ దీన్ని తీవ్రంగా ఖండించారు. ఇటీవల దేశ రాజధాని వాషింగ్టన్లో కూడా నేషనల్ గార్డ్ బలగాలను మోహరిస్తున్నట్లు- ట్రంప్ ప్రకటించారు.

# ఢిల్లీని ముంచెత్తిన యమునా వరదలు

**ఉత్తరాదిలో వర్ష బీభత్సం**
**మళ్లీ పెరిగిన వరదలు**
**పలు రాష్ట్రాల్లో వరదలతో అతలాకుతలం**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్2 (జనంసాక్షి) :** ఉత్తరాది రాష్ట్రాల్లో భారీ వర్షాలు బీభత్సం సృష్టిస్తున్నాయి. వాగులు, వంకలు, నదులు ప్రమాదకర స్థాయిలో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. యమునా ఉధృతితో ఢిల్లీ నగరం నీట మునిగింది. ఇప్పటికే ఇళ్లలోకి నీరు చేరుతోంది. ఢిల్లీలోని యమునా నదిలో నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. నదీ ప్రవాహక ప్రాంతాల్లో నివసించే ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని అధికారులు సూచించారు. ఉత్తరాఖండ్, హిమాచల్ప్రదేశ్ల్లో కొండచరియలు విరిగిపడి ఏడుగురు మృతిచెందారు. రాష్ట్రంలో పలుచోట్ల ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో సిమ్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడి తండ్రీ, కుమార్తె సహా ఐదుగురు మరణించారు. ఉత్తరాఖండ్లోని సోన్ప్రయాగ్ గౌరీకుండ్ మధ్య ఉన్న కేదార్నాథ్ జాతీయ రహదారిపై కొండచరియలు విరిగిపడి ఇద్దరు మృతిచెందారు. ఆరుగురు గాయపడ్డారు. దీంతో ఈ నెల 3 వరకు కేదార్నాథ్ యాత్రను అధికారులు తాత్కాలికంగా నిలిపివేశారు. ఉత్తరకాశీ జిల్లాలోని కమ్లా నదితో పాటు, దేహ్రాదూన్లోని శాలినీ నది, తెహ్రీ జిల్లాలోని అగ్లర్ నది, రుద్రప్రయాగ్లోని అలకనందా, మందాకిని నదులు ప్రమాదస్థాయిని మించి ప్రవహిస్తున్నాయి. పంజాబ్, హరియాణా,



చండీగఢ్లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. లూథియానాలో అత్యధికంగా 216.70 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పఠాన్కోట్, గుర్దాస్పూర్, ఫాజిల్కా, కపుర్థలా, తరన్తరన్, ఫిరోజ్పూర్, హోశియార్పూర్, అమృత్సర్ జిల్లాల్లోని పలు గ్రామాలు నీట మునిగాయి. ఈ ఆరు జిల్లాల్లో మంగళవారం వరకూ భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీచేసింది. పంజాబ్లో వర్షాల కారణంగా పలు రైళ్లు రద్దయ్యాయి. రాష్ట్రంలోని 793 రోడ్లను మూసి వేశారు. ఈ నెల 3వరకు అన్ని విద్యాసంస్థలను మూసివేయాలని పంజాబ్ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు ఇచ్చింది. రాజస్థాన్ రాజధాని జైపూర్తో సహా పలు ప్రాంతాల్లో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. రాష్ట్రంలో పిడుగుపాటుకు ఇద్దరు మృతిచెందారు. ఒకరు నదీ ప్రవాహంలో కొట్టుకుపోయారు. జమ్మూ, పంజాబ్, హిమాచల్ప్రదేశ్లలో వరదల్లో చిక్కుకొన్న 5 వేల మందిని, 300 మంది పారామిలటరీ దళాల సిబ్బందిని రక్షించామని సైన్యం తెలిపింది. పంజాబ్లో ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆ రాష్ట్ర గవర్నర్ గులాబ్ చంద్ కటారియాతో పాటు- ముఖ్యమంత్రి భగవంత్ మాన్తో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఫోన్లో మాట్లాడారు. మరోవైపు జమ్మూకశ్మీర్లో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి అధికారులతో సమీక్షించారు. వరదల్లో నష్టపోయిన పంజాబ్, జమ్మూకశ్మీర్లను కేంద్రం అన్ని విధాలా ఆదుకుంటుందని హామీఇచ్చారు.

## రాష్ట్రంలో డిమాండ్ను మించి ఎరువులు

**అమరావతి,సెప్టెంబర్1(జనంసాక్షి) :** ఏపీ రాష్ట్రంలో ఎరువుల సరఫరాపై రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. డిమాండ్ కంటే అదనంగానే నిల్వలు ఉన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఎరువులు బ్లాక్ మార్కెట్కు తరలి పోకుండా కఠినంగా వ్యవహరించాలని సీఎం ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో ఉద్యాన పంటలు, ఎరువుల లభ్యత, మార్కెటింగ్ శాఖపై సమీక్ష నిర్వహించారు.

# గ్లోబల్ లాజిస్టిక్స్ హబ్గా ఆంధ్రప్రదేశ్

**నదుల అనుసంధానంతో రవాణా సులభతరం**
**రాష్ట్రంలోని వివిధ ఓడరేవుల్లో టెర్మినళ్ల అభివృద్ధి**
**బల్క్ నుంచి కంటైనర్ కార్గోగా మారాలి**
**పోర్ట్ ఆధారిత ఎకానమీపైనే ప్రధానంగా దృష్టి**
**ఈస్ట్ కోస్ట్ మారిటైమ్ లాజిస్టిక్స్ సమ్మిట్లో సీఎం చంద్రబాబు**

**విశాఖపట్నం,సెప్టెంబర్ 1 (జనంసాక్షి) :** ఆంధ్రప్రదేశ్లో లాజిస్టిక్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. దేశంలో నదుల అనుసంధానం చేపట్టాలని ఎప్పటినుంచో కోరుతున్నానని, గంగా నుంచి కావేరీ వరకు నదులను అనుసంధానం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గ్లోబల్ ఫోరం ఫర్ సస్టెయినబుల్ ట్రాన్స్ఫర్మేషన్ ఆధ్వర్యంలో విశాఖ నోవాటెల్లో ఏర్పాటు- చేసిన ఈస్ట్ కోస్ట్ మారిటైమ్ లాజిస్టిక్స్ సమ్మిట్లో సీఎం పాల్గొన్నారు. స్వర్ణాంధ్ర - 2047 లక్ష్యాలలో భాగంగా ఏపీని గ్లోబల్ లాజిస్టిక్స్ హబ్గా తీర్చిదిద్దే అంశంపై చంద్రబాబు పారిశ్రామిక ప్రతినిధులతో చర్చించారు. ఈసందర్భంగా ఆయన మారిటైమ్ లాజిస్టిక్స్ అభివృద్ధిపై దేశంలోని వివిధ పోర్టులు, కార్గో హ్యాండ్లింగ్ కంపెనీలకు చెందిన 62 మంది సీఈఓలతో సమావేశం అయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలలో భాగంగా ఏపీని గ్లోబల్ లాజిస్టిక్స్ హబ్గా తీర్చిదిద్దుతాం అని అన్నారు. ఏపీ మారిటైమ్ లాజిస్టిక్స్ రంగంలో ఉన్న అవకాశాలు, పోర్టు కార్గో హ్యాండ్లింగ్ మౌలిక సదుపాయాల కల్పన, రోడ్- రైలు కనెక్టివిటీలపై సమావేశంలో చర్చించారు. పోర్టుల పరిధిలో ఉన్న వివిధ ప్రాంతాలు, హింటర్ ల్యాండ్ కనెక్టివిటి, కార్గో రవాణా అంశాల గురించి మాట్లాడారు. రాష్ట్రంలోని వివిధ ఓడరేవుల్లో టెర్మినళ్ల ఆధునీకరణ, కోల్డ్ చైన్ సదుపాయాలు, షిప్ బిల్డింగ్ మరమ్మతులు, ఎయిర్ కార్గో కనెక్టివిటీ- అంశాలపై సీఎం సుదీర్ఘంగా చర్చించారు. మారిటైమ్ లాజిస్టిక్స్లో అంతర్జాతీయంగా అనుసరిస్తున్న ప్రమాణాలు, ఏపీలో ఉన్న అవకాశాలు, పెట్టుబడుల గురించి సమావేశంలో ఆయన వివరించారు. ప్రతీ పోర్టుకూ కనెక్టివిటీ మాస్టర్ ప్లాన్ రూపొందించాలని అన్నారు. రాష్ట్రంలో లాజిస్టిక్స్ యూనివర్శిటీ, సివిల్ ఏవియేషన్ యూనివర్సిటీ త్వరలో ఏర్పాటు- చేస్తామని సీఎం చెప్పారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
03 సెప్టెంబర్ 2025

# మహమ్మద్ ప్రవక్త గౌరవం ముస్లింలకు ప్రాణం కంటే విలువైనది

- 19, 20, 21వ తేదీల్లో సర్కస్ గ్రౌండ్లో ఎక్స్ పోకు తరలిరండి
- జమాతే ఇస్లామి హింద్ జిల్లా అధ్యక్షుడు సోహైబ్ అహ్మద్ ఖాన్




**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 02 (జనంసాక్షి) :** మహమ్మద్ ప్రవక్త జీవితం యావత్తు మానవజాతికి అనుసరణీయమని, ప్రవక్త గౌరవం యావత్తు ముస్లింలందరికీ ప్రాణం కంటే విలువైనదని, మహమ్మద్ ప్రవక్త సూచించిన బాటలో ప్రతి ఒక్కరు నడవాలని జమాతే ఇస్లామి హింద్ జిల్లా అధ్యక్షుడు సోహైబ్ అహ్మద్ ఖాన్ అన్నారు. మంగళవారం రబిఉల్ అవ్వల్ మాసం సందర్భంగా మహమ్మద్ ప్రవక్త జన్మదిన మాసోత్సవాల సందర్భంగా నగరంలోని ఎంఐఎం పార్టీ కార్యాలయం దారుస్సలాంలో ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ అధ్యక్షతన జల్సా సిరతున్నబి ఆధ్యాత్మిక సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జమాతే ఇస్లామీ హింద్ జిల్లా అధ్యక్షుడు సోహైబ్ అహ్మద్ ఖాన్, మంకమ్మ తోట ఏరియా అధ్యక్షుడు మహమ్మద్ ఖైరుద్దీన్ లు మాట్లాడారు. ఈ సందర్భంగా వారు ఆధ్యాత్మిక సదస్సును ఉద్దేశించి మాట్లాడుతూ... వారసత్వంగా మహమ్మద్ ప్రవక్త జీవితాన్ని భవిష్యత్తు తరాలకు చెప్పాల్సిన బాధ్యత ప్రతి ముస్లిం పై ఉన్నదని చెప్పారు. నేటి కంప్యూటర్, స్మార్ట్ ఫోన్ యుగంలో యువత, విద్యార్థులు పెడదారిన పట్టకుండా, చెడు వ్యసనాల బారిన పడకుండా మహమ్మద్ ప్రవక్త జీవిత సూత్రాలు చెప్పారని, వాటిని కుల, మతాలకు అతీతంగా తెలియజేయాల్సిన అవసరం ఖచ్చితంగా ఉందన్నారు. ఈ జన్మదిన మాసరోత్స వాల సందర్భంగా కరీంనగర్ జిల్లాలో ఒక లక్ష మందిని కుల మతాల కతీతంగా కలిసి మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్రను ఆయన జీవితంలో చేసినటువంటి మంచి కార్యక్రమాలను యావత్తు సమాజానికి తెలియపరచి వారిని చైతన్యవంతులుగా చేయడమే జమాతే ఇస్లామీ హింద్ ముఖ్య ఉద్దేశమని ఈ నేపథ్యంలో జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండలా కేంద్రాలలో, మేజర్ గ్రామపంచాయతీలలో, మున్సిపల్ ఏరియాలలో కలియతిరిగి మహమ్మద్ ప్రవక్త జీవిత చరిత్రను యావత్తు మానవులందరికీ వివరిస్తామ ని చెప్పారు. ఎవరు అంగీకరించినా, అంగీకరిం చక పోయినా మహమ్మద్ ప్రవక్త కేవలం ముస్లింలకే ప్రవక్త కాదని, యావత్తు మానవులం దరి కోసం ఏకేశ్వరుడైన అల్లాహ్ పంపించిన ప్రవక్త అని వివరించారు. సెప్టెంబర్ 19, 20, 21తేదీలలో నగరంలోని మహాత్మా జ్యోతిబాపూలే మైదానము సర్కస్ గ్రౌండ్లో మహమ్మద్ ప్రవక్త జన్మదిన మాస ఉత్సవాలకు సంబంధించి ఎక్స్ పో– 2025ను నిర్వహిస్తున్నట్లు ఇందులో వివిధ స్టాళ్లను ఏర్పాటు చేసి ప్రవక్త జీవిత చరిత్ర కు సంబంధించిన పుస్తకాలను అందుబాటులో ఉంచుతామన్నారు. చివరి రోజు 21న సుమారు వేలాది మందితో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఆధ్యాత్మిక బహిరంగ సభకు జమాతే ఇస్లామీ హింద్ జాతీయ అధ్యక్షునితో పాటు, రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులందరూ హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఈఆధ్యాత్మిక సదస్సులో పిఆర్వో మహమ్మద్ రఫీ ఖిరాత్ కలాం చదువగా, దాదాపు 200 మంది పైచిలుకు ఎంఐఎం నాయకులు, మాజీ కార్పొరేటర్లు హాజరై విజయవంతం చేశారు. సదస్సుకు హాజరై విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి గులాం అహ్మద్ కృతజ్ఞతలు తెలి పారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమీ, నగర కమిటీ నాయకులు బర్కత్ అలీ, అతిఫ్ ఆతిన, ఖమరొద్దీన్, మాజీ కార్పొరేటర్లు అఖీల్ ఫిరోజ్, శర్ఫుద్దీన్, పాల్గొన్నారు.

# సులభ పద్ధతిలో పాఠ్యాంశాలు బోధించాలి

- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- నర్మాలలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యాలయం ఆకస్మిక తనిఖీ

**గంభీరావుపేట, సెప్టెంబర్ 02 (జనంసాక్షి):** విద్యార్థులకు సులభమైన పద్ధతిలో పాఠ్యాంశాలు బోధించాలని, అన్ని సబ్జెక్టులపై పట్టు సాధించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. గంభీరావుపేట మండలం నర్మాలలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యాలయాన్ని కలెక్టర్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యాలయంలోని అన్ని తంగతి గదులు, వంటగదిని స్వయంగా తిరిగి పరిశీలించారు.

**ప్రశ్నలు అడిగి.. సమాధానాలు రాబట్టి..**

7,8,9,10 తరగతులలోని విద్యార్థులకు మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్, హిందీ పాఠాలను బోధించారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. తొమ్మిదో తరగతి విద్యార్థులు హిందీ టెక్స్ట్ బుక్ లోని పాఠ్యాంశాన్ని చదవలేక పోవడం గమనించి టీచర్ పై అసహనం వ్యక్తం చేశారు.

**భవనం పైకప్పు లీకేజీ కాకుండా మర మ్మత్తు చేయించా:** విద్యాలయం గదుల్లోకి దోమలు, పురుగులు, పాములు రాకుండా కిటికీలను రిపేర్, మెష్‌లు ఏర్పాటు చేయించాలని, వాటర్ లీకేజీలు, బిల్డింగ్ మీద నీరు నిల్వకాకుండా రూఫ్ లీకేజీ కాకుండా మరమ్మత్తు (వాటర్ ప్రూఫ్పింగ్) చేయించాలని అధికారులకు సూచించారు. విద్యాలయం, సిబ్బంది క్వార్టర్స్ ఆవరణలోని పరిసరాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ సెక్రటరీని ఆదేశించారు.



**15 రోజుల్లో మళ్లీ వస్తా..**

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని సూచించారు. అన్ని పాఠ్యాంశాలపై విద్యార్థులకు పట్టు వచ్చేలా మెరుగైన రీతిలో బోధించాలని ఆదేశించారు.

మరో 15 రోజుల్లో విద్యాలయానికి మళ్లీ వస్తానని, తనిఖీ చేస్తానని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠ శాల ప్రిన్సిపల్ ఉపాధ్యాయులు మార్కెట్ కమిటీ చైర్పర్సన్ విజయ సిరిసిల్ల ఆర్డీఓ వెంకటేశ్వర్లు తాసిల్దార్ ఎంపీడీవో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ధర్పల్లిలో కత్తెర పోట్ల కలకలం

- జిల్లా కేంద్ర ఆసుపత్రిలో నలుగురికి చికిత్స
- విచారణ చేపడుతున్న పోలీస్ యంత్రాంగం





**నిజామాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 02 (జనంసాక్షి) :** నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో కత్తెర పోట్లు కలకలం రేపాయి. మండల కేంద్రంలోని ఎన్టీఆర్ కాలనికి చెందిన వడ్ల దాసు అనే వ్యక్తి కాలనీలో నలుగురిని దర్జీ కత్తెరతో పొడిచాడు. ఆ కాలనీలో గల మచ్చ లక్ష్మీని మొదటగా కత్తెరతో పొడవగా, ఆమె కూతురు గౌతమి అడ్డు వెళ్ళడంతో ఆమెను కూడా పొడిచాడు. అక్కడ గొడవ జరుగుతుందని గమనించి పక్కింటి వారు వెళ్ళగా వారిలో శెట్పల్లి నాగరాజు, అతని భార్య శోభను కూడా కత్తెరతో పొడిచి, అక్కడి నుండి కాలనీలో కిరాణా షాపు నిర్వహిస్తున్న శెట్పల్లి భోజేశ్వర్ అనే వ్యక్తి షాపు దగ్గరికి వెళ్లి అతన్ని కూడా కత్తెరతో పొడవడం జరిగింది. గాయపడ్డ నలుగురిని నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించడం జరిగిందని, ఎవరికి ప్రాణాపాయం లేదని, సంఘటనకు చెందిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని, ప్రస్తుతం విచారణ జరుగుతోందని పూర్తి వివరాలు వెల్లడిస్తామని స్థానిక పోలీసులు తెలిపారు.

## ప్రజల గుండెల్లో వైయస్సార్ చెరగని ముద్ర

**సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి**




**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 02 (జనంసాక్షి) :** దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి కి కాంగ్రెస్ నేతలు ఘన నివాళులు అర్పించారు. నగర కాంగ్రెస్ అధ్యక్షులు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి మాట్లాడుతూ... ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చేసిన సేవలలో భాగంగా శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు, మిడ్ మానేరు ప్రాజెక్టు, వరద కాలువ, కొండగట్టు జేఎన్టీయూ, మంథని జేఎన్టీయూ, శాతవాహన యూనివర్సిటీ, పాలిటెక్నిక్ కాలేజ్ స్థాపించి ఈవిధంగా వైయస్ రాజశేఖర్ రెడ్డి అన్ని రంగాలలో ఈ జిల్లాను అభివృద్ధి చేసి ప్రజలలో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పులి ఆంజనేయులు గౌడ్, శ్రావణ్ నాయక్, కొరివి అరుణ్, వెన్న రాజమల్లయ్య, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, కలువల రామచందర్, మాదాసు శ్రీనివాస్, పెద్దెల్లి ఆంజనేయులు, వెన్నం రజిత రెడ్డి, ముస్తాక్, అహమ్మద్ అలీ, బొబ్బిలి విక్టర్,మహమ్మద్ చాంద్, దన్ను సింగ్, కుర్ర పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

## యూరియా అందించాలని రుద్రంగిలో ధర్నా



**రుద్రంగి, సెప్టెంబర్ 2 (జనంసాక్షి) :** రుద్రంగి మండల కేంద్రంలో మంగళవారం స్థానిక బిఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో కోరుట్ల వేములవాడ ప్రధాన రహదారిపై రైతులకు యూరియా అందించాలని ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ గంగం సరూప స్వరూప మహేష్ మాట్లాడుతూ.. రైతులకు యూరియా సకాలంలో అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, ఎమ్మెల్యే సొంత గ్రామంలో యూరియా కొరత ఉండడం కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుకు నిదర్శనం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంగం స్వరూప, నాయకులు గంగం మహేష్, పాల్గొన్నారు.

## కేసీఆర్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

**మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు**



**మంథని, (జనంసాక్షి) :** కొద్దిరోజులుగా కవిత చేసే పనుల వలన బిఆర్ఎస్ పార్టీకి నష్టం జరుగుతున్నదని, కవిత వ్యవహారంలో పార్టీ అధినేత కేసిఆర్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ఆ పార్టీ మంథని నియోజక వర్గ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ అంటే నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల ఇంటి పార్టీ, 60 లక్షల మంది సైనికులు, నాయకులు, కార్యకర్తలు ఉన్న సైన్యం అని అన్నారు. కేసీఆర్ గతంలోనే చెప్పారు.. తప్పు చేస్తే కుటుంబ సభ్యులనైనా సహించమని చెప్పారు. కన్నకూతురు కంటే కూడా కష్టంలో పార్టీకి అండగా ఉన్న కార్యకర్తల భవిష్యత్తు ముఖ్యమని తీసుకున్న నిర్ణయం హర్షించదగ్గ విషయం అని పేర్కొన్నారు. పార్టీ కంటే ఎవరు పెద్ద వారు కాదనే విషయం ఈ నిర్ణయంతో స్పష్టమైందన్నారు. ఆనాడు తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణ త్యాగానికి సిద్ధపడ్డారు.. ఈరోజు పార్టీ కోసం కన్న బిడ్డను కూడా వదులుకున్న గొప్ప నాయకుడు కేసీఆర్ అని అన్నారు.

## మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపండి




**నిజామాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 02 (జనంసాక్షి) :** నిజామాబాద్ నగరంలో పెరుగుతున్న గంజాయి, వైట్నర్, డ్రగ్స్, మత్తు పదార్థాలపై ఉక్కుపాదం మోపాలని, అదేవిదంగా బానిస బాబుల అరాచకాలను అరికట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి రమేష్ బాబు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నిజామాబాద్ నగరంలో మత్తు పదార్థాలకు అలవాటు పడి అరాచకాలు పెరుగుతున్నందున వాటిని అరికట్టాలని సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారులకు , నిజామాబాద్ అసిస్టెంట్ పోలీస్ కమిష నర్ ఏసిపికి. వినతి పత్రాలను అందించి, సమస్య తీవ్రత ను వివరించటం జరిగిందని, అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ రమేష్ బాబు అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పెద్ది వెంకట్‌రాములు, వెంకటేష్, జిల్లా కమిటీ సభ్యులు సుజాత, నగర కమిటీ సభ్యులు కటారిరాములు ,అంజయ్య పాల్గొన్నారు.

### ఫీజులను విడుదల చేయకుండా..

# విద్యార్థులు జీవితాలతో కాంగ్రెస్ చెలగాటం

**ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మంత్రుల నివాసాల ముట్టడి**



**హైదరాబాద్ సెప్టెంబర్ 2 (జనంసాక్షి):** రాష్ట్రంలో గత ఆరేళ్ల నుండి పెండింగ్ స్కాలర్ షిప్స్, ఫీజు రీయింబర్స్ విడుదల చేయాలని, విద్యారంగ సమస్యలు పరిష్కారం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ జిల్లా కలెక్టరేట్స్, జిల్లా కేంద్రాల్లో భారీ ప్రదర్శనలకు పిలుపునిచ్చింది. ఈ పిలుపులో భాగంగా హైదరాబాద్ లోని "మంత్రుల నివాసాల ముట్టడి" కార్యక్రమానికి ఎస్ఎఫ్ఐ చేసింది. ఈ సందర్భంగా తమ సమస్యలు మంత్రులకు చెప్పేందుకు వెళ్తున్న విద్యార్థి నేతలను పోలీసులు అడ్డుకోని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా తీవ్ర తోపులాట విద్యార్థులకు, పోలీసులకు మద్య జరిగింది. ఈ తోపులాటలో విద్యార్థి నాయకులు తీవ్రంగా గాయపడ్డారు,పలువురు చొక్కాలను చింపి పోలీసులు విద్యార్థి నాయకులపై దాడి చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రజనీకాంత్ మాట్లాడారు. రాష్ట్రంలో గత ఆరేళ్ల నుండి సుమారు 8,158 కోట్లు పెండింగ్ ఫీజులు బకాయిలు ఉన్నాయి. వాటిని ప్రభుత్వం విడుదల చేయడం లేదు. ఫీజులను విడుదల చేయకపోవడం వల్లన విద్యార్థులు సర్టిఫికేట్స్ యాజమాన్యాలు ఇవ్వడం లేదని ,దీనివల్ల పై చదువులకు వెళ్ళలేక పోతున్నారని అన్నారు.

# అందుబాటులోకి.. హైడ్రా టోల్ ఫ్రీ నంబరు 1070

**హైదరాబాద్, సెప్టెంబరు 02 (జనంసాక్షి):** హైడ్రాకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరించడానికి టోల్‌ఫ్రీ నంబరు 1070 అందుబాటులోకి వచ్చింది. 1070 నంబరుకు ఫోను చేసి ఫిర్యాదులు చేయవచ్చునని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. చెరువులు, నాలాలు, పార్కులు, ప్రభుత్వ భూములు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలు కబ్జాకు గురైతే వెంటనే టోల్‌ఫ్రీ ద్వారా సమాచారాన్ని అందించవచ్చునని తెలిపారు. మరీ ముఖ్యంగా ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు.. చెట్లు పడిపోయినా, వరద ముంచెత్తినా, అగ్ని ప్రమాదాలు జరిగినా ఇలా ప్రమాదకరమైన పరిస్థితులున్నప్పుడు హైడ్రాకు సంబంధించిన సేవలన్నిటికోసం టోల్ నంబరు 1070ద్వారా సంప్రదించవచ్చునని పేర్కొన్నా రు.

**అందుబాటులో సెల్ నంబర్లు కూడా...**

ఓఆర్ఆర్ పరిధిలో ప్రభుత్వ, ప్రజా ఆస్తుల పరిరక్షణకు 8712406899 నంబరుకు సమాచారం ఇవ్వడంతో పాటు.. వాట్సాప్ ద్వారా ఫిర్యాదుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు పంపించవచ్చునని హైడ్రా కమిషనర్ పేర్కొన్నారు. దీనికి తోడు.. ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు, భారీ వర్షాలు పడి కాలనీలు, రహదారులు నీట మునిగినా, అగ్ని ప్రమాదం జరిగినా వెంటనే 8712406901, 9000113667 ఈ రెండు నంబర్లకు ఫోను చేయాలని హైడ్రా కోరింది. 1070 టోల్ ఫ్రీ నంబరుతో పాటు.. పైన పేర్కొన్న మూడు సెల్ నంబర్లను ప్రజలు వినియోగించుకోవాలని హైడ్రా కమిషనర్ సూచించారు.



# గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

- కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి
- మానకొండూర్, కొత్తపల్లి, చింతకుంట నిమజ్జన ప్రాంతాల పరిశీలన



**కరీంనగర్ జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 02(జనంసాక్షి) :** గణేష్ నిమజ్జన ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధికారులను ఆదేశించారు. మంగళవారం పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తో కలిసి గణేష్ నిమజ్జన ప్రాంతాలైన మానకొండూర్ చెరువు, కొత్తపల్లి చెరువు, చింతకుంట కెనాల్ పరిశీలించారు. నిమజ్జన ప్రాంతాల్లో చేస్తున్న ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఈ నెల 5న నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నీటిపారుదల, విద్యుత్, అగ్నిమాపక, పోలీసు, మున్సిపల్ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అన్నారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ... ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా దారి మళ్లింపు, వన్‌వే వంటి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్, సిపి నిమజ్జన ప్రాంతాలను, చెరువు పరిసరాలను డ్రోన్ సాయంతో పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి మహేశ్వర్, వివిధ శాఖల అధికారులు, గణేష్ ఉత్సవ సమితి నాయకులు రాధాకృష్ణారెడ్డి, రమేష్, విద్యాసాగర్, శ్రీహరి పాల్గొన్నారు.

### నష్టపోయిన పంట పొలాలను

# పరిశీలించిన ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



**బోధన్, సెప్టెంబర్ 2 (జనంసాక్షి ) :** బోధన్ నియోజకవర్గ పరిధికొని సాలూర మండలం ఖాజాపూర్, హున్స, మందర్న గ్రామాల పంటలను భారీ వర్షాల కారణంగా పంట నష్టాన్ని అంచనా వేయడానికి వరద ప్రభావిత ప్రాంతాలను బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి క్షేత్రస్థాయిలో సందర్శించారు. భారీ వర్షం మరియు వరదల కారణంగా పంటలు కోల్పోయిన రైతులకు మరియు ఇళ్ళు దెబ్బతిన్న కుటుంబాలకు పరిహారం అందుతుందని అయన అన్నారు. వ్యవసాయం, ఉద్యానవనం మరియు రెవెన్యూ శాఖల అధికారులు గ్రామ స్థాయిలో పంట నష్టంపై సంయుక్తంగా సర్వేలు నిర్వహించాలని మరియు తుది ఏకీకృత నివేదికను సమర్పించాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, టీపీసీసీ డెలిగేట్ గంగా శంకర్, మందర్న కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మందర్న రవి, బోధన్ మార్కెట్ కమిటీ చైర్మన్ చీల శంకర్, నాయకులు అల్లే రమేష్, ఖాజాపూర్ అశోక్, అల్లె జనార్ధన్, రైతులు పాల్గొన్నారు.

## వ్యవసాయ శాఖ మంత్రిని కలిసిన వినయ్ రెడ్డి



**ఆర్మూర్, సెప్టెంబర్ 2 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుని ఆర్మూర్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వినయ్ రెడ్డి, ఆర్మూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్,ఆర్మూర్ పట్టణ మాజీ మున్సిపల్ చైర్మన్ పండిట్ పవన్,మాక్లూర్ సొసైటీ చైర్మన్ అశోక్,గంగాధర్ గౌడ్,కాంగ్రెస్ నాయకులు హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆర్మూర్ నియోజ కవర్గంలో యూరియా పంపిణీపై వారిని ఆరా తీశారు. యూరియా రైతులకు సరిపడా ఇస్తున్నామని మంత్రికి వివరించారు.

# నిజాం షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల వేతనాలు చెల్లించాలి



**బోధన్, సెప్టెంబర్ 2 (జనంసాక్షి) :** బోధన్ యువత ఆధ్వర్యంలో నిజాం షుగర్ ఫ్యాక్టరీ కార్మికుల పెండింగ్ వేతనా లు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చెల్లించి, షుగర్ ఫ్యాక్టరీపై ఎన్ని కల్లో ఇచ్చిన హామీ మేరకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలని బోధన్ యువత డిమాండ్ చేశారు. బోధన్ లోని అన్ని పార్టీలు కార్మికులకు అండగా ఉండాలని, షుగర్ ఫ్యాక్టరి ప్రారంభంపై కార్మికులను, రైతులను మోసం చేస్తే సహించేదిలేదని రాష్ట్ర ప్రభుత్వన్ని డిమాండ్ చేశారు. స్థానిక శాసనసభ్యులు సుదర్శన్ రెడ్డి స్పందించి కార్మికుల వేతనాల చెల్లింపుకు ప్రభుత్వం పై ఒత్తిడి తేవాలి. లేని పక్షంలో బోధన్ యువత ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తాం. కార్యక్ర మం లో నిజాం షుగర్ ఫ్యాక్టరీ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు అడ్లూరి శ్రీనివాస్, బోధన్ యువ నాయకులు గంధం రాజేష్ బహుజన సమాజ్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిరివెసు సంతోష్, కార్మిక నాయకులు రవిశంకర్ గౌడ్, బిజెపి నాయకు లు కందికట్ల వాసు, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు జూనైద్, బారసా నాయకులు ప్రవీణ్ జాదవ్, దళిత సంఘ నాయకులు నీరడి రవి, విద్యార్థి నాయకులు నాగరాజు, బారస నాయకులు మహ్మద్ షైక్ పాల్గొన్నారు.

# రైతులకు నష్టపరిహారం ప్రకటించకుంటే ఉద్యమిస్తాం



**బోధన్, సెప్టెంబర్ 2 (జనంసాక్షి) :** అఖిల భారత రైతు కూలీ సంఘం ఏఐకేఎంఎస్ నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సాలూర మండలంలో మంజీరా పరివాహక ప్రాంతమైన ఖాజాపూర్, హున్స , మందర్న గ్రామాలలో వారం రోజుల క్రితం నుండి కురిసిన భారీ వర్షాల మూలంగా జరిగిన పంట నష్టాన్ని మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం రైతులతో పంట నష్ట వివరాలను అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూర్ భూమ య్య మాట్లాడుతూ, భారీ వరదలకు మూలంగా సోయా పంట, వరి పంట ,చెరుకుపంట, కూరగాయలు తదితర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఎకరానికి 50 వేల రూపాయల చొప్పున నష్టపరిహారం అందించాలని వారు డిమాండ్ చేశారు గత 40 సంవత్సరాల నుండి ఇంత భారీ వరదలు ఇప్పుడు రావడం తో రైతుల జీవితాలు అతలాకుతలం చేసిందని వారు ఆవేదన వ్యక్తపరిచారు అధికారులు తగు జాగ్రత్తలు తీసుకుని ఉంటే ఇంత భారీ నష్టం జరిగేది కాదని వారు పేర్కొన్నారు పంట కొరకు బ్యాంకు నుండి తీసుకున్న వ్యవసాయ రుణాలను వెంటనే మాఫీ చేయాలని వారు డిమాండ్ చేశారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు వెంటనే యుద్ధ ప్రాతిపదికన నష్టపరిహారాన్ని ప్రకటించి రైతులకు అందించి వారిని ఆదుకోవాలనీ లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎల్ చిన్న పర్వయ్య, హీరోల పోశెట్టి, సూర్య విట్టల్, అర్సపల్లి సాయిలు, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు ఆర్ గౌతమ్ కుమార్, దాల్ మల్కా పోశెట్టి, జైరాం, కె సాయినాథ్, లక్ష్మణ్, అరుణ్, శివకుమార్, గంగారం మారుతి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో కుక్కల బెడద నివారించండి



**నిజంసాగర్ సెప్టెంబర్ 2 (జనంసాక్షి):** నిజం సాగర్ మండలంలోని మల్లూరు గ్రామంలో కుక్కల బెడద రోజురోజుకు పెరిగిపోతుందని గ్రామస్తులు అంటున్నారు. గ్రామంలో గల్లీలలో రోడ్లపై విచ్చలవిడిగా గుంపులుగా కుక్కలు తిరుగుతున్నాయని తెలిపారు. చిన్న పిల్లలు, మహిళలు వాటిని చూస్తేనే హడలి పోతున్నారు.కొన్ని రోజుల క్రితం కుక్కలు మల్లూరు గ్రామంలో స్వైర విహారం చేసి పలువురుని కాటేశాయి. దీంతో కుక్కల గుంపును చూస్తేనే ప్రజలు జంకిపోతున్నారు. ఇకనైనా గ్రామ నాయకులు, అధికారులు స్పందించి కుక్కల బేడాదా తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు

• **అవసరమైన సౌకర్యాలు కల్పిస్తాం**

• **ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు**

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించడం, ఖాళీగా ఉన్న సిబ్బంది నియామకానికి చర్యలు తీసుకుంటామని భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు చెప్పారు. జిల్లాకేంద్రంలోని ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం ఆయన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఆసుపత్రి పర్యవేక్షకులు, వైద్య కళాశాల ప్రిన్సిపాల్, వైద్య సిబ్బందితో సౌకర్యాల కల్పన, సిబ్బంది నియామకం, మెరుగైన వైద్య సేవలకు అధునాతన పరికరాల ఏర్పాటు తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైద్యులు నిబద్ధతతో పనిచేస్తేనే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని తద్వారా జిల్లాకు మంచి పేరు, ప్రఖ్యాతులు వస్తాయని తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణ అత్యంత ప్రధానమని స్పష్టం చేశారు. 24 గంటలు వైద్య సిబ్బంది అందు బాటులో ఉండి ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వైద్య రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అవసరమైన సిబ్బంది నియామకానికి, పరికరాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆసుపత్రిలో పారిశుధ్యం, క్లీనింగ్ బాగా లేదని అన్నారు. మురుగు నీరు నిల్వలు లేకుండా డ్రైనేజీ పనులు చేపట్టి నీళ్లు బయటికి పంపేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందించేందుకు అవసరమైన సిబ్బంది నియామకానికి కావలసిన విభాగాల ప్రత్యేక వైద్యులను నియమిస్తామని తెలిపారు. ఇప్పటికే సి.ఎస్.ఆర్ నిధుల ద్వారా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ప్రత్యేక



చొరవతో సి.టి స్కాన్ మిషన్ ఏర్పాటు చేయడం జరిగిందని త్వరలోనే సి.టి స్కాన్ మిషన్ ను ప్రారంభించి రోగులకు అందుబాటులోకి తెస్తామని అన్నారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ సింగరేణి సి.ఎస్ఆర్ నిధులతో వైద్య విద్యార్థులకు బస్ సౌకర్యం కల్పిస్తామని ఆయన అన్నారు. ఈ సమావేశంలో ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు డా రాజేంద్రప్రసాద్, వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా జె.వెంకటేశ్వర్లు, వైద్యులు పాల్గొన్నారు.

# మంత్రుల పర్యటనను అడ్డుకుంటాం

• **బిజెపి గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి**

**రాంబాబు నాయక్**



**గూడూరు,ఆగస్టు02(జనంసాక్షి):** కాంగ్రెస్ మంత్రులు ఎం అభివృద్ధి చేశారని మానుకోటకు వస్తున్నారని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి రాంబాబు నాయక్ అన్నారు.మంగళవారం గూడూరు మండల కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో మండల పార్టీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా రాంబాబు నాయక్ మాట్లాడుతూ 2023 ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 6హామీలను అమలు చేయని కాంగ్రెస్ పార్టీ,ఇప్పుడు మా లంబాడిలను ఎస్టి రిజర్వేషన్ జాబితా నుండి తొలగించాలని ప్రయత్నం చేస్తుందని అన్నారు.అదే విధంగా నేడు మహబూబాబాద్ జిల్లా పర్యటనకు వస్తు న్న మంత్రులు అధికారంలో వచ్చిన తర్వాత మహబూబాబాద్ లో ఏం అభివృద్ధి చేశారో సమాధానం ఇచ్చి రావాలని అయన డిమాండ్ చేశారు. లేనియెడల మహబూబాబాద్ ప్రాంత ప్రజల పక్షాన భారతీయ జనతా పార్టీ అండగా నిలబడి మంత్రుల పర్యటనలను అడ్డుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షులు మోతిలాల్,జిల్లా కౌన్సిల్ మెంబర్ మెరుగు మల్లయ్య గౌడ్,మాజీ మండల అధ్యక్షులు పిఏసిఎస్ డైరెక్టర్ గుండె బోయిన మల్లేష్, మండల ప్రధాన కార్యదర్శి నల్గొండ అనిల్,సీనియర్ నాయకులు పడాల నాగరాజు,కోరే దేవేందర్, పాల్గొన్నారు.

# సమర్థవంతంగా గిరిజనులకు సంక్షేమ పథకాలు

**అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్**

**నిర్మల్ బ్యూరో,సెప్టెంబర్2(జనంసాక్షి) :** గిరిజనులకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రతి ఒక్కరికి అందేలా అధికారులు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తెలిపారు.మంగళవారం పట్టణంలోని టీఎన్జీవో హాల్ లో ఆధికర్మయోగి పథకం పరిధిలో మూడు రోజులపాటు జరిగే బ్లాక్ మాస్టర్ శిక్షణ కార్యక్రమాన్ని అదనపు కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వం అనేక అభి



వృద్ధి,సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు.ప్రతి గిరిజన కుటుంబానికి చేరేలా సంక్షేమ పథకాల లబ్ది చేకూరేలా కృషి చేయాలనీ ఆదేశించారు. ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు గిరిజనులకు అందినప్పుడే ఆర్థిక, సామాజిక ప్రగతి సాధ్యం అవుతుందన్నారు. పాల్గొన్నారు.

# ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్లు,డ్రైనేజ్ అభివృద్ధికి 5 కోట్ల నిధులు



**నిర్మల్ రూరల్,సెప్టెంబర్ 2(జనంసాక్షి):** నిర్మల్ నియోజకవర్గంలో సిఆర్ఆర్,ఎస్‌సిపి నిధుల ద్వారా ఎస్సి కాలనీలో సీసీ రోడ్లు,డ్రైనేజీల అభి వృద్ధికి 5 కోట్ల రూపాయల నిధులు మంజూ రైనట్లు నిర్మల్ శాసనసభ్యులు మహేశ్వర్ రెడ్డి తెలిపారు.గ్రామాల్లోని ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజ్‌ల నిర్మాణానికి ఈ నిధులు మం జూరు అయినట్లు ఆయన తెలిపారు. నియోజ కవర్గంలో నిర్మల్ గ్రామీణ మండలంలోని న్యూ పోచంపాడ్, అనంతపేట,కౌట్ల కే, భాగ్యనగర్, సారంగాపూర్ మండలంలోని గోడి ౨ ఎర, కంకేట, నారాయణపల్లె, వైకుంఠపూర్, వంజర్, నేతాజీ నగర్, లక్ష్మణచందా మండలంలోని బోరె గావ్, కంజర్, చింతల చందా, చామన్ పల్లి, తీర్పెల్లి, మామడ మండ లంలోని టెంబూర్ని, ఆదర్శనగర్, న్యూ లింగంపల్లి, దిలవార్ పూర్ మండలంలోని కంజర్,కదిలి గ్రామాలకు నిధులు మంజూరు అయినట్లు తెలిపారు.

# కేంద్ర ప్రభుత్వ పీఎం విశ్వకర్మ యోజన

**ఇద్దరు మహిళలకు ఆర్థిక చేయుత**

**గణపురం, సెప్టెంబర్02 (జనంసాక్షి) :** గణపురం మండలం రవీనగర్ గ్రామం మహిళలకు కేంద్ర ప్రభుత్వం ద్వారా పీఎం విశ్వకర్మ యోజన పథకం కింద పోతారపు లక్ష్మి, పల్లెవేణి సంధ్య లకు మంగళవారం పూలు అల్లుకునే 15 వేల రూపాయల విలువ చేసే కిట్టును ఉచితంగా పోస్ట్ ఆఫీస్ ద్వారా అంద జేశారు. ఈ పథకం ద్వారా వారం రోజులు శిక్షణ పొందిన వారం రోజులకు 4000 నగ దును అందజేశారు. ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు పొందడానికి బ్యాంకు ద్వారా 5 పైసలా వడ్డీకి ఒక లక్ష రూపాయల లోన్ ను అందించారు. లబ్ధిపొందిన మహిళలు మా కుటుంబాలకు ఆర్థిక తోడుబాటుకు సహకరిం చిన ప్రధాని నరేంద్ర మోడీ కి ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరేలా సహకరించిన బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తి సత్య పాల్ రెడ్డి, గణపురం బిజెపి మండల అధ్యక్షులు ఊరకు మహిళలు కృతజ్ఞతలు తెలియజేశారు.

# స్థానిక ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు గెలుపొందాలి

• **బిజెపి ఎన్నికల జిల్లా కన్వీనర్ నాగేశ్వరరావు**

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 2(జనంసాక్షి):** స్థానిక సంస్థల ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థులు మెజార్టీ స్థానాల్లో గెలుపొంది కాషాయం జెండా ఎగరవేయాలని బిజెపి జిల్లా ఎన్నికల కన్వీనర్ అరిగెల నాగేశ్వరరావు అన్నారు. మంగళవారం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా బిజెపి పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ, గెలుపొందే అభ్యర్థులకు ఎంపి టిసి, జెడ్పిటిసి అభ్యర్థులను బలపరచాలని కోరారు. గ్రామాల్లో కేంద్ర ప్రభుత్వ సాయంతోనే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. సిసి రోడ్లు, ఉపాధి పనులు, పేదలకు ఉచితరేషన్ బియ్యం తదితర పథకాలు కేంద్ర ప్రభుత్వ సహాయంతోనే అమలు అవుతున్నాయని తెలిపారు అంతకు



ముందు ఎన్నికైన జిల్లా, మండల స్థాయి నాయకు లకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా అధ్యక్షులు శ్రీశైలం, జిల్లా మాజీ అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, తదితరు పాల్గొన్నారు.

# డే కేర్ సెంటర్ వృద్ధులకు అండగా నిలవాలి

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** డే కేర్ సెంటర్ వృద్ధులకు అండగా నిలవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ కోరారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఉండే డే కేర్ సెంటర్‌ను మంగళవారం రెడ్ క్రాస్ సొసైటీకి కేటాయించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వృద్ధుల జీవితంలో సాంత్వన, ఆదరణ, సహాయం కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని అన్నారు. ఈ డే కేర్ సెంటర్‌లో వృద్ధులు తమ చివరి దశలో ఆత్మీయ వాతావరణంలో గౌరవంగా, ఆనందంగా జీవించేందుకు సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని, రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ సెంటర్ నడిపిం



చబడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి మల్లీశ్వరి, డిఎం అండ్ హెచ్ఓ మధుసూదన్, రెడ్ క్రాస్ సొసైటీ శ్రీనివాస్, క్రిష్ణ మోహన్, సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆడపిల్లలను రక్షించాలి.. ఆడపిల్లలను చదివిద్దాం

• **లింగ నిర్ధారణ నియంత్రణ చట్టం, స్త్రీ ప్రాముఖ్యతపై అవగాహన**

**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 02 (జనంసాక్షి) :** గర్భధారణ పూర్వ, గర్భస్థ పిండ నిర్ధారణ ప్రక్రియపై రాయిని గూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పనిచేస్తున్న వైద్యాధికారులు, సూపర్వైజర్స్, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావు ముఖ్య అతిథిగా విచ్చేసి సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ.. "ఆడపిల్లలను రక్షించాలి, ఆడపిల్లలను చదివిద్దాం" అనే నినాదంతో గ్రామాలలో విస్తృతమైన అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించి ఆడపిల్లలను రక్షించాలని, అప్పుడే ఆ దేశం సుభిక్షంగా ఉంటుందని తెలిపారు. గ్రామాల్లో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు గ్రామసభల్లో, గ్రామ ఆరోగ్య కమిటీల్లో లింగ నిర్ధారణ నియంత్రణ చట్టం గురించి, స్త్రీ ప్రాముఖ్యత గురించి వివరించాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల అభివృద్ధి, శిశు సంక్షేమ కార్యక్రమాల ఏర్పాటు గురించి ప్రజలకు వివరించాలని తెలి పారు. ప్రైవేట్ ఆసుపత్రులలో లింగ నిర్ధారణ టెస్టులు చేపడితే అట్టివారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోబ డుతాయని వివరించారు. తెలంగాణ ప్రభుత్వం మహిళాభివృద్ధి, శిశు



సంక్షేమశాఖలోనీ భాగమైన, మిషన్ శక్తి, విభాగం డిస్టిక్ కోఆర్డినేటర్ రమాదేవి మాట్లాడుతూ, ములుగు జిల్లాలో ప్రభుత్వ శాఖలను సమన్వయపర్చుకొని, గర్భ ధారణ పూర్వ, గర్భస్థ పిండ నిర్ధారణపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయిని గూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ ప్రసాద్, డాక్టర్ నాగ అన్వేష్, డెమో సంపత్, సఖి సెంట్రల్ అడ్మిన్ లావణ్య, సూపర్వైజర్స్ స్పెషలిస్ట్ ఇన్ ఫైనాన్స్ లిటరసీ శిరీష, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# మెనూ ప్రకారం నాణ్యమైన పోషకాహారం అందించాలి

• **చంద్రుపట్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల,పేరూరు పి. హెచ్. సి. ఆకస్మిక తనిఖీ**

**వాజేడు,సెప్టెంబర్ 2 (జనంసాక్షి):** ఇందిరమ్మ ఇండ్ల పనులను త్వరగా పూర్తి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్ అన్నారు.వాజేడు మండలం టేకుల గూడెం గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణపు పనులను జిల్లా కలెక్టర్ మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ లబ్ధిదారులతో ఇందిరమ్మ బిల్లులు పడుతున్నాయా లేదా అని అడిగి తెలుసు కున్నారు. గ్రామంలో మొత్తం ఎన్ని ఇండ్లు నిర్మాణంలో ఉన్నాయని, నిర్మాణంలో ఉన్న ఇండ్లను త్వరగా పనులు పూర్తి చేయాలన్నారు. మంజూరు అయినంత వరకు ఇండ్ల పనులు జరుగుతున్నాయ, ఏఏ దశలో ఉన్నాయని, పనులు జరిగినంత వరకు ఫోటో కాప్చర్ పూర్తి చేశారా అని అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి స్కూల్లో మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన పోషకాహారం అందించాలని మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సూచించారు. అనంతరం పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ నిర్వహించి కలెక్టర్ మాట్లాడుతూ ఈ వర్షాకాలంలో వచ్చే మలేరియా డెంగ్యూ వ్యాధుల నియంత్రణలో ఏ ఒక్క వైద్య ఉద్యోగి నిర్లక్ష్యం వహించకూడదని



లేని యెడల వారిపై శాఖాపరమైన కఠిన చర్యలు ఉంటాయని ఆదేశించారు.కార్యక్రమంలో తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపిఓ శ్రీకాంత్, ఎంఈఓ వెంకటేశ్వర్లు, పేరూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ రాహీల్, పిఆర్ఏ ఈ ప్రభాకర్, ఆరోగ్య విస్తరణ అధికారి వేణుగోపాల కృష్ణ పాల్గొన్నారు.

# పోక్సో నేరంపై జడ్జి కఠిన తీర్పు

• **58ఏళ్ల నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష**

• **1000 జరిమానా విధించిన జిల్లా జడ్జి**

**కడెం సెప్టెంబర్ 2(జనంసాక్షి):** కడెం మండలంలోని నచ్చన్ ఎల్లాపూర్ గ్రామ పంచాయతీ, పెత్తార్పు గ్రామానికి చెందిన జాడి నారాయణ(58)అనే వ్యక్తి, అదే గ్రామానికి చెందిన 05 ఏళ్ల చిన్నారిపై 2020 సంవత్సరంలో అఘాయిత్యానికి పాల్పడి అత్యాచారం చేశాడు.ఈ ఘోర ఘటనపై కుటుంబ సభ్యులు కడెం పోలీసులను సంధర్శించగా, వెంటనే కడెం పోలీస్ స్టేషన్ లో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.కేసు విచారణ సందర్భంగా సంబంధిత సాక్ష్యాలు,ఆధారాలను సేకరిం చి కొట్టుకు అప్పజెప్పడంతో సెప్టెంబర్ 2 మంగళవారం రోజున నిర్మల్ జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ కోర్టు ఫోక్సో ప్రత్యేక న్యాయస్థానంలో గౌరవ న్యాయమూర్తి శ్రీమతి శ్రీవాణి గారు, సాక్షదారాలు పరిశీలించిన మీదట నిందితుడికి 20 సంవత్సరాల కఠిన జైలు శిక్ష విధించడంతో పాటు రూ.1,000/- జరిమానా విధించారని పోలీసు అధికార్నులు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ డా: జి.జానకి షర్మిల ఐపీఎస్ మాట్లాడుతూ...సమాజంలో నేరం చేసిన వారు ఎవరూ కూడా శిక్ష నుండి తప్పించుకోలేరని ఎస్పీ తెలిపారు.నిర్మల్ పోలీసులు మరియు ప్రాసిక్యూషన్ వారు వ్యూహంతో న్యాయ విచారణ మరియు న్యాయ నిరూపణ జరిపి ఖచ్చితంగా శిక్షలు పడేలా చేస్తారని సూచించారు. పోలీసు శాఖ ప్రజల భద్రతకు కట్టుబడి, నేరస్తులపై కఠిన చర్యలు తీసుకుంటూ, న్యాయస్థానాల ద్వారా శిక్షలు పడటానికి తగిన సాక్షులను న్యాయస్థానాలలో ప్రవేశపెట్టటానికి నిర్మల్ పోలీసులు కృషి చేస్తారని అన్నారు.నిందితుడి శిక్ష పడడంలో కృషిచేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె. వినోద్ రావు , విచారణ అధికారులు డి.ఉపేందర్ రెడ్డి (అడిషనల్ఎస్పీ), టి.ప్రేమ్ దీప్(ఎస్ఐ) , డ్యూటీ ఆఫీసర్స్ అయిన ASI – దల్లు సింగ్, ప్రభాకర్ HC, కె.శేఖర్ PC, రాజ్ కుమార్ PCలను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

# జిల్లా అదనపు కలెక్టర్ ఆదేశాలతో టాక్లిలో గ్రామసభ

**జనంసాక్షి వార్తకు స్పందన**

**బాసర, సెప్టెంబర్ 02 (జనంసాక్షి) :** ఇటీవలే భారీ వర్షాలతో నిర్మల్ జిల్లాలోని బాసర మండలం టాక్లి గ్రామంలో వరద ప్రభావంతో వరద వలయంలో టాక్లి గ్రామం... విపత్కర పరిస్థితిలో గ్రామ ప్రజలు అని జనం సాక్షి పత్రిక ప్రచురించిన వార్తతో జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ గ్రామాన్ని సందర్శించి గ్రామంలో నెలకొన్న సమస్యలను రెండు రోజులలో పరిష్కరింప చేస్తానని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో మరసటిరోజే గ్రామంలో నిలిచిపోయిన రాకపోకల సమస్యను పరిష్కరించి గ్రామసభ ఏర్పాటు చేసి గ్రామంలో నెలకొన్న సమస్యలన్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంగళవారం గ్రామసభ నిర్వహించి గ్రామంలో ఉన్న ప్రధాన సమస్యలలో గ్రామం నుంచి రోడ్డు ఇరువైపులా భారీ డ్రైనేజీ ఏర్పాటు చేయాలని, గ్రామానికి బైపాస్ రోడ్డు ఏర్పాటు



చేయాలని, గ్రామ విధులలో సిసి రోడ్డు ఏర్పాటు చేయాలని, ప్రధానమైన రోడ్డు రెండు చోట్ల కలవట్లు ఏర్పాటు చేయాలని గ్రామ సభలో తీర్మానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ ఇచ్చిన హామీ మేరకు గ్రామ ప్రజలు గ్రామ సభలో ఈ తీర్మానం ఏకగ్రీవంగా చేసినందుకు ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయత్ ఆఫీసర్ గంగా సింగ్, గ్రామాధికారి, ఏ డబ్ల్యు టి ద్రౌపతి, ఆశ వర్కర్ సుజాత, గ్రామస్తులు యోగేష్, ఎస్ లక్ష్మణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆరోగ్యశ్రీ సేవలను సత్వరమే పునరుద్ధరించాలి

• **సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు**

**కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 2 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ సేవల కింద ప్రైవేట్ ఆస్పత్రులకు చెల్లించాల్సిన రు.1300 కోట్లు ప్రైవేట్ హాస్పిటల్ యాజమాన్యాలకు వెంటనే



చెల్లించాలని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాదులోని పార్టీ కార్యాల యంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రైవేట్ హాస్పిటల్ యాజమాన్యాలకు బిల్లులు చెల్లించక పోవడంతో ఆరోగ్యశ్రీ కింద పేద ప్రజలకు వైద్య సేవలను నిలుపి వేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 80 శాతమంది ప్రజలు ప్రైవేట్ హాస్పిటల్ లలో వైద్య సేవలు పొందుతున్నారని తెలిపారు. కేవలం 20 శాతం మంది మాత్రమే ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతు న్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేస్తున్న ఆయుష్మాన్ నిధులను రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేస్తుందని ఆరోపించారు.

# 5 నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలని ధర్నా

**ఆదిలాబాద్ ప్రతినిది (జనంసాక్షి) :** 104 ఉద్యోగుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జిల్లా కేంద్రంలో 104 ఉద్యోగు లు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి నవీన్ కుమార్ మాట్లాడు తూ 104 లో ఉద్యోగులు గత 17 సం వైద్య సేవలు అందిస్తున్నారు. కానీ ఇం త వరకు ఉద్యోగుల సమస్యలు పరిష్కా రం కావడం లేదన్నారు. ప్రస్తుతం 10 4 ఉద్యోగులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. 2025 ఏప్రిల్ నుండి ఆగష్టు104 ఉద్యోగుల 5నెలల వేతనాల రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ రిలీజ్ చేయ లేదన్నారు. అదేవిధంగా కంటిన్యూషన్ ఇవ్వకుండా ఉద్యోగులను వెట్టి చాకిరీ చేయించు కుంటు న్నారన్నారు.5 నెలల వేతనాలకోసం అనేక సార్ల రాష్ట్ర ప్రభుత్వంకు ఉన్నంత



స్థాయి అధికారు లను కలిసి విన్నవించిన సమస్యల పరిష్కా రం కాకపోవటం తప్పని సారి పరిస్థితి లో 104 ఉద్యోగులు అందరం ఆందో ళన బాట చేస్తూ ఈరోజు జిల్లా కలెక్టర్ ఆఫీస్ దగ్గర ధర్నా కార్యక్రమం చేపట్ట డం జరిగిందన్నారు. పరోక్షంగా 104 ఉద్యోగుల ఆందోళనకు ఈ రాష్ట్ర ప్ర భుత్వం, అధికారులె కారణం వర్షం కాలం సీజనల్ వ్యాధులు ప్రాబ్ల స్తున్న సందర్భంగా 104 ఉద్యోగులు పనిచే స్తున్న దగ్గర వైద్య సేవలు నిలిచి పో యాయన్నారు. జిల్లా అధికారులు స్పం దించి వెంటనే 104 ఉద్యోగులకు పెం డింగ్‌లో ఉన్న 5నెలల వేతనాలు చెల్లి ంచాలని కోరుతూ వేతనాలు చెల్లి ంచే వరకు 104 ఉద్యోగుల ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమం లో జిల్లా అధ్యక్షులు మామిడి వెంకన్న, 104 ఉద్యోగులు సురేందర్, ప్రశాంత్, నాగనాథ్, వీర కేశవ్, సంధ్య ఇక్బాల్, ఇబ్రహీం మొదలైన పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయండి

• **జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**


• **కుడా చైర్మన్, బల్దియా కమిషనర్లతో సమీక్షించిన కలెక్టర్**

**వరంగల్ ప్రతినిధి, సెప్టెంబర్ 2 (జనంసాక్షి):** జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. మంగళవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్లో కుడా చైర్మన్ ఇనగాల వెంకటరామిరెడ్డి, జి డబ్ల్యు ఎం సి కమిషనర్ చాహత్ బాజ్ పాయ్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇన్నర్ రింగ్ రోడ్ భూసేకరణ పురోగతి, గుండు చెరువు, ఖిలా వరంగల్, నిర్వాసితులకు పరిహారం, చెల్లింపు, పర్యాటక ప్రదేశంగా ఉరుసు గుట్ట అభివృద్ధి,కాకతీయ మెగా టెక్స్టైల్ పార్కులో గ్రీనరీ, చెరువులకు ఎఫ్టిఎల్ ల ఏర్పాటు తదితర అంశాల పురోగతిని సమీక్షించి సమర్థ నిర్వహణకు అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్



సత్య శారద మాట్లాడుతూ.. కుడా చైర్మన్ ఇనగల వెంకట్రాం రెడ్డితో కలిసి గతంలో పలుమార్లు సందర్శించి ఏకవీరదేవి దేవాలయాన్ని పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దుటకు చేయాల్సిన పనులపై అధికారులకు పలు సూచనలు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, ఇరిగేషన్ ఎస్ ఈ రాంప్రసాద్, ఈఈ కిరణ్ కుమార్, టీజీఐఐసీ జోనల్ మేనేజర్ స్వామి, జిల్లా ఉద్యానవన అధికారి శ్రీనివాస రావు, ఎస్ ఇ ఎన్పిడిసిఎల్ గౌతమ్ రెడ్డి, ఆర్డీవో సత్యపాల్ రెడ్డి, కుడా పిఓ అజిత్ రెడ్డి, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీలో ఓటర్ల జాబితా ప్రదర్శన



**కాళేశ్వరం, సెప్టెంబర్ 03,(జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం , జిల్లా కలెక్టర్ ఆదేశాల ప్రకారం భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం గ్రామ పంచాయతీలో గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా వార్డుల ప్రకారం తుది జాబితా నోటీస్ బోర్డులో ప్రదర్శించారు. ప్రజలకు ఏవైనా అనుమానాలు ఉంటే గ్రామ పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ తెలిపారు.

జనంసాక్షి
www.janamsakshi.org
బుధవారం
3 సెప్టెంబర్ 2025

# కవిత పనుల వల్ల బీఆర్ఎస్‌కు నష్టం!

- కుటుంబం కన్నా పార్టీ ముఖ్యమని చాటిన కెసిఆర్
- పార్టీ ఎమ్మెల్యేలు వివేకానంద, పల్లాల స్పందన




**హైదరాబాద్, సెప్టెంబర్ 1 (జనంసాక్షి) :** ఎమ్మెల్సీ కవిత పనులవల్ల బిఆర్ఎస్ పార్టీకి నష్టం జరుగుతోందని గుర్తించారని బిఆర్ఎస్ ఎమ్మెల్యే వివేకానంద తెలిపారు. మాజీ సిఎం కెసిఆర్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నా మని అన్నారు. వివేకానంద మీడియాతో మాట్లాడుతూ.. పార్టీకి నష్టం చేస్తే ఎవరినీ ఉపేక్షించేది లేదని నిర్ణయం తీసుకున్నారని, తప్పు చేస్తే కుటుంబసభ్యులనైనా సహించనని కెసిఆర్ గతంలోనే చెప్పారని తెలియజేశారు. కన్న బిడ్డ కంటే కష్టంలో పార్టీకి అండగా ఉన్నవారే ముఖ్యమని చాటారని, పార్టీ కంటే ఎవరూ పెద్ద కాదన్న విషయం స్పష్టమైందని వివేకానంద పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తల నిర్ణయం మేరకే ఎమ్మెల్సీ కవితను బీఆర్ఎస్ నుంచి సస్పెండ్ చేసినట్లు ఆ పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు. పార్టీకి వ్యతిరేకంగా ఎవరూ మాట్లాడిన చర్యలు తప్పవని.. కూతురైన, బంధువువైనా సరే.. పార్టీ శ్రేయస్సే కేసీఆర్‌కు ముఖ్యమని తేల్చి చెప్పారు. ఎమ్మెల్సీ కవిత సస్పెన్షన్‌పై పల్లా రాజేశ్వర్ రెడ్డి స్పందించారు. కవిత కాంగ్రెస్ పార్టీ ఉచ్చులో పడి బీఆర్ఎస్ సీనియర్ నాయకులపై బాధ్యత రహితమైన ప్రకటనలు చేయడం దురదృష్టకరమన్నారు. ప్రాంతీయ పార్టీలలో కుటుంబ కలహాలు సృష్టించడం కాంగ్రెస్ పార్టీకి అలవాటని విమర్శించారు. దేశంలో అనేక ప్రాంతీయ పార్టీలలో చిచ్చు పెట్టడం కాంగ్రెస్ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య అని అన్నారు. 60 లక్షల పార్టీ కార్యకర్తల మనోభావాలను దెబ్బతినకుండా కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారని.. కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. నేత కేసీఆర్ కూతురు, ఎమ్మెల్సీ కవితను బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. గత కొద్ది రోజులుగా కవిత ప్రవర్తిస్తున్న తీరుతెన్నులు, కొనసాగిస్తున్న పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు బీఆర్ఎస్ పార్టీకి నష్టం కలిగించే విధంగా ఉన్నందున ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కేసీఆర్ నిర్ణయించారు. ఈ మేరకు బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి రవీందర్ రావు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడటం, పార్టీ కీలక నేతలకు వ్యతిరేకంగా మాట్లాడటంతో కవితను బీఆర్ఎస్ పార్టీ నుంచి బహిష్కరించినట్లు- ప్రకటనలో పేర్కొన్నారు. కవిత సస్పెండ్‌ను బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలందరూ స్వాగతిస్తున్నారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. కొంతకాలంగా పార్టీకి నష్టం కలిగించేలా కవిత వ్యవహరిస్తున్నారన్నారు. కవిత సస్పెన్షన్ విషయంలో పార్టీ సరైన నిర్ణయం తీసుకుందని ఆయన అభిప్రాయపడ్డారు. కేసీఆర్ తన కుమార్తె కవిత కంటే పార్టీ భవిష్యత్తు ముఖ్యమని సందేశం ఇచ్చారన్నారు. అయితే కవిత చేస్తున్న ఆరోపణలను ఎవరూ విశ్వసించరని గుర్తు చేశారు. కష్ట కాలంలో పార్టీకి వెన్నుదన్నుగా ఉండాల్సిన కవిత శత్రువులకు చేయూత నివ్వడంతో తమ మనసులు బాధిస్తున్నాయని బాజిరెడ్డి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కవిత ప్రభావం ఏమీ ఉండదంటూ ఆయన జోస్యం చెప్పారు.

# పార్టీయే ముఖ్యం.. కుటుంబం కాదు

- కెసిఆర్ నిర్ణయంతో మరోమారు స్పష్టం
- కవిత వెనక ఎవరో ఉన్నారన్న అనుమానం
- బీఆర్ఎస్ మహిళా నేతలు సత్యవతి, గొంగడి సునీత




**హైదరాబాద్, సెప్టెంబర్ 1 (జనంసాక్షి) :** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ సస్పెన్షన్ వేటు- వేయడంపై ఆ పార్టీలోని సీనియర్ నేతలు సత్యవతి రాథోడ్, గొంగిడి సునీత స్వాగతించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నేతలు మాట్లాడుతూ.. మూడు నెలలుగా కవిత చేస్తున్న ఆరోపణలపై తమ పార్టీ అధినేత కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. తమ పార్టీ నాయకుడు తీసుకున్న ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని స్పష్టం చేశారు. ఆయన నిర్ణయానికి తాము మద్దతు తెలుపుతున్నట్లు ప్రకటించారు. కవితను సస్పెండ్ చేయడంతో మహిళలు ఎక్కువగా సంతోషిస్తున్నారని పేర్కొన్నారు. కవిత తీరు బీఆర్ఎస్ కార్యకర్తల మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయని చెప్పారు. సోమవారం కవిత చేసిన వ్యాఖలతో కేసీఆర్ చాలా బాధపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టాన్ని నివారించడం కోసం కార్యకర్తలకు మనో ధైర్యం ఇవ్వడం కోసం కవితని సస్పెండ్ చేశారని వివరించారు. పార్టీకి నష్టం చేస్తే సొంత కుటుంబ సభ్యులపైన కూడా చర్యలు తీసుకుంటానని కేసీఆర్ గతంలో చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా సత్యవతి రాథోడ్ గుర్తు చేశారు. కోట్ల మంది పార్టీ కార్యకర్తల కంటే పేగు బంధం ఎక్కువ కాదంటూ ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. తాము ఎన్నిసార్లు చెప్పినా కవిత.. తన వైఖరిని మాత్రం మార్చుకోలేదన్నారు. పార్టీ కంటే ఎవరు పెద్ద కాదని చెప్పారు. కవిత వ్యాఖ్యలు.. పార్టీ నేతలను మనోవేదనకు గురిచేశాయని చెప్పారు. కవిత వెనుక ఎవరో ఉండి మాట్లాడుతున్నారని ఈ సందర్భంగా సందేహం వ్యక్తం చేశారు. తమ నాయకుడి బిడ్డగా కవితంటే తమకు గౌరవం ఉందన్నారు. కానీ ఆమెకు దక్కిన గౌరవాన్ని కాపాడుకో లేక పోయిందని విచారం వ్యక్తం చేశారు. పార్టీ ఉంటే ఎంత పోతే అనడం ఏంటంటూ కవితను ఈ సందర్భంగా ఆమె సూటిగా ప్రశ్నించారు. మరి నువ్వు ఉంటే ఏంటి? పోతే ఏంటి? అంటూ కవితకు సత్యవతి రాథోడ్ చురకలంటించారు. బిఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేస్తానంటే తానే వద్దనట్లు కవిత చెప్పారని.. అలాంటి ఆమె మీద కేసీఆర్‌కు ఎంత ప్రేమ ఉందో తెలుస్తుందని పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కవిత తనకు తానే గొయ్యి తీసుకుందని గొంగిడి సునీత స్పష్టం చేశారు. కేసీఆర్‌ను గౌరవించినట్లే కవితను సైతం తెలంగాణ సమాజం గౌరవించిందని గుర్తు చేశారు. బిఆర్ఎస్ ఉంది కాబట్టే కవితకు ఎంపీగా, ఎమ్మెల్సీగా పోటీ- చేసేందుకు బి ఫాం ఇచ్చారన్నారు. అది మరిచి పార్టీ ఉంటే ఎంత పోతే ఎంత అంటారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్ర స్థాయిలో అడుగు పెట్టీ- చూడండంటూ కవితకు గొంగడి సునీత సవాల్ విసిరారు. నిన్ను నిలదీసేందుకు సిద్ధంగా ప్రజలు ఉన్నారని చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ నీకు నచ్చక పోవచ్చు.. కానీ తెలంగాణ సమాజం మాత్రం బీఆర్ఎస్ పార్టీని కోరుకుంటు-దని పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ద్రోహం చేసిన వారిలో మీరు ఒకరిగా మిగలాలంటే తాము చేసేది ఏమిలేదని కవితకు గొంగడి సునీత సూచించారు. బీఆర్ఎస్ పార్టీలోని సీనియర్ నేతలు హరీష్ రావు, సంతోష్‌లపై కవిత చేసిన వ్యాఖ్యలు తనను బాధించాయన్నారు. ఈ పార్టీని నమ్ముకుని ఎంతో మంది ఉన్నారని చెప్పారు. అలాంటి పార్టీ ఉంటే ఎంత పోతే ఎంత అంటే బాధేసిందన్నారు. పేగు బంధం కంటే పార్టీ బంధం గొప్పదని కేసీఆర్ నిర్ణయించారని తెలిపారు. కేసీఆర్ నిర్ణయాన్ని తాను స్వాగతిస్తున్నానని స్పష్టం చేశారు. పార్టీ కార్యకర్తల నిర్ణయం మేరకే కల్వకుంట్ల కవిత సస్పెండ్ చేసినట్లు వెల్లడించారు. పార్టీకి వ్యతిరేకంగా ఎవరూ మాట్లాడిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టినందు వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. కవిత వ్యాఖ్యలు వెనుక కాంగ్రెస్ పార్టీ ఉందని ఆయన కుండ బద్దలు కొట్టారు. కల్వకుంట్ల కుటుంబాన్ని చీల్చాలని కాంగ్రెస్ పార్టీ కుట్ర పన్నిందని ఆరోపించారు. ప్రాంతీయ పార్టీలను చీల్చి వారి కుటు-ంబాలలో చిచ్చు పెట్టడం కాంగ్రెస్ పార్టీకి వెన్నతో పెట్టిన విద్య అంటూ అభివర్ణించారు. కర్ణాటక, తమిళనాడులో సైతం కాంగ్రెస్ పార్టీ ఇదే చేసిందని గుర్తు చేశారు. దురదృష్టవశాత్తు కాంగ్రెస్ పార్టీ మాటలకు కవిత లొంగిపోయిందంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

# లండన్ వినాయక నిమజ్జనంలో విషాదం

- రోడ్డు ప్రమాదంలో ఇద్దరు హైదరాబాదీల మృతి

**హైదరాబాద్, సెప్టెంబర్2 (జనంసాక్షి) :** లండన్‌లో జరిగిన వినాయక నిమజ్జనం రెండు కుటుంబాల్లో విషాదం నింపింది. నిమజ్జనానికి వెళ్లి తిరిగి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు హైదరాబాద్ వాసులు మృతి చెందారు. వినాయక నిమజ్జనానికి వెళ్లి వస్తుండగా రెండు కార్లు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. మృతులను నాదర్ గుల్‌కు చెందిన తర్రె చైతన్య (23), ఉప్పల్‌కు చెందిన రిషితేజ (21)గా గుర్తించారు. ఈ ఘటనలో మరో ఐదుగురికి గాయాల య్యాయి. క్షతగాత్రులు అక్కడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. బాధితులంతా తెలుగు రాష్ట్రాలకు చెందినవారిగా గుర్తించారు. నాదర్ గుల్‌కు చెందిన తర్రె ఐలయ్య, మంగమ్మల చిన్న కుమారుడు చైతన్య. బీ-టెక్ పూర్తిచేసిన ఆయన.. ఉన్నత చదువుల కోసం 8 నెలల క్రితం లండన్ వెళ్లాడు. వినాయక ఉత్సవాలను ఘనంగా నిర్వహిం చుకుని 8 మంది స్నేహితులతో రెండు కార్లలో నిమజ్జనానికి బయల్దే రారు. తిరిగి వస్తున్న సమయంలో వీరి కార్లు ఒకదాని కొకటి ఢీకొన్నాయి. ఈ ప్రమా దంలో చైతన్య, రిషితేజ మృతి చెందారు. ఈ ఘటనకు సంబంధించి సోమవారం రాత్రి కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. వీరి మృతితో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. ఈ ఘటనతో చుట్టుపక్కల వారు కూడా కన్నీరు మున్నీరయ్యారు.

# బిసి బిల్లుకు అడుగడుగునా బిజెపి అడ్డంకులు

- రాహుల్ ప్రధాని కావాలన్నది వైఎస్ కోరిక
- వైఎస్ వర్ధంతి సందర్భంగా పిసిసి నివాళి



**హైదరాబాద్, సెప్టెంబర్2 (జనంసాక్షి) :** గవర్నర్‌ను కలిసేందుకు బిఆర్ఎస్ నేతలు వచ్చారు కానీ.. బిజెపి ముఖం చాటేసిందని టిపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. బిసి రిజర్వేషన్లపై సోమవారం గవర్నర్ వద్దకు అఖిలపక్షం వెళ్లిందని అన్నారు. ఈ సందర్భంగా గాంధీ భవన్ లో మహేష్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. బిసి ఓట్లతో గెలిచిన నాయకులు ఎందుకు స్పందించట్లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం 3 చట్టాలు తెచ్చినా బిజెపి అడ్డుపడుతోందని మండిపడ్డారు. బిసి నాయకులమని, బిసి బిడ్డలం అని చెప్పుకునే అర్హత ఎక్కడిదని నిలదీశారు. మాజీ సిఎం కెసిఆర్ కుటుంబం రాష్ట్ర ప్రజల సొత్తు దోచుకుంటుందని, ప్రజా క్షేత్రంలో బిఆర్ఎస్ కు శిక్షపడిందని విమర్శలు గుప్పించారు. ఘోష్ కమిషన్ నివేదికపై తదుపరి చర్యల నిర్ణయం బిజెపిపై ఉందని, బిఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఎమ్మెల్సీ కవిత భాగస్వామిగా ఉన్నారని తెలియజేశారు. కాళేశ్వరం అవినీతిపై చర్యలు తీసుకోవాలని కెసిఆర్ ను కవిత ఎప్పుడైనా అడిగారా? అని, కవితకు ఈ రోజు కనబడుతున్న అవినీతి ఆ రోజు ఎందుకు కనబడలేదని మహేష్ గౌడ్ అని ప్రశ్నించారు. పంపకాల్లో తేడా జరిగి ఉండవచ్చని.. అవినీతి జరిగింది వాస్తవమని, వాటాల్లో తేడా తప్పు.. ప్రజా సొమ్ము దుర్వినియోగం జరిగిందనేది వాస్తవం అని మహేష్ కుమార్ గౌడ్ విమర్శలు గుప్పించారు. ఇకపోతే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని ప్రధానిగా చూడాలని దివంగత ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చిరకాల కోరిక అని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు. వైఎస్ఆర్ తన కోరిక తీరకుండానే తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ తప్పకుండా ప్రధాని అవుతారని మహేశ్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. నేడు వైఎస్ రాజశేఖరరెడ్డి 16వ వర్ధంతి. ఈ సందర్భంగా గాంధీభవన్‌లో ఆయన చిత్రపటానికి మహేష్ కుమార్ గౌడ్ సహా మాజీ ఎంపీ కేవీపీ రామచంద్రరావు, ఎమ్మెల్యే దానం నాగేందర్, కాంగ్రెస్ సీనియర్ నేతలు నివాళులు అర్పించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ... 'రాహుల్ గాంధీని ప్రధానిగా చూడాలని వైస్ రాజశేఖరరెడ్డి చిరకాల కోరిక. ఆ కోరిక తీరకుండానే ఆయన వెళ్లిపోయారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రతి పౌరుడు రాజశేఖరరెడ్డిని చిరస్మరణీయంగా గుర్తుంచుకుంటారు. కేవీపీ రామచంద్రరావు, దానం నాగేందర్ మహానేత వైఎస్ఆర్ సేవలను గుర్తుచేసుకున్నారు. వైస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు ఇడుపులపాయలోని వైఎస్సార్ ఘాట్ వద్ద నివాళు లర్పించారు. వైఎస్ఆర్ సతీమణి విజయమ్మ, కుమారుడు వైఎస్ జగన్, కోడలు వైఎస్ భారతిలు నివాళులు అర్పించారు. మత పెద్దలు నిర్వహించే ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. వర్ధంతి సందర్భంగా వైసీపీ నేతలు మహానేతను స్మరించుకున్నారు.

# మహేశ్ కో ఆపరేటివ్ బ్యాంక్ అవకతవకలు

- రూ.1.1 కోట్ల విలువైన స్థిరాస్తుల ఈడీ అటాచ్

**హైదరాబాద్, సెప్టెంబర్ 1(జనంసాక్షి) :** హైదరాబాద్ నగరంలోని మహేశ్ కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకు అవకతవకలపై ఈడీ చర్యలకు ఉపక్రమించింది. రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఆదిభట్లలోని రూ.1.1 కోట్ల విలువైన స్థిరాస్తులను ఈడీ అటాచ్ చేసింది. బ్యాంకు మాజీ ఎండీ, సీఈవో ఉమేష్ చంద్ అసవా కుమారుడు రోహిత్ అసవా పేరిట ఈ ఆస్తులు ఉన్నాయి. రుణాల కోసం 2, 4శాతం కమిషన్ వసూలు చేసినట్టు- ఆరోపణలున్నాయి. అక్రమ సొమ్ముతో ఆస్తులు కొనుగోలు చేసినట్టు- ఈడీ గుర్తించింది. మాజీ ఛైర్మన్ రమేష్ కుమార్ బంగ్, ఉమేష్ చంద్ అసవా, పురుషోత్తం దాస్ మందానపై ఇప్పటికే ఎఫ్ఐఆర్‌లు కూడా నమోదయ్యాయి. అక్రమాస్తుల కొనుగోలు ద్వారా మనీలాండరింగ్ జరిగినట్లు ఈడీ భావిస్తోంది. ఈ మేరకు కేసు నమోదు చేసి లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు ఈడీ అధికారులు తెలిపారు.

# జస్టిస్ సుదర్శన్ రెడ్డి గెలుపు అత్యావశ్యకం

- మీడియాతో ప్రొఫెసర్ కోదండరామ్



**హైదరాబాద్, సెప్టెంబర్ 1 (జనంసాక్షి) :** ఈ ఉపరాష్ట్రపతి ఎన్నికలు.. దేశ ప్రయాణం ఏ దిశలో సాగాలో నిర్దేశించే ఎన్నికలని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ అన్నారు. రాజ్యాంగ నిపుణుడైన సుదర్శన్ రెడ్డి గెలుపు అవసరమన్నారు. కొందరి ఆధిపత్యం అడ్డుకోవాలంటే ఆయన గెలవాలని కోదండ అన్నారు. ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతుగా సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కోదండరామ్ మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్య పరిరరక్షణ దేశ ప్రయోజనాలను జస్టిస్ సుదర్శన్ రెడ్డి కాపాడతారు. ఆయనకు మద్దతు ఇవ్వాలని కోరుతున్నట్లు కోదండరామ్ అన్నారు. ఆధిపత్యం, అధికారం కోసం మాత్రమే ఆలోచిస్తున్న కొందరికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను రక్షించడం కోసం పార్టీలకు అతీతకంగా ముందుకొచ్చి జస్టిస్ సుదర్శన్‌రెడ్డిని గెలిపించాలన్నారు. న్యాయ కోవిదులు, యూనివర్సిటీల మాజీ వీసీలు, రాజ్యాంగబద్ధ సంస్థల మాజీ ఛైర్మన్‌లు, సీనియర్ జర్నలిస్టులు, రచయితలు, సామాజిక కార్యకర్తలు, సినీ ప్రముఖులు, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన వ్యక్తులు సుదర్శన్ రెడ్డికి మద్దతుగా సంతకాల చేశారని చెప్పారు. అర్బన్ నక్సలైట్ అంశంపై కోదండరామ్ మాట్లాడుతూ.. అర్బన్ నక్సలైట్ అంటే అర్థం ఏంటో నాకు ఇప్పటికీ అర్థం కాలేదు. అర్బన్ ఏరియాలో పని చేసినంత మాత్రాన నక్సలైట్ ముద్ర వేయడం ఏంటి? ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పనిచేస్తే ఆ ముద్ర వేసేస్తారా?సామాజిక అభివృద్ధి, వికాసం పట్ల ఈ ముద్ర వేసేవారికి వ్యతిరేకత ఉందని అనుకోవాలి. అణచివేసే ప్రయత్నం చేస్తున్నారంటేనే.. ప్రజాస్వామ్యం పట్ల వ్యతిరేకత ఉందని అర్థం అన్నారు.

# వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం

- ఏపీ వ్యాప్తంగా ఎల్లో అలర్ట్ జారీ
- పలు జిల్లాల్లో వర్షాలు పడే అవకాశం

**విశాఖపట్నం, సెప్టెంబర్ 1 (జనంసాక్షి) :** వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడినట్లు- విశాఖ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఒడిశా పరిసర ప్రాంతాల్లో సముద్ర మట్టానికి 1.5 కిలో మీటర్ల ఎత్తులో బలమైన రుతుపవనాల ద్రోణి కొనసాగుతోంది. దీంతో ఏపీ వ్యాప్తంగా ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఉత్తర కోస్తాలో ఒకటెండు చోట్ల అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు- వాతావరణ శాఖ తెలిపింది. అల్పపీడన ప్రభావం సుమారు రెండు రోజుల పాటు- కొనసాగుతుందని పేర్కొంది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మంగళవారం విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, కాకినాడ, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో భారీ వర్షాలకు అవకాశం ఉందని చెప్పింది. బుధవారం అల్లూరి సీతారామరాజు, ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లో భారీ వానలు పడొచ్చని తెలిపింది. సముద్రం అలజడిగా మారిన నేపథ్యంలో శుక్రవారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ సూచించారు. సోమవారం విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అనకాపల్లి తదితర జిల్లాల్లో వానలు పడ్డాయి. అత్యధికంగా సాయంత్రం 5 గంటల వరకు విజయనగరం జిల్లా గుర్లలో 76.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఇదిలావుంటే జూరాల, సుంకేసుల ప్రాజెక్టుల నుంచి శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం క్రమంగా తగ్గుతోంది. దీంతో ఒక గేటు- మూసివేసి ప్రస్తుతం 9 గేట్ల ద్వారా నాగార్జున సాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టులోకి 2,93,723 క్యూసెక్కులు చేరుతుండగా.. 3,34,628 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయం పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 881.70 అడుగులకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీ-ఎంసీలు కాగా ప్రస్తుతం 197.46 టీ-ఎంసీలుగా కొనసాగుతోంది.

# యూరియా కోసం రైతన్నల కష్టాలు

- క్యూలైన్లతో కిక్కిరిసిన సొసైటీ
- పరిస్థితి ఉద్రిక్తం పోలీసుల రంగ ప్రవేశం
- గణపురంలో ఒక్కో రైతుకు ఒక్కో బస్తా చొప్పున 400 బస్తాల పంపిణీ



**గణపురం /ములుగు (వెంకటాపూర్) సెప్టెంబర్ 02(జనం సాక్షి):** యూరియా కోసం రైతులు అవస్థలు పడ్డారు. కేవలం 400 బస్తాలు రావడంతో గణపురం రైతు సొసైటీ ప్రాంగణంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మంగళవారం యూరియా లారీ లోడ్ వస్తుందని తెలుసుకున్న మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు తెల్లవారుజామునే సొసైటీ వద్దకు చేరుకుని క్యూ లైన్ లో బారులు తీరారు. అప్పటివరకు సొసైటీ సిబ్బంది అధికారులు ఎవరూ లేకపోవడంతో ఒకవైపు మహిళలు మరొకవైపు పురుషులు రెండు లైన్లు బారులు తీరాయి. కేవలం 400 యూరియా బస్తాలు మాత్రమే రావడంతో క్రమంగా రైతులు సంఖ్య పెరుగుతుండడంతో వ్యవసాయ శాఖ సొసైటీ సిబ్బంది గణపురం ఎస్ఐ రేఖ అశోక్ కు సమాచారం ఇవ్వడంతో ఆయన తమ సిబ్బందితో అక్కడికి చేరుకొని రైతులను క్యూలైన్లలో వచ్చేలా ప్రయత్నం చేశారు. ఒకసారిగా భారీగా రైతులు తరలి రావడంతో వారిని అదుపు చేయడం పోలీసులకు తలనొప్పిగా మారింది. సుమారు రెండు గంటల పాటు సొసైటీ వద్ద గందరగోళ పరిస్థితి ఏర్పడింది. దీంతో అదనంగా పోలీస్ సిబ్బందిని రప్పించి రైతులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసి క్యూలైన్ల ద్వారా ఒక్కో రైతుకు ఒక్కో బస్తా ఇచ్చే విధంగా చీటీలను పంపిణీ చేశారు. క్యూలైన్ లో గంటల తరబడి నిలబడిన రైతులు యూరియా బస్తాలు దొరకకపోవడంతో అధికారుల తీరుపై రైతులురైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు.

ములుగు జిల్లా వెంకటాపురం మండలం లక్ష్మీదేవి పేట గ్రామంలో యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం వద్ద రైతులు గంటల తరబడి పడిగాపులు కాస్తున్నా సరిపడా స్టాక్ దొరక్క తీవ్ర నిరాశకు గురవుతూ, పంటలకు కీలకమైన యూరియా అందక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యూరియా అందక పంటల పెరుగుదలపై ప్రభావం చూపుతుందనే ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది. యూరియా కోసం రైతులు తెల్లవారుజామున నుంచే పడిగాపులు కాస్తున్న ఘటన వెంకటాపూర్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం ఎదుట ఉదయం 5 గంటల నుంచే రైతులు యూరియా కోసం క్యూ లైన్ కట్టే పరిస్థితి నెలకొంది. యూరియా కోసం రైతులు పడే తిప్పలు తప్పటం లేదు, మండల కేంద్రంలో యూరియా కోసం రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తెల్లవారు జామున 5 గంటలకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం వద్దకు చేరుకున్న రైతులు గంటల తరబడి క్యూలలో నిలబడి గస్తీ కాస్తున్నారు. కానీ యూరియా ఎరువులు సరిపడా అందక ఖాళీ చేతులతో తిరిగి వెళ్తున్నారు. విత్తనాలు వేసి పంటలు నాటిన రైతులకు యూరియా అత్యవసరం అయినా, కొరత కారణంగా పంటల పెరుగుదలపై ప్రతికూల ప్రభావం పడుతుందేమోనని రైతులు భయపడుతున్నారు. పగలు రాత్రి తిరిగినా యూరియా దొరకడం లేదని, పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370